# నాకొ్ంచెం నమ్మకమివ్వు

"విశాఖపట్నం గాలిలోనే కవిత్వం వుందిట. ఇది పీల్చే శ్రీ శ్రీ అంతవాడయ్యాడు. అంచేత, మెడియర్ హనుమాన్లూ; గట్టిగా పీల్చు, ఈ గాలి!" అన్నాడు శ్రీహరి విల్స్ సిగరెట్ పొగ పీల్చి వదులుతూ.

నా పేరు హనుమాన్లు కాదు, గోపాలం అనే గోపాలరావు. కాని శ్రీహరి నా క్లాస్‌మేట్ అయినా నాకు గురుతుల్యుడు; నాకు ఆధునిక భావాలులేవు కనుక నేర్పుతున్నవాడు, అంచేత అతను నన్నెలా పిలిచినా పలుకుతాను. "నిజమే బీచ్‌లో గాలి మరీ బాగుంటుంది" అన్నాను. ఇద్దరం బీచ్ రోడ్ మీద రామకృష్ణ మిషన్ వైపు వెళ్తున్నాం అప్పుడు సాయంత్రం ఐదు గంటలవుతుంది.

నేను, శ్రీహరి యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఫిజిక్స్ చదువుతున్నాం. హాస్టల్‌లో రూంమేట్స్‌మి. అంతేకాదు బియస్సీ కూడా కలిసే చదువుకున్నాం. శ్రీహరికి ఎంత జనరల్ నాలెడ్జి వుందో నాకప్పుడే తెలిసింది. అతను అమెరికన్ నవలలు తెగ చదివేవాడు. అమెరికాలో ఎన్ని రాష్ట్రాలున్నాయో, వాటి ముఖ్య పట్టణాలు ఏవో, ఎక్కడ ఏఏ రకాల ప్రాధాన్యం వుందో, అన్నీ తెలుసతనికి.

అలాగే హాలీవుడ్ నటీనటుల జీవిత చరిత్రలన్నీ అతనికి తెలుసు. అంతే కాదు అతనికి అమెరికన్ ఆధునిక సాహిత్యంలో ఎంతో పాండిత్యం వుంది. అలాగే తెలుగులో గురజాడ, శ్రీ శ్రీ, తాపీ ధర్మారావు, చలం, గోపీచంద్, బుచ్చిబాబు... అందరి రచనల గురించీ, భావాల గురించీ, సిద్ధాంతాల గురించీ మాకందరికీ చెప్పేవాడు. తీరా పరీక్షల్లో చూస్తే అతనికి గుట్టలు గుట్టలు మార్కులొచ్చాయి. నాకు ఓ మోస్తరు ఫస్ట్‌క్లాస్ వచ్చింది.

దాంతో నాకు కళ్లు జిగేల్‌మన్నాయి. మనుషులందరూ ఒకటే అని మా తాత చెప్పేవాడు. కాని ఎప్పుడూ క్లాసు పుస్తకాలు చదివే నాకంటే, ఎప్పుడూ నవలలు చదివే శ్రీహరికి చాలా ఎక్కువ మార్కులొచ్చాక ఆ మాట ఎలా నమ్మడం? అదే అడిగేశాను ఆయనని.

ఆయన నవ్వేసి "మనుషులంతా ఒకటే అంటే అది దేవుడి దృష్టిలోరా నాన్నా. మామూలు వ్యవహారంలో అయితే మనిషికీ మనిషికీ అన్నీ తేడాలే. తెలివీ, బలం, మంచితనం మనిషి మనిషికీ వేరే. ప్రతిభ అని ఒకటుంది. అది కొందరికి పుట్టుకతోనే వుంటుంది. మీ శ్రీహరి అలాటివాడేమో!" అన్నాడు.

నేను అప్పట్నించీ శ్రీహరిని నా గురువుల లిస్టులో వేసేశాను. అది చాలా పెద్ద లిస్టు. దేవుళ్ళతో మొదలవుతుంది. ఋషులు, మహావీరులు, మహాకవులు...చాలామందున్నారు కనుక పేర్లు ఇవ్వడం కుదరదిప్పుడు.

ఏమయితేనేం ఆనాటి నుంచీ నేను శ్రీహరి ఏం చెప్పినా శ్రద్ధగా వినాలనీ, విన్నది మననం చేసుకోవాలనీ, తీవ్రంగా ఆలోచించి వీలైనంత అనుసరించాలనీ నిశ్చయించుకున్నాను.

శ్రీహరి చెబుతున్నాడు: "కవిత్వం అంటే ప్రబోధం. మనిషి ఎలా నడవాలో చెబుతుంది. కవికి సామాజిక అవగాహన, ప్రగతిశీల భావాలు వుండాలి. మూఢనమ్మకాలు, దోపిడీ వీటన్నిటినీ దుయ్యబట్టాలి. ఆర్థిక అసమానతలు, స్త్రీల దుస్థితి మొదలైనవాటిని ఖండించాలి"

నాకేమీ అర్థంకావటం లేదు. మా తాత నాచేత సంస్కృత పంచ మహాకావ్యాలు, కవిత్రయ భారతం, రామాయణం, మనుచరిత్ర, కళాపూర్ణోదయం... ఇవన్నీ చదివించాడు చిన్నప్పట్నుంచీ. ఆయనకి సంస్కృతం రాదు, నాకు సంస్కృతం తెలుగూకూడా రావు. ఎలాగో కుస్తీ పట్టేవాళ్లం. అర్థం చూచాయగా తెలిస్తే చాలనేవాడు మా తాత. కవి క్రాంతదర్శిట. దివ్యదృష్టితో రాస్తాడుట. అంచేత మన స్థాయి పెరిగేకొద్దీ కవిత్వపు లోతులు తెలుస్తాయే గానీ నిఘంటుపాండిత్యం అనవసరమని సర్దేసేవాడు.

"విశ్వశ్రేయః కావ్యమ్" అన్నారు ప్రాచీనులు. విశ్వం అంటే మనుషులే కాదు అన్ని ప్రాణులూ కూడాను. ఆ మాటకొస్తే చెట్లూ, రాళ్లూ కూడాను. అన్నిటికీ మేలు చేయాలి కవిత్వం. జీవితపు లోతుల్ని చూసి ఆనందించే నేర్పు వస్తుందిట గొప్ప కవులనుంచి. దృష్టి దోషం వున్నవాడు కళ్లజోడు పెట్టుకున్నట్లు! కళ్లజోడు ప్రిస్క్రైబ్ చేసే డాక్టరూ, అమ్మేవాడూ మనం ఏం చదవాలో, ఏం చదవకూడదో చెప్పరు. అలాగే కవి ఫలానా సమస్యకి ఇది పరిష్కారం అంటూ చెప్పకూడదని మా తాత సిద్ధాంతం.

ఆ సిద్ధాంతానికీ శ్రీహరి వాదనకీ అస్సలు పొత్తులేదు. ఈ రెండు వాదాల్నీ రాత్రి తాపీగా పోల్చికాని ఏమీ చెప్పకూడదనుకున్నాను. కాని శ్రీహరి ఊరుకుంటేనా? "ఏమిటోయ్? బెల్లం మొత్తిన రాయిలా మొహమేసుకుని మాట్లాడవేం? జీవితంలో నేడు జరుగుతున్న అన్యాయాలూ, కనపడని కుళ్లూ బయటపెట్టాలి సాహిత్యం. అమెరికాలో చూడు. హంతకులు, దోపిడీదొంగలూ, వంచకులూ ...అలాంటి వాళ్లందరిమీదా నవలలూ, నాటకాలూ బోలెడు వస్తున్నాయి. మనవాళ్లో? ఒక్కడు రాయడు ఆ విధంగా. అసలు స్టడీ అనేది వుంటేగా! పాత కావ్యాలనే కొత్త మాటల్తో రాసేస్తారు. అంతా మత్తుమందు సాహిత్యం...ఏమంటావ్?" అని నిగ్గదీశాడు.

నేను ఏం చెప్పాలో తెలీక దిక్కులు చూడడం మొదలుపెట్టాను. నాకు తెలిసిన ఆధునిక సాహిత్యం వార్తాపత్రికల్లో వార్తలూ, సంపాదకీయాలూ మాత్రమే. ఇంకేమీ తెలియదు. ఈ గుట్టు బయటపడితే శ్రీహరి నాతో ఈ విషయాలు మాట్లాడ్డం మానేస్తాడేమోనని భయం వేసింది నాకు. అంచేత మనస్సులోనే నా ఇష్టదైవాలందరికీ నమస్కారాలు పెట్టేసి వేడుకున్నాను. నన్నీ గండం నించి గట్టెక్కించమని. ఈ రోజుతో మా సంక్రాంతి సెలవులు పూర్తవుతాయి. రేపట్నించీ క్లాసులూ, హోమ్‌వర్కూ, పరీక్షలూ వగైరాల భారం పడుతుంది మామీద. దానికి

తోడు శ్రీహరి-నాకు ఆధునిక సాహిత్యం తెలీదనే రహస్యం బయటపడ్డంతో-సరదాగా మాట్లాడ్డం మానేస్తే నా పని హుళక్కే.

నా మొర ఏ దేవుడు విన్నాడో కాని వెంటనే రక్షణ దొరికింది. సముద్రానికి పది గజాల ఇవతలగా ఇసకలో నలుగురు యూనివర్సిటీ అమ్మాయిలు కూర్చున్నారు. వాళ్లు నలుగురూ ఒక గుత్తిలో వున్న నాలుగు పువ్వుల్లా వున్నారు. అంత దగ్గరగా ఇంటిమేట్‌గా కూర్చోవడం ఆడపిల్లలకే చాతవును. కాలేజీలో కూడా అంతే. మేడమెట్ల మీద ఒక్కొక్కళ్లు ఒక్కొక్క మెట్టుమీద వరసగా కూర్చుంటారు సొంత ఇంట్లో కూర్చున్నట్లు. మొగపిల్లలు అలా కూర్చోలేరు.

పై భావాలను నేను బయటకు చెప్పకుండా మనసులోనే ఉంచేసుకుని, వాళ్లక్కడ వున్నట్లు మాత్రం చెప్పాను శ్రీహరికి. శ్రీహరి అటుచూసి వాళ్లను గుర్తించాడు. హేళనగా నవ్వాడు. హేళన వాళ్లనో నన్నో తెలీలేదు. నా మనస్సు ఒక క్షణం చివుక్కుమంది. కాని వెంటనే ఆ బాధని తోసేశాను. మంచి భావాల్నే పదిలం చేసుకోడం మంచిది. చెడ్డభావాలు దుమ్ములాంటివి. ఎలాగో దుమ్ము ఇంట్లోకి వస్తూ వున్నట్లే అవీ వస్తాయి. ఎప్పటికప్పుడు ఓ చీపురు వేస్తే అవే పోతాయి.

"వాళ్లని పలకరిద్దామా?" ఆశగా అడిగాను.

"ఊఁ" అన్నాడు శ్రీహరి.

ఇద్దరం రోడ్డుమీంచి ఇసకలోకి దిగాం. అమ్మాయిల వేపు నడవసాగాం. వాళ్లు మమ్మల్ని దూరాన్నుంచే పోల్చారు. ఏవో అనుకుని ముసిముసి నవ్వుల్తో ఒకరి మొహాలొకరు చూసుకుంటున్నారు మా ఊసే లేనట్లు. ఆడపిల్లల అందాల్లో అదొకటి-మొగాళ్లని లక్ష్యం చేయనట్లు నటించడం!

వాళ్లకి చేరువయ్యాక 'హాయ్' అంటూ చేయి గాలిలో ఊపాడు శ్రీహరి. నేనూ వంత పాడాను. వాళ్లలో ఒక అమ్మాయి సునంద మా క్లాస్‌మేట్. మిగతా వాళ్లతో ముఖపరిచయం మాత్రమే, ప్రముఖ పరిచయం లేదు మాకు. సునంద ఇప్పుడు పరిచయం చేసింది మమ్మల్నీ వాళ్లనీ.

"మీకభ్యంతరం లేకపోతే..." అంటూ ఇసకలో చదికిలపడ్డాడు శ్రీహరి. నేను నిలుచునే వున్నాను.

"నో అబ్జెక్షన్" అంది సునంద. అందులో ఏం జోక్ వుందో కాని మిగతా ముగ్గురూ గొల్లున నవ్వారు. శ్రీహరి కూడా నవ్వాడు.

రెండు మూడు నిమిషాలు; సెలవులు ఎలా గడిపిందీ ఎప్పుడు వైజాగ్ తిరిగి వచ్చిందీ మాట్లాడారు. శ్రీహరి ఉన్నట్టుండి తన సిద్ధాంతాల్ని వివరించసాగాడు.

"మన సొసైటీ బీ.సి. నాటి నమ్మకాలతో ఉంది. అమెరికా ఇంగ్లాండ్ లాంటి దేశాలతో పోలిస్తే మనం వెయ్యేళ్లు వెనకబడి వున్నాం. ఇదంతా మారాలి" అలా స్పీడుగా శ్రీహరి చెప్పేస్తుంటే అమ్మాయిలు నిశ్శబ్దంగా విన్నారు. నాలాగే వాళ్లకీ ఏమీ బోధపడుతున్నట్లు లేదు. నేను

శ్రీహరి ముఖాన్నీ, ఆవేశంతో గాలిలో నాట్యం చేస్తున్న అతని చేతుల్నీ వజ్రాల్లా మెరుస్తున్న కళ్లనీ చూస్తూ అంతా వింటున్నాను.

"...అసలు ఈ వివాహ వ్యవస్థకే కాలం చెల్లింది. షా చెప్పినట్లు ఇది లీగల్ ప్రాస్టిట్యూషన్. ప్రేమలేని పెళ్లి మరింకే మవుతుంది? పెద్దవాళ్లు చేసిన పెళ్లిలో ప్రేమ ఎలా వుంటుంది" శ్రీహరి మాటలు, భావాల మాటెలా వున్నా అతని నిజాయితీ, నిప్పులాంటి ఆవేశం చూస్తే నాకు ఒళ్లు పులకిస్తోంది. కాని ఎంచేతనో ఇద్దరు అమ్మాయిలు ఏదో గుసగుసలాడుకుని హఠాత్తుగా నిలబడి 'మేం రూంకి పోతామే, ప్రయాణం బడలికకదూ. అన్నం తినేసి నిద్రపోతాం' అని కూర్చున్న వాళ్ల జవాబు విననైనా వినకుండా వెళ్లిపోయారు. అప్పుడు కాని నాకు అనుమానం కలగలేదు. శ్రీహరి మాటలు వాళ్లకి నచ్చలేదని. సునంద, వరలక్ష్మి మాత్రం వుండిపోయారు.

నిజానికి నాకేకాదు మా ఫిజిక్స్ క్లాసంతటికీ శ్రీహరే హీరో. అతని ఆధునిక భావాలు, అందమైన విగ్రహం, ఎప్పుడూ లెక్చర్ అవుతుంటే కూడా ఏదో మాట్లాడుతూ వుండడం మా క్లాస్‌మేట్స్‌కి ఎంతో నచ్చాయి. ఎసోసియేషన్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అతన్ని. మా ప్రొఫెసర్‌తో సహా అధ్యాపకులూ అతనేం అల్లరి చేసినా మాతోబాటు నవ్వేస్తారే కాని కోప్పడరు.

అందుకే ఇప్పుడు శ్రీహరి సంఘం, సంప్రదాయం, ప్రేమ, పెళ్లి ఇవన్నీ తన పద్ధతిలో వివరిస్తుంటే సునంద కళ్లలో కనపడే మెరుపూ, ఆరాధనా నాకాశ్చర్యం కలిగించలేదు. ఓ క్షణం నాకు అసూయ కూడా కలిగింది. కాని అసూయ ఆరోగ్యానికి మంచిది కాదని వెంటనే గుర్తొచ్చి దాన్ని నిరాకరించాను.

నేను ఈ మాత్రం అసూయ చెందడానికి కారణం ఒకటుంది. నేను యూనివర్సిటీలో చేరిన కొత్తలో ఒకనాడు సాయంత్రం బీచ్‌కి వెళ్తున్నాను. దారిలో అధ్యాపకుల క్వార్టర్సు ఉన్నాయి. వాటిముందు నేను నడుస్తుంటే నాకు పదడుగుల ముందుగా నలుగురు విద్యార్థులూ వాళ్లకి ఇంకొంచెం ముందుగా సునందా, వరలక్ష్మి నడుస్తున్నారు.

ఉన్నట్టుండి సునంద, వరలక్ష్మి ఓ క్వార్టర్ ముందు ఆగిపోయి, దానివేపే చూస్తూ ఉండిపోయారు. అంతదాకా వాళ్ల గౌరవార్థమే బిగ్గరగా జోక్స్ వేస్తూ అనుసరిస్తున్న విద్యార్థి బృందం అదేం గమనించనట్లే ముందుకు వెళ్లిపోయారు. నేను మాత్రం కొంచెం దూరాన్నుండి వాళ్లని గమనిస్తూ నెమ్మదిగా నడవసాగాను.

చివరికి నేను గ్రహించిందేమంటే సునంద, వరలక్ష్మి అక్కడున్న మామిడి చెట్టువేపు చూస్తున్నారని. నేనూ చూశాను. ఆశ్చర్యం! ఆగష్టులో కూడా మామిడికాయలు వుండటం. నేను వాళ్లకి కొంచెం దూరంగా నిలుచుండిపోయాను.

రెండు నిమిషాలు గడిచినా ఆ అమ్మాయిల దృష్టి మామిడి చెట్టుమీద నుంచి మరలక పోవడంతో వాళ్లిద్దరికీ ఆ కాయలు తినాలనే కోరిక బలవత్తరంగా వుందని స్పష్టమైంది నాకు. పచ్చి మామిడికాయలు ఉప్పు, కారం అద్దుకు తినాలనుకోవడంలో వింత ఏముంది? ఇక్కడ ఆడ మగ విచక్షణ లేదుకదా. నాకూ నోరూరింది.

సునంద మా క్లాసే కనుక ముఖ పరిచయం వుంది. చొరవగా ఆమెను సమీపించి "మామి డికాయలు బాగున్నాయి కదండీ. నిజానికి సీజన్ అయిపోయింది. కాని ఇదేదో స్పెషల్ బ్రీడ్ అయి వుండాలి. మీకు అవి తినాలని వుందా?" అని సూటిగా అడిగేశాను. సునంద, వరలక్ష్మి మాట్లాడలేదు. కాని వాళ్ల సిగ్గుతో తలవంచుకోడంతో నా ఊహ సరైనదేనని తేలిపోయింది.

నేను మాట్లాడకుండా ఆ క్వార్టర్ గేట్ తీసి కాంపౌండ్ లోకి వెళ్లాను. ఇల్లు తాళం వేసి వుంది. కిటికీలు కూడా మూసి వున్నాయి. అది ఖాళీగా వుందని గ్రహించాను. వెంటనే మామిడి చెట్టెక్కి ఆరుకాయలు మాత్రం కోసి, నా దుస్తులకి వాటి మరకలు పడకుండా జాగ్రత్తపడి, క్రిందకి విసిరాను. నేను చెట్టు దిగి వచ్చి చెరో రెండూ వాళ్లకిస్తూ "ముందుగా వీటిని కడగాలి. పంప్ హౌస్ దగ్గర నీళ్లుంటాయి. అటు పదండి. నేను స్టోర్స్ లో ఉప్పు, కారం కొని తెస్తాను. నడుస్తూండండి" అన్నాను. వాళ్లు అప్పుడు నోరు తెరిచారు 'థాంక్స్' అనడానికి.

పది నిమిషాల తర్వాత వాళ్లని బీచ్ లో కలుసుకుని, నా పోకెట్ నైఫ్‌తో మామిడి కాయల్ని చీలుస్తూ కూడా; నేను మామిడి కాయల్ని దొంగిలించడం తప్పా రైటా, అని ఆలోచిస్తూనే వున్నాను. ధర్మ సందేహం అంటే ఇలాగే వుంటుంది. క్వార్టర్స్ యూనివర్సిటీ ఆస్తి. కాని ఉద్యోగులు వాటిలో ప్రవేశించాక వాటిలో పండే కాయా కసరూ వాళ్లవే. ఓ క్వార్టర్స్ ఖాళీగా ఉన్నప్పుడు దాని ఆవరణలో ఉన్న మామిడిచెట్టున కాసిన కాయలు ఎవరికి చెందాలి?

అలాగే పెళ్లి కాని స్త్రీపురుషుల మధ్య వచ్చే ఆకర్షణ మొదలైన భావాల విషయంలోనూను. నేను నైషధం మొదలైన కావ్యాలు చదివినవాణ్ణి. సహజంగా నేనెలాంటి వాణ్ణయినా కవులు నాకో రకం భాష నేర్పారు. స్త్రీలకీ, పురుషులకీ ఒకరంటే ఒకరికి వుండే భావాలు చాలా సున్నితమైనవీ, ఆనందప్రదమైనవీనని.

వాళ్లిద్దరూ ఆడిపిల్లలు అయి వుండకపోతే నేను మామిడి చెట్టెక్కి కాయలు కోసి యిచ్చేవాడినా? ఇక్కడ వున్నది ప్రత్యేకాకర్షణ కాదా? ఆ తర్వాత నాకు సునంద ఓ పువ్వు లాగా, వెన్నెల రవ్వలాగా గుర్తొస్తుంటే నేను ఆ భావాల్ని అణుచుకోవాలా, పెంచుకోవాలా?

మొన్న సెలవులకి వెళ్లినప్పుడు ఈ సమస్యలని మా తాతకి వివరించాను. ఆయన ఒక్క క్షణంలో సమాధానం చెప్పాడు. విభావాలు, అనుభవాలు, సంచారీభావాలు అంటే ఏమిటో వివరించి, ఇద్దరు మనుషుల మధ్య ఏ విషయమైనా ఒక్కరి భావాలవల్ల ఒక స్థాయి చేరదనీ, సునంద భావాలు తెలిస్తే తప్ప ఆమెను గురించి నేను కావాలని ఏ సంకల్పమూ పెట్టుకోకూడదనీ సలహా ఇచ్చాడు. ఈలోగా నాకొచ్చే కలల మాటేమిటి అన్నాను ఏడుపు గొంతుపెట్టి.

"అవి నువ్వు సంకల్పిస్తే రాలేదుగా; నీ పూచీలేదు. సంకల్పం దగ్గరే మన బాధ్యతా, జాగ్రత్తా. నువ్వు బస్సు కుదిపితే తూలి ఒక అమ్మాయి వొంటిని రాసుకున్నావనుకో. దానికీ నువ్వు కావాలని తూలు తెచ్చిపెట్టుకోడానికీ తేడా వుంది. మొదటిది దైవికం, రెండోది సంకల్పితం. రెండోదాన్నే నువ్వు తప్పించుకోగలవు" అన్నాడు. నా మనస్సు శాంతించింది.

అందుకే ఇప్పుడు నా కళ్లెదుటే శ్రీహరి మాటలు వింటూ సునంద పరవశించిపోతున్నా

నా అసూయ క్షణంలో మాయమైంది.

అలా అరగంట గడిచింది. నేను, శ్రీహరి, అమ్మాయిలిద్దర్నీ వాళ్ల హాస్టల్ గేటువద్ద దిగబెట్టి బస్‌లో యూనివర్సిటీ చేరాం. బస్‌లోనూ, మెస్‌లోనూ శ్రీహరీ నేనూ మాట్లాడుకునే వీలు కలగలేదు. అంతసేపూ నేను బీచ్ లో విన్నదంతా నెమరు వేసుకున్నాను.

హఠాత్తుగా నేనొక విషయం గుర్తించాను. శ్రీహరి బీచ్ లో మాట్లాడుతున్నంత సేపూ అతని సిద్ధాంతాలే వచ్చాయి కాని వ్యక్తిగత విషయాల ప్రసక్తే లేదు. శ్రీహరి కేవలం ఆదర్శాలకోసం పోరాడుతున్నాడే తప్ప, సునందని ఈ పురుష ప్రపంచంలో సెకండ్ సెక్స్ అయిన స్త్రీజాతికి ప్రతినిధిగా చూస్తున్నాడే తప్ప ఆమె భావాలేమిటి, కలలేమిటి, ఆదర్శాలేమిటి అని అసలు పట్టించుకోనే లేదు. శ్రీహరి భావితరాల నాయకుడు, ఒక యుగకర్త అనిపించి నా ఒళ్లు పులకించింది.

## 2

మేం మా రూంకి చేరేసరికి తొమ్మిదయింది, తాళం తీస్తున్నాను. ప్రక్క రూంలోంచి ఏడుపు వినిపిస్తోంది. మురళీధర్! 'ఈస్టుకోస్ట్'లో వచ్చి వుంటాడు.

శ్రీహరి నవ్వుతూ "మీ అరవ హీరో వచ్చేశాడోయ్. పాపం తల్లి చాటు బిడ్డ! అమ్మా నాన్నల్ని వదిలేసి చదువుకోసం ఏభై ఆరు మైళ్లు వచ్చేశాడని ఎలా కుమిలిపోతున్నాడో చూడు" అన్నాడు. నేను మురళీధర్ గదిలోకి వెళ్లబోయాను. శ్రీహరి నన్ను రెక్కపట్టి ఆపేశాడు. "ఏడవనీ. జీవితంలో వీక్‌ఫెలోస్‌కి స్థానం లేదు. తొంభై ఏళ్లొచ్చి మూడేళ్ళ బాబులా ఏడుస్తున్నాడు ఇడియట్. నువ్వేం కలగజేసుకోకు. ఎంకరేజ్ చేసినట్లుంటుంది."

నిజమే. మురళీధర్ సెలవులకి ఇంటికెళ్లి తిరిగి కాలేజీకి వచ్చాక వారం రోజులదాకా రాత్రి పగలు కళ్లువాచేలా ఏడవడం నాకూ నచ్చలేదు. ఇరవై సంవత్సరాలు నిండేక కూడా అమ్మ అన్నం కలిపి పెట్టాలి, నాన్న కథలు చెప్పి బజ్జోపెట్టాలి అనుకోడం, అలా జరగలేదని ఏడవడం అసహజమనే అనిపిస్తుంది.

కాని అసహజం ఎవరికి? మురళీధర్ కి మాత్రం కాదు. అతన్ని తల్లిదండ్రి గారంగా పెంచి వుంటారు. వేరే హాస్టల్‌లో వుండడం కష్టం అని అతనికి నమ్మకం గట్టిగా కలిగి వుండాలి. ప్రతీదానికీ వెనుక గతంలో వుంటుంది కారణం. కారణం లేని కార్యం వుండదు. ఈ సత్యాన్ని గుర్తించడమే హేతువాదం. అంటే దేన్నీ ద్వేషించకపోవడం, కారణాన్ని గురించి పరిశోధించడం. హేతువాది ఏ సిద్ధాంతాన్నీ ఖండించకూడదు. ప్రతి సిద్ధాంతానికీ కారణం వుంటుంది కనుక. దీన్నే పూర్వులు "లోకోభిన్నరుచిః" అన్నారు. అందుకే నేను మురళీధర్‌ని అతని ఏడుపుని సానుభూతితో చూడాలని నమ్మాను.

"ఈ మురళీధర్ స్టుపిడ్, ఇర్రేషనల్ ఫెలో. ఇలాంటివాళ్ల మూలానే దేశం ఇలా ఏడుస్తోంది. తాతగారి, తండ్రిగారి భావాలకి దాసులు, ఉత్త మొద్దురాచ్చిప్పలు, కాకినైనా పోలరు" అన్నాడు శ్రీహరి.

మురళీధర్‌ని అతనేడుపుకు అతన్ని వదిలేయడానికి నాకు మనసొప్పలేదు. కాని శ్రీహరి కళ్లలో కనపడ్డ ఓ వింతభావం నన్నాపేసింది. 'నన్ను కాదని వెళ్తావా' అన్నట్లున్న అతని

చూపులో నాకేదో తెలియని ఆందోళన కనిపించింది. అందులోనూ నేను కొద్ది నిమిషాల క్రిత మే అతను ఆదర్శజీవి గొప్ప హీరో అని గుర్తించాను కూడాను. మురళీధర్ మీదకు కట్టలు తెంచుకు ప్రవహిస్తున్న నా కరుణా ప్రవాహాన్ని గుండెల్లోనే దాచుకుని, విష్ణుమూర్తిని తల్చు కున్నాను. "ఈ మురళీధర్‌ని నువ్వే రక్షించాలి తండ్రీ..."

ఇద్దరం మంచాలమీద పడుకున్నాం. శ్రీహరికి మురళీధర్ పెంపకం గురించి చెప్పాను. అతను అమెరికాలో పిల్లల్ని ఎలా పెంచుతారో చెప్పాడు. చంటిపిల్లల్ని కూడా వేరే గదిలో పడుకోపెడతారుట. "ఇంట్లో ఒక్క గదే వుంటేనో" అని నేను అడిగేసరికి శ్రీహరికి కోపం వచ్చి. ఎడ్నా బాత్ టబ్ అనే రచయిత్రి వ్రాసిన లేటెస్ట్ బెస్ట్ సెల్లర్ చదవసాగాడు. నేను కళ్లు మూసు కుని దైవప్రార్థనలో కొంతసేపుండి నిద్రపోయాను.

మర్నాడు నిద్ర లేచేసరికి ప్రక్క గదిలోంచి మురళీధర్ ఏడుపు వినిపిస్తూనే వుంది మాకు. శ్రీహరి చికాకుపడుతూ "ఇదిసైకియాట్రీ కేసు. ప్రతి కాలేజీలోనూ సైకియాట్రిస్టు ఒకడేనా వుండాలి. అమెరికాలో అంతే. ఎంతమంది ఉన్నా చాలటం లేదుట. మురళీధర్ లాంటి వాళ్ళ సమస్యల్ని అలా పరిష్కరించాలి గాని ముసలమ్మలా నాయనా, బాబూ నీకు జీళ్లు కొని పెడతా అంటూ గారం చేస్తే ఇంకా ముదురుతుంది" అన్నాడు తీవ్రంగా.

నాకు సైకియాట్రిస్ట్ అంటే అర్థంతెలీదు. శ్రీహరి వివరించాడు. మానసిక రోగాలని కుదిర్చే డాక్టర్‌ట.

"అంటే భూత వైద్యుడా?" అన్నాను. కోపంతో శ్రీహరి నన్ను కొట్టినంత పని చేశాడు, పొరపాటుకి చింతిస్తున్న నా బిక్కమొహం చూసి వెంటనే నవ్వుతూ "నీ అజ్ఞానం అనంతమోయ్ గుండూరావ్. నిన్ను కాదు నిన్ను పెంచిన పేరెంట్స్‌ని అనాలి" అన్నాడు.

నాకామాట చిన్న గాయం చేసింది.

"ఇందులో నా పేరెంట్స్ తప్పేముంది?"

"మరెవరు పెంచారు?"

"మా తాతా, నాయనమ్మాను. మానాన్నా అమ్మా ఉద్యోగాలమీద దేశం తిరుగుతూ వుంటారు. అంచేత నేను మా తాతగారింట్లోనే పెరిగాను"

"అయితే ఇహనేం. నీది తప్పున్నర పెంపకం!"

నాకు ఏడుపొచ్చింది కాని తమాయించుకున్నాను. మా తాత నాకు ఆది గురువు. ఆయన్నెవరు తూలనాడినా అది నాకు అవమానమే. కాని వెంటనే ఆయన చెప్పిన మాటలే గుర్తొచ్చాయి. ఎవరేనా చెడుగా మాట్లాడితే ఆ మాటలు గాలికిపోతాయనీ, ఆ మాటల్ని పట్టిం చుకోకూడదనీ, అంచేత పదిక్షణాల్లో తేరుకుని నవ్వేశాను.

నన్ను పెంచిన మా తాత గురించి శ్రీహరి ఒక్కమాటేనా అడగలేదు. అడిగితేనా, అంతా చెప్పేద్దును. మా తాతకి డభ్భై అయిదేళ్లనీ అయినా కళ్లూ, పళ్లూ నిక్షేపంలా ఉన్నాయనీ, రోజూ నాలుగు మైళ్లు షికారు నడుస్తాడనీ, యోగాసనాలు వేస్తాడనీ, నాకోసం అరవై నాలుగో ఏట సంస్కృతం నేర్చుకుని నాకు నేర్పాడనీ...ఇంకా ఎన్నెన్నో. కాని శ్రీహరికి వ్యక్తులు అనవసరం.

అతని సిద్ధాంతం సామాజికం. 'మంచి గతమున కొంచెమేనోయ్' అనేది అతని నమ్మకం కనుక మా తాత గురించి ఏమీ తెలీకపోయినా ఆయన్ని పరమ ఛాందసుల లిస్టులో వేసేశాడు.

అదే అతని ఘనత. సమాజాన్ని మార్చే వీరులకి వ్యక్తుల వ్యక్తిత్వాలని ఒక్కొక్కళ్ల ప్రత్యేకతల్ని లెక్కేస్తూ కూర్చునే అవసరం ఏముంది? అందుకే దూరానవున్న మా తాత దాకా ఎందుకు ఎదటవున్న యూనివర్సిటీ ప్రొఫెసర్లనే నిశితంగా విమర్శించేవాడతను. "వీళ్లంతా ఫాసిల్స్. అంటే తెల్సుగా! ప్రాచీన జంతువుల అవశేషాలు. ఒక్కడిలో ఒరిజినాలిటీ, స్పార్క్ లేవు. ఒక్క కొత్త ఐడియా లేదు. అన్నీ బూజుపట్టిన భావాలే. ముసిలివాటం, ముసిలి మనస్సులూ" అనేవాడు.

శ్రీహరి చెప్పేవీ నేను అనుకునేవీ ఏ విషయంలోనూ కలిసేవి కావు. కాని నాకు అతని మీద గౌరవం పెరిగిపోతోంది. అతను రోజుకో కొత్త సిద్ధాంతం తెస్తుంటే ఆలోచించే వ్యవధి లేక అన్నీ పెద్ద డైరీలో రాసుకోడం మొదలెట్టాను. ఏ సెలవుల్లోనో తాపీగా వాటిని అర్థం చేసుకోవాలని.

## 3

చదువుల్లో అనేక రకాలున్నాయి- సాహిత్యం, చరిత్ర, ఫిజిక్స్, బయాలజీ వగైరా ...అసలు యూనివర్సిటీ అనేదే ఇన్ని రకాల విజ్ఞానాన్ని ప్రతి విద్యార్థికి రుచి చూపించడానికీ, ఒక ప్రత్యేక రంగంలో ప్రావీణ్యం ప్రసాదించడానికీ ఏర్పడిందిట.

కాని నేను చూసినది వేరు. చాలామంది యూనివర్సిటీ విద్యార్థులు, ఆ మాటకొస్తే అధ్యాపకులూ కూడా మరో డిపార్ట్‌మెంట్‌లో ఏం చెప్తారో కూడా పట్టించుకోరు. ఆర్ట్స్‌వాళ్లు సైన్స్‌వాళ్లనీ, సైన్స్‌వాళ్లు ఆర్ట్స్‌వాళ్లనీ ఇద్దరూ కలిసి ఇంజనీరింగ్ వాళ్లని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తారు. ఒకరి గురించి ఒకరికి అన్నీ అపోహలే.

విద్యార్థులలో ఎంతో వైవిధ్యం వుంది. కాని సామాన్య లక్షణం మాత్రం ఎలాగో ఓలాగా డిగ్రీ తెచ్చేసుకుంటే చాలనే చిన్న కోరిక. విధిలేక చదివినట్లు పాఠం పుస్తకాలు చదవడం. వాళ్ల తీరిక సమయాలన్నీ 'గేస్' కొట్టడంతోనే గడిచిపోతాయనిపించేవి. క్రికెట్ కామెంటరీ, సినిమా పాటలు వినడం, డ్రస్ గురించీ, అమ్మాయిల గురించీ, సినిమాల గురించీ చర్చించడం చాలా మంది హాబీ. కొందరు మాత్రం అంతర్జాతీయ రాజకీయాలే తప్ప మరేమీ చర్చించరు. వ్యాయామం, ఆటలాడటం బహు తక్కువ. అందుకే చాలామంది నీరసంగా చిప్పి దవడలూ, గూని నడకా వగైరా ముసిలి లక్షణాలతో ఎంతో జాలి పుట్టిస్తూ వుంటారు.

ఈ వాతావరణంలో నాకు శ్రీహరి ఆశాజ్యోతిలా కనపడ్డంలో ఆశ్చర్యం ఏముంది; నేను మా తాత ఇచ్చిన శిక్షణవల్ల భారతీయుల ప్రాచీన సంప్రదాయం, సాహిత్యం, సంస్కృతి కొంత మనసుకు పట్టినవాణ్ణి. కాని నాకు ఆధునిక విలువలూ, పరిణామాలూ శ్రీహరి వల్లనే తెలిశాయి.

జీవితం నిత్యనూతనం. ఎందుకంటే, అది పరమాత్మ కల్పన కనుక. మనిషిని పోలిన మనిషి, జీవితాన్ని పోలిన జీవితం, సంఘటనని పోలిన సంఘటన లేకుండా ఎప్పుడూ ఎవరూ ఊహించని పరిణామాలతో నడుస్తుంది ఈ సృష్టి. అందుకే నూతనత్వమే జీవితం, మార్పు

లేనిది నిర్జీవం.

శైలేంద్ర అనే గొప్ప సినీమా కవి ఉండేవాడుట. అతను 'శ్రీ 420' అనే సినీమాలో అలాగే రాశాడుట. శ్రీహరి నాకు ఆ పాట పాడి వినిపించాడు. "చల్ నా జీవన్ కీ కహానీ, రుక్ నా మౌత్ కీ నిశానీ..." ఆ పాటకి అర్థం తెలిసేసరికి నా హృదయం పులకించిపోయింది. అతికష్టం మీద కళ్లనీళ్లని ఆపుకుని శ్రీహరివేపు చూశాను. జీవితం ఎంత గొప్పది.

శ్రీహరి నా హర్షానందాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదు. తన భావాన్ని మరోలా చెప్పసాగాడు. "వేదాల్లోనే రైళ్లూ, ఆటంబాంబులూ వున్నాయంటూ లొట్టలేస్తారు మనవాళ్లు. అందుకే మనదేశం ఇలా వుండిపోయింది. మార్క్స్ అందుకే తత్వవేత్తలు ఇన్నాళ్లూ జీవితం గురించి వివరించి ఊరుకున్నారనీ, కాని చేయాల్సిన పని జీవితాన్ని మార్చడం అనీ చెప్పాడు. కాని మన దేశంలో ఏ పార్టీకి మార్క్స్ ఆదర్శాల్ని అనుసరించే అర్హత లేదు. అందుకే నేను అన్నీ చదివి అర్థం చేసుకొని అసలైన దారి కనిపెడతాను. "నన్నెవ్వరాపలేరీవేళా, నా ధాటికోర్వలేరీ వేళా" అని సగం సీరియస్‌గా, సగం జోక్‌గా పాడి నవ్వేశాడు.

శ్రీహరితో కలిసి నేనూ ఈ సమస్యల్ని మిగతా విద్యార్థులతో చర్చించే వాణ్ణి. వాళ్లెవరికీ సమస్యల్లోని లోతు, జటిలత్వం తెలిసినట్లు లేదు. కాని శ్రీహరి గొప్ప మేధావి అని ఒప్పుకునేవారు. మెస్‌లో భోజనాల దగ్గర, క్లాస్‌రూంలో మేస్టార్లు లేటుగా వచ్చినప్పుడూ, క్లాసులు జరగనప్పుడూ (రోజూ అవే ఎక్కువ) నలుగురూ శ్రీహరి చుట్టూ చేరేవారు. అతనేం చెప్పినా కాదనకుండా వినేవారు.

నేను మాత్రం వీలు దొరికినప్పుడల్లా ఈ విషయాలన్నిటినీ మౌనంగా చర్చించుకునేవాణ్ణి. శ్రీహరి వాడే సిద్ధాంతాలన్నీ గత నూరేళ్లుగా వచ్చినవి. ఇవి లేని కాలంలో మనుషులు ఎలా బతికారు? వాళ్ల జీవితాలలోనూ వెలుగు, వికాసం, అభ్యుదయం ఉండేవి కదా. ఏ విజ్ఞానమూ లేకుండానే వేలయేళ్లక్రితం వేదాలూ, షడ్దర్శనాలూ, ఉపనిషత్తులు, ధర్మసూత్రాలు, మహాకావ్యాలూ వచ్చాయా? శ్రీహరి సిద్ధాంతాలు ఎక్కడనుంచి పుట్టాయి? ఈ సిద్ధాంతాలు జీవిత సమస్యల్ని పరిష్కరిస్తాయా? ఇలా ఆలోచిస్తుంటే నాకు బుర్ర వేడెక్కి పోయేది రాత్రిళ్లు.

పాత అంతా చెత్త అయితే క్రొత్త ఎక్కణ్ణుంచి వచ్చింది? ఆకాశం మీంచి ఊడిపడిందా? ఒక్కొక్కప్పుడు నాకు శ్రీహరి మాటలంటే చిరాకేసేది. అతనికి దేవుడు, మతం, గురువు, సంప్రదాయం, పెద్దల మాటలు అంటే విపరీతమైన అసహనం. అతను నేను విలువ యిచ్చే అన్నిటినీ (మా తాత నేర్పినవి) తగిలేదీ తప్పేదీ చూడకుండా తిట్టేవాడు. ఇతనికేమైనా పిచ్చా? అనిపించేది.

కాని దీనికి విరుగుడులాంటిది మా తాత చెప్పిన ఒక వాక్యం. "అన్నీ విను, ఆలోచించు, నీ అనుభవంతో సరిపోల్చు; ఆచరణకి వీలుకానిది ఎంత గొప్పగా కనిపించినా మత్తుమందే, వినడం మాత్రం మానకు" ఈ మహావాక్యానికి తిరుగులేదు. శ్రీహరి సిద్ధాంతాలు గొప్పవే అనిపిస్తోంది నాకు. కాని వాటిని ఆచరణలో పెట్టి అందరికీ నచ్చేలా చేసే బాధ్యత అతనిది, నాది కాదు.

హరి కథలో హరి ప్రసక్తే వుండకపోవచ్చు. పిట్ట కథలు మాత్రం వుంటాయి. అవి చమత్కారంగా వుంటాయి. అలాగే శ్రీహరి చెప్పే సిద్ధాంతం మాటెలా వున్నా వాటిని వివరించడంలో అతను ఇచ్చే దృష్టాంతాలు, శాస్త్ర విషయాలు, చారిత్రికాంశాలూ చాలా విలువైనవి. అతనితో 'మాట్లాడ్డమే ఓ ఎడ్యుకేషన్'.

* * *

ఓ రోజు ఉదయాన్నే మెస్‌లో కాఫీ టిఫిన్ ముగించి వస్తున్నాం. "హరీ! సిద్ధాంతానికి ఆచరణే గీటురాయి అన్నారు మీ మార్క్స్. నీ సిద్ధాంతాల్ని ఆచరణలో పరీక్షిస్తున్నావా" అని అడిగాను.

ఓ క్షణం బిత్తరపోయాడు శ్రీహరి. వెంటనే నావైపు తిరిగి కళ్లలోకి చూస్తూ "నాది రెడీ మేడ్ సిద్ధాంతం ఏం కాదు. ఇంకా ఫైనల్ షేప్ రాలేదు" అన్నాడు. అతని నిజాయితీ నిష్కల్మషత్వం నన్ను వెర్రెత్తించాయి."శ్రీహరీ నువ్వు నిజంగా దేవుడివి" అన్నాను.

"దేవుణ్ణి నమ్మను నేను"

"మరెవర్ని నమ్ముతాయి"

"మానవుణ్ణే నమ్ముతాను" అతనింకేదో చెప్పబోతుంటే ఓ ఏభై ఏళ్ల పాతకాలపు మనిషి ఒకడు మమ్మల్ని సమీపించాడు. రెండు చేతులూ ఎత్తి నమస్కరించాడు.

ఆయన పేరు అంబాజీపేట ఆనందాంజనేయులు. హైస్కూలు టీచర్. కవిత్వం రాస్తుంటాడు. కవిత్వం రసమయంగా సృష్టించి ఆనందాన్ని పంచడం, తద్వారా లోకశ్రేయస్సుకి దోహదమవడం ఆయన జీవితాదర్శం. భుజాన వున్న గుడ్డ సంచీలోంచి రెండు పుస్తకాలు తీసి మా యిద్దరికీ ఇచ్చాడు.

"ఈ ఆరాశ్వాసములు గల ఆధునిక ప్రబంధం శృంగార ప్రధానమైనా, వీరం, రౌద్రం, శాంతం కూడా కలిగివుంది. మీరు దీన్ని అమ్మడంలో నాకు సాయం చేయాలి" అన్నాడు అం.ఆ.ఆ.

శ్రీహరి కళ్లు వింతగా మెరిశాయి. అతను నన్ను దగ్గరకు పిలిచి చెవిలో చెప్పాడు. "సిద్ధాంతం ఆచరణ అని ఓ గొడవలేవు కదోయ్ శకారుడూ. ఇప్పుడు చూడు నా తడాకా" అని అం.ఆ.ఆ.వైపు తిరిగి "మీ 'ప్రబంధం' ముందుగా చదవకుండా ఏం చెప్తాం మేస్టారూ. శృంగారం అంటే స్టూడెంట్సు పడిచస్తారని మీకు తెలుసో తెలీదో. దానికోసం అడ్డమైన గడ్డి చదివేస్తున్నారు రాత్రిళ్లు తలుపులేసుకుని. మీరన్న రసం దీనిలో వుందా, ఫస్ట్ ఎడిషన్ అంతా పదిరోజుల్లో చెల్లిపోతుంది. మీరు మూడు నాలుగు రోజులు పోయాక రండి" అన్నాడు. అం.ఆ.ఆ. మమ్మల్ని ఆనందంగా దీవించి వెళ్లిపోయాడు.

ఆ తర్వాత రెండు రోజులు ఏకబిగిన ఆ ప్రబంధం చదివాం మేం. అది 'చంద్ర-కుముదిని' అనే పేరుగల నలభై ఏడు పేజీల పుస్తకం. ఆ కాసిని పేజీల్లోనూ అభిప్రాయాలు-ప్రశంసలు, అంకితం పద్యాలు, దేవతా ప్రార్థన, కృతి కర్త, కృతి భర్తల ఫోటోలు, ప్రాచీన కవుల పొగడ్తలు, కుకవి నింద వగైరా తీసేస్తే మిగిలింది ముప్పై తొమ్మిది పేజీలు.

నిడదవోలు అనే నగరంలో చంద్ర అనే జాలరికీ కుముదినీ అనే కులీన యువతికీ జరిగిన ప్రణయకథే చంద్ర-కుముదిని. మొదటి ఆశ్వాసం నగర వర్ణనతో మొదలవుతుంది. నిడదవోలు నగరం పాటలీపుత్రం, హంపీ మొదలయిన చారిత్రాత్మక నగరాలకు తీసిపోదు. ఈ నగరంలో అన్ని వర్ణాలవారూ తన వర్ణాలకు తగిన విధంగా ధర్మబద్ధంగా చతుర్విధ పురుషార్థాలనూ సాధిస్తూ వుంటాయి. ఇక్కడ కోకిలలూ, కాకులూ, బాతులూ వంటి పక్షులు కూడా శాస్త్ర చర్చలు చేస్తూ వుంటాయి.

తర్వాత కుముదిని ప్రస్తావన. ఆమె సకల కళా విశారద. అయినా ఏ కారణం చేతనో హైస్కూల్లో చదువుతూ వుంటుంది. ఓ రోజు సాయంత్రం ట్యూషన్ నించి వస్తుంటే నలుగురు ఆమెను ఆటకాయిస్తారు. భారత స్త్రీకి ప్రాణం కంటే మానం ముఖ్యం కనుక ఆమె ప్రక్కనే ఉన్న నిడదవోలు మడుగులోకి దూకేస్తుంది. దూరాన చేపలుపడుతున్న చంద్ర సాహసంతో కుముదిన్ని కాపాడతాడు.

ఆ తర్వాత చంద్ర కుముదినిల ప్రేమ, విరహం, చంద్రుణ్ణి మలయమారుతాన్నీ తిట్టడం, కుముదిని తల్లీ తండ్రీ ఆమె ప్రేమను మొగ్గలోనే తుంచేయడానికి ప్రయత్నించడం, పోస్ట్‌మన్ రాయబారం ...చివరకి వాళ్ల కళ్యాణం...ఇలా సాగుతుంది ప్రబంధం.

చదువుతూ లైను లైనుకీ పగలబడి నవ్వేశాడు శ్రీహరి. అంచేత మాకు 'చంద్ర కుముదిని' చదవడానికి రెండు రోజులు పట్టింది. పూర్తయ్యేలోగానే అతని మనస్సులో ఏదో పథకం మెదుల్తోందని నేను ఊహించాను.

"ప్రవరుడూ, ఈ కవికి మనం ఘనంగా సన్మానం చేయాలి. అం.ఆ.ఆ. పదిహేనో శతాబ్దంలో ఉండదగ్గ కవి. రాస్కెల్. ఇది రాయడమే తప్పు. రాసింది చాలక అచ్చు వేయించడం ఇంకా నేరం. అది చాలక దీని ఖరీదు తొమ్మిది రూపాయలు పెట్టి అమ్మడానికి తయారయ్యాడు. వీడికి బుద్ధి చెప్పాలి" అన్నాడు శ్రీహరి.

తన ప్లాన్ కూడా చెప్పేశాడు. సన్మానం అని పిలిచి మీటింగ్ పెట్టి అందరిచేతా తిట్టించడం. వేదికమీదనో, వేదిక దిగాకనో నాలుగు మొట్టికాయలు వేసి "దీన్ని ప్రథమ తప్పుగా పరిగణించి ప్రాణాలతో వదిలేస్తున్నాం. మళ్లీ కవిత్వం రాస్తే చంపేస్తాం" అని ఓ హామీపత్రం ఇవ్వడం.

నిజానికి నాకూ నచ్చలేదు చంద్రకుముదిని. అందులోనూ మహాకావ్యాలు చదివినవాణ్ణేమో ఇది చదువుతుంటే ఒళ్లు మండిపోయింది. కవి, శృంగారాన్ని ఉద్దేశించినచోట బీభత్సరసం, వీరం అనుకున్నచోట హాస్యం సృష్టించాడు. ఘోరంగా వుంది. కాని తప్పు చేస్తే అదతని కర్మ. ఎవడి పాపం వాడినే కొడుతుంది అదే చెప్పాను శ్రీహరికి.

"ఇది రాయడం అతని పూర్వజన్మ పాపఫలం అయితే, మనం చదవడమూ అంతే. ఏనాడో తెలిసో తెలియకో ఎవర్నో హింసించి దుఃఖపెట్టి ఉంటాం, ఇప్పుడీ ప్రబంధం చదివే దుర్గతి కలిగింది. అంటే మనకి పాప ప్రక్షాళనం అయిందన్నమాట. అలా సంతోషించి ఊరుకుందాం శ్రీహరీ" అన్నాను లాలించే ధోరణిలో. అతనొప్పుకోలేదు.

"ఈ కర్మ సిద్ధాంతం 20వ శతాబ్దంలో ఫిజిక్స్ ఎమ్మెస్సీ చదివే నిన్ను కూడా వదల్లే దంటే ఎంత దౌర్భాగ్యమో దేశానికి! యడ్ల రామదాసూ, నీకు బుద్ధి లేదు. ఇన్నాళ్లు నా రూం మేట్ గా ఉన్నా ఇలాగే వున్నావు. కాని ఎద్దుకి లేకపోతే బుద్ధి మనిషికేనా వుండొద్దా? నువ్వు బాగు పడాలంటే నాకు సాయం చేస్తావు. లేకపోతే నేనే ఈ సన్మానం జరిపి తీరతాను. బలవంతం ఏంలేదు ఇందులో" అన్నాడు తీవ్రంగా.

అతని జేవురించిన ముఖం, మెరిసే కళ్లూ ఎంతో ఉత్తేజకరంగా వున్నాయి. మానవుడు ఎంత ఉన్నతుడో సాక్షాత్కారించినట్లైంది. 'కవి సన్మానం'లో అతనికి అన్ని విధాలా సాయపడతానని మాటిచ్చాను.

వివరాలను కూలంకషంగా చర్చించి పథకం పూర్తిచేశాం. నా సూచన ఒకటి అతి కష్టం మీద ఒప్పుకున్నాడు శ్రీహరి. అదేమిటంటే అం.ఆ.ఆ.ని నేరుగా కాకుండా అన్యాపదేశంగా అవమానించాలని.

అం.ఆ.ఆ. సన్మానం విషయంలో సలహాలను పొందటానికి శ్రీహరిని శ్రీనివాసాచారిగారి దగ్గరకు తీసుకవెళ్లాను. ఆచారిగారు తెలుగు లెక్చరర్. అయినా ఆయనకి గురజాడ, శ్రీ శ్రీ మొదలైన అఛాందసులంటే గౌరవం. సహృదయత తెలుగు పండితులకి కూడా వుంటుందనడానికి ఆయనే తార్కాణం.

## 4

శ్రీహరి తిట్లూ, నా వివరణ విని ఆయన నిండుగా హృదయపూర్వకంగా రెండు నిమిషాలు నవ్వి "ఎలకలు ఒక ఇంటిని ఆశ్రయించి ఆ ఇంటి గోడల్నే దొలిచేస్తాయి. అలాగే కొందరు సంప్రదాయవాదులూ సత్సంప్రదాయాన్ని దొలిచేశారు. అం.ఆ.ఆ. ఈ విషయంలో ఏకాకి కాడు. చాలామంది వున్నారు ఇలాంటివాళ్లు. కాని సుగుణం ఏమంటే జనం వీళ్ల కావ్యాల్ని చదవరు. చదివినా వెంటనే మరిచిపోతారు లేదా ఏ తిరుపతో వెళ్లి దీనికిక్కడా ప్రాయశ్చిత్తం చేసుకుంటారు. మనం చేయవల్సింది వీళ్లని తిట్టడంకాదు, సంప్రదాయంలో వున్న మంచిని దుమ్ము దులిపి వాడుకోడం. ఈ కాలానికి తగినట్లుగా సంప్రదాయాన్ని ముందుకు తీసుకెళ్లడమూను. మీ శ్రీ శ్రీ చేసింది అదే. ఆయన కవిత్వం నిండా శబ్దాలంకారాలూ, సంప్రదాయ సిద్ధమైన ప్రతీకలూ వుంటాయి. కాని భావాలు ఈ శతాబ్దంతోసహా రాబోయే పది శతాబ్దాలకి పనికొచ్చేవి. మీరు కవిత్వం రాస్తారా?"

లేదని తలాడించాం. ఆచారిగారు నిట్టూర్చి "అయితే నాకు పని తగిలిందన్నమాట. అం.ఆ.ఆ. కావ్యంలాంటి వెర్రికావ్యాలు వందలూ వేలూ వున్నాయి తెలుగులో. వాటి సాధారణ ధర్మం ఏమిటి? ఔచిత్యం లేకపోవడం. ఇరవైయవ శతాబ్దాన్ని పోల్చుకునే ఏ గుర్తూ ఉండదు వాళ్ల కవిత్వంలో. శృంగారం సార్వకాలీనం. అలాగని ప్రేమించే మనుషులు పెద్దనకాలపు వాళ్లలా కనపడకూడదు. ఎక్కడ చూసినా పందులూ, బురదా, పెంటకుప్పటూ కనిపించే మన పట్టణాల్ని ఆకాశాన్నంటే నవరత్న ఖచితమైన భవనాలూ, పువ్వుల తోటలూ... అంటూ వర్ణించడం ఘోరం.

మనం వీటన్నిటినీ పేరడీ చెయ్యాలి. నేను ఏదో. కావ్యంలో ఉన్న పద్యాలంటూ కొన్ని పద్యాలు రాస్తాను. ఆ కావ్యాన్ని రాసిన కవి, పుస్తకం అచ్చైన మూడురోజుల తర్వాత, దాని ప్రతుల్ని కేజీల లెక్కన పేవ్‌మెంట్ మీద అమ్మడం చూస్తాడు. తన కృతి చచ్చిపోయిందంటూ దానికి అంత్యక్రియలు జరుపుతాడు. ముచ్చికి కొన్ని పద్యాలు చదువుతాడు. వేదికమీదే మిగిలి పోయిన తన పుస్తకం ప్రతులని గుట్టగా వేసి కిరసనాయిలో, నెయ్యోపోసి దహనం చేస్తాడు. ఇది జరుగుతున్నంత సేపూ మీరెవరూ నవ్వకూడదు. చాలా సీరియస్‌గా చెయ్యాలి. అం.ఆ.ఆ. ఇంతసేపూ వేదికనలంకరించి ఉంటాడు. ఎలావుంది జోక్?" అన్నారు ఆచారిగారు. ఆయన చెప్తున్నంతసేపూ నాకూ, శ్రీహరికీ పొట్టచెక్కలయ్యేలా నవ్వొచ్చింది. ఐనా ఆచారిగారి మర్యాద అలాంటిది. జోక్ ఎలావుందని అడిగారు.

* * *

యూనివర్శిటీ ఆడిటోరియం అధ్యాపకులతో, విద్యార్థినీ విద్యార్థులతో, ప్రత్యేకా హ్వానంపై విచ్చేసిన పుర ప్రముఖులతో కలకలలాడుతోంది. 'కావ్య దహనోత్సవం, శ్రీ అం.ఆ. ఆ.కి సన్మానం' అంటూ మేం ఊరంతా కరపత్రాలను పంచుతున్నప్పుడు ఇంతమంది జనం వస్తారనే నమ్మకం మాకు లేనే లేదు. ఈ రోజుల్లో కవిత్వానికి విలువ లేదనుకున్నాం, కాని అది భ్రమ అని తేలిపోయింది. విద్యార్థులలో శ్రీహరికి వున్న ప్రభావం కూడా కొంత కారణం ఈ పరిణామానికి.

సభకు అధ్యక్షత వహించిన శ్రీ శ్రీనివాసాచారి అతికష్టంమీద (వీరోచితంగా) నవ్వాపు కుంటూ తొలి పలుకులు పలికారు. ఇది 20వ శతాబ్దమని సభికులకు గుర్తుచేశారు. నాగరికత విపరీతంగా పెరిగిందన్నారు. అందుకే ఈ శతాబ్దంలో మునుపెన్నడూ లేని స్థాయిలో రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయనీ, ప్రతీ నగరంలోనూ హత్యలూ, మానభంగాలూ దినదినాభివృద్ధి జరుగుతున్న చారిత్రాత్మకమైన తరుణంలో కవిత్వం వంటి విషయాలకు ఎంతో ప్రాధాన్యత వుందనీ, కవులను ఆదరించడం మన తక్షణ కర్తవ్యమనీ, కవి హింస జీవహింసలాగే పాపమనీ, కావ్యాలు కొన్ని పుట్టిన మూడో రోజునే చనిపోడం, కొన్ని పుట్టడమే చచ్చి పుట్టడం కవులకి పోషకాహారలోపం వుంటాన జరుగుతోందనీ ...అలా ఆయన చెప్పే అసలు సంగతి ఏమిటో ఎవరికీ అర్థంకానంత నేర్పుగా మాట్లాడి, అం.ఆ.ఆ. పుస్తకం గురించి కొన్ని అవాచ్యాలు పలికి, ఊహాకావ్యం "గోఘృతమథనం" ఎలా పేవ్‌మెంట్ మీద చచ్చిపడివుండగా కృతి కర్త చూసిందీ, తన కావ్య కన్య అకాల మరణానికి ఆయనెలా చింతించిందీ హృద్యంగా వివరించారాయన.

ఆ తరువాత కృతి కర్త మున్నుడి.

కవిగా వేషం వేసుకుని వేదికనలంకరించిన జీయాలజీ స్టూడెంట్ బలరాం ఎన్నో నాటకాల అనుభవం ఉన్నవాడు. అతను 'తన' కావ్యంలోని కొన్ని పద్యాలను చదివి విని పించాడు.

"ఇది ఆకలి యుగం:
ఆకలి మేకతోన ననుమాన పరంపర కోటగోడగా

మూకల కేల మానసిక శైత్యపు పాదము కాకి వృక్షమున్
రోకలి చుట్టి పాకమిడి పన్నుల కన్నుల ప్రాంతవాసనల్
కేకల పోక వేసినది భీష్మగదాహతి ప్రేమ మీరగన్.

అయినా మానవుడు చిరంజీవి.

జలజాతానన చెంప నూనె తినినన్ మత్తిల్లి ఘూకాధముల్.
శిల వారాంగన మూతి రోషమునకున్ చింతాంత మంత్రాత్మికా
కలనా పోషిత కాంతి ధూర్తమతి శాకోదర్య పైత్యమ్ముగా
తులనా పాలన చేయు మానవుడు తా చెండాడె యాకాశమున్.

అలాగే మానవుడు బలహీనంగా వున్నా, సమాజాన్ని మార్చగలడు.

దీక్షా కంకణ వస్త్ర దీపములచే దీండ్రించి మర్త్యాధముల్
రక్షా మక్షిక మానవోత్తముల రో రక్షాస్త్రు రాత్రిం చరుల్
శిక్షా మారుత పర్వతాననలమున్ శింజీర మంజీర ధన్
క్షాక్షా నాదపు కైపు నింపిరట లాక్షారమ్య హస్తమ్ములన్.

ఈ విధంగా మరో పది పద్యాలు ముచ్చుకి చదివి వినిపించి తాను ఎంతో తపస్సు చేసి రచించిన కావ్యం అకాలమరణం చెందటాన ఆమెను స్వీకరించిన కృతి భర్త 'విడోవర్' అయ్యాడని చింతించి మున్నుడి ముగించాడు కవి. తనకు వచ్చిన కష్టాన్ని కృతి భర్త అందరికీ చెప్పుకుని ఏడవ్వలసిందిగా అతన్ని ఆహ్వానించారు అధ్యక్షులు.

కృతి భర్త విలాపము:

ఓహో సుందరి చంద్రికాగ్నివలె నీ విందైన డెందమ్ముతో
బాహాటమ్ముగ ప్రాణికోటిపయినన్ రాయంచ రాట్నమ్ముపై
ఊహాసౌధపు నిండుకొమ్మపయినీ వీక్షించు గుండ్రాతితో
హాహాకారము జాతి మీసమున హ్రీరమ్యాన నిద్రించుమా.

అని పద్యం చదివి కృతి భర్తగా నటించిన మురళీధర్ భోరుమని ఏడ్చాడు. అమ్మానాన్నల్ని విడిచి ఏభై ఆరు మైళ్ల దూరాన హాస్టల్‌లో వున్నాననే అతని దుఃఖం ఇప్పుడు మాకెంతో ఉపకరించింది.

ఆ తర్వాత కావ్యదహనోత్సవం జరిగింది. ఏవేవో పాత నోట్సులూ, పాత పత్రికలూ కట్ట గట్టి తెచ్చాడు కవి. కృతి భర్త వాటిమీద కిరసనాయిలు పోశాడు, కృతి కర్త అగ్గి పెట్టాడు. ఇద్దరూ మళ్లీ ఏడిచారు.

కార్యక్రమం అనుకున్న విధంగానే అద్భుతంగా జరిగిపోతోందని మురిసిపోతున్నాడు శ్రీహరి. కాని సభికుల్ని చూడగా చూడగా నాకో రహస్యం బోధపడింది. మేం చెత్త కవిత్వాన్ని అపహాస్యం చేయాలని కదా ఈ నాటకం అంతా తలపెట్టింది. కాని సభలోవున్న ఒక్కరికి కూడా ఇది అర్థంకాలేదు. చాలా సీరియస్‌గా, గ్రిమ్‌గా మా కావ్యదహనోత్సవాన్ని తిలకించారు. అందుకే చివర్లో అం.ఆ.ఆ. జనంలో కెళ్లి తన కావ్యాన్ని అమ్మజూపితే నాలుగువందల ముప్పై

ఆరు కాపీలు అమ్ముడయ్యాయి. తెలుగులో ఏ కవికీ ఒక్క కావ్యం వల్ల ఇంత డబ్బు వచ్చి వుండదు ఈ శతాబ్దంలో.

ఇదంతా గమనించే స్థితిలో లేడు శ్రీహరి. ఓ గొప్ప పని చేశాననే గర్వమే అతనికి కలిగింది. నిజం చెప్పి అతన్ని బాధించడం ఎందుకు? జనానికి కవిత్వం అంటే ఓ రకం నమ్మకం వుంది. ఎలా రాశాడు కవి అని చూడరు. సాధారణంగా కవిత్వం చదవరు. చదివినా అర్థం కాలేదనుకుంటారే గాని అందులో అర్థం లేదేమోననే అనుమానమే రాదు. ఆ మాటకొస్తే కవిత్వం ఎంత అర్థంకానట్లుంటే అంత గొప్పదైనట్లు లెక్క. సాధారణంగా (భగవత్కృపవల్ల?) జనం చెడు కవిత్వానికీ దాంతోబాటు మంచి కవిత్వానికి దూరంగానే వుంటారు. కాని ఇలా కవులకి దొరికిపోయినప్పుడు మాత్రం వాళ్ల కవి భక్తి బారినుంచి వాళ్లని ఎవరూ కాపాడలేరు.

శ్రీనివాసాచారిగారు కూడా ఈ వింతని గమనించి నిట్టూర్చి ఊరుకున్నారు. శ్రీహరికి తన జోక్ తనమీదకే వచ్చిందని తెలియకపోవడం మంచిదేననీ, మేమిద్దరం అతనికి నిజం చెప్పకూడదనీ ఒప్పందం చేసుకున్నాం. నిజం! నిజంకదా అని అప్రియమైనవి చెప్పకూడదు. "సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్, న బ్రూయాత్ సత్యమప్రియం" అని కదా ఆర్యోక్తి!

## 5

"మేం చేసిన ఏకైక సాహసకృత్యం నలుగురిలో తలయెత్తుక తిరగటం"

కావ్యదహనోత్సవం పూర్తయ్యేసరికి ఎనిమిది గంటలైంది. అం.ఆ.ఆ. ఆనందభాష్పాలతో నన్ను, శ్రీహరిని, ఆచారిగార్ని, ఈ యత్నంలో అతనికి తోడుపడిన అయిదారుగురు ఇతర విద్యార్థుల్ని రెండు చేతులూ పట్టుకుని "ఇవి చేతులు కావు కాళ్లనుకోండి; నా కావ్యాన్ని కావ్యం అనుకున్నట్లే" అని చమత్కరించి, ఆయన చెప్పకపోయినా 'ఎందుకేనా మంచిదని' ఆటోలో వేసుకుని సమయానికి చంద్ర కుముదిని అక్కడకు తెచ్చిన తన ట్యూషన్ స్టూడెంట్స్‌ని వెంటబెట్టుకుని బస్సుకెళ్లిపోయాడు. నేను అంతసేపూ నా ఆందోళనని అణుచుకుంటూ శ్రీహరిని ఓ కంట చూస్తూనే వున్నాను. ఈ పరాజయాన్ని అతనెలా స్వీకరిస్తాడో తెలుసుకోవాలని..

కాని శ్రీహరి, అనుచరులు ఇకిలిస్తూనే వున్నారు సభ జరుగుతున్నంతసేపూ. సిగరెట్లు ధాటీగా కాల్చేస్తున్నారు. జనం ఎంత వెధవలోయ్. ఒక్కడికి మన జోక్ అర్థంకాలేదు అంటూ గుసగుసలాడుకున్నారు. ఆడిటోరియంలోంచి బయటపడ్డాక బిగ్గరగానే అనసాగారు. "ఇదండీ మన స్థాయి పేరడీని సీరియస్‌గా తీసుకోడం, అం.ఆ.ఆ. కావ్యాన్ని క్యూలో నిలుచుని కొనేయడం చూస్తుంటే రాజబాబుకి మిస్టర్ యూనివర్స్ అవార్డ్ వచ్చిందని పేపర్లో వేసినా నమ్మేసేరకమని తెలుస్తోంది కదా! బాబాల్నీ, స్వాములార్నీ, తిరుపతి గుండునీ ఆరాధించే మనుష లమోయ్. నాస్తికత్వాన్ని వ్యాప్తి చేయడమే దీనికి మందు" అన్నాడు రామారావు. అతనో నాస్తిక సమాజంలో యావజ్జీవ సభ్యుడు. అంచేత రెండేళ్లుగా తిరుమల వెళ్లి తలనీలాలిచ్చే అవకాశం పోయిందని అప్పుడప్పుడు వాపోతూంటాడు.

కూర్మారావు అందుకొప్పుకోలేదు. "నాస్తికత్వం ప్రజలని ఆకర్షించదు. భూమికోసం, భుక్తికోసం జరిగే పోరాటంలోనే ప్రజలకు విముక్తి వుంటుంది".

శ్రీహరి ఏమీ మాట్లాడ్డంలేదు. మధ్య మధ్య బిగ్గరగా నవ్వుతున్నాడు. నేను శ్రీనివాసా చారిగార్ని ఆయనింటిదాకా సాగనంపడానికి వెళ్లిపోయాను వాళ్లని విడిచి.

దారిలో ఆచారిగారు శ్రీహరిని మెచ్చుకున్నారు. "చాకులాంటి కుర్రాడు, బుద్ధి పాదరసమే. సరియైన దారిలో పడితే గొప్ప నాయకుడవుతాడు" అని.

ఆయన మాటలు నాకు అమృతలహరిలా తోచాయి. నిజానికి శ్రీహరి సంగతి నాకెప్పుడో తెలుసు. అయినా ఎందుకో ప్రతి మనిషికీ మరొకరు కూడా "అవునం"టే అంత ఆనందం! ఒకరి భావాలకి నలుగురూ మెచ్చితే తప్ప విలువ లేదా? అదే అన్నాను ఆచారిగారితో.

దానికి జవాబుగా ఆయన "అంతేకదా. మన కష్టాలనీ పంచుకోవాలనే వుంటుంది, సుఖాలనీ పంచుకోవాలనే వుంటుంది. యావత్తు సృష్టినీ కౌగలించుకునేవరకూ మనిషికి పూర్తిగా సంతృప్తి కలగదు" అన్నాడు.

నాకు వెంటనే సునంద గుర్తొచ్చి తల వంచేసుకున్నాను. అర్జెంటు పని వున్నట్లుగా ఆగిపోయి "నే సెలవు తీసుకుంటా మేస్టారూ. మెస్ కట్టేస్తారు" అంటూ నమస్కారం పెట్టి వెనక్కి తిరిగి వచ్చేశాను. నా మనస్సులో నాట్యమాడుతున్న సునందగురించిన తలపుల్ని ఆచారిగారితో పంచుకోడానికి భయపడ్డాను! అందుకే ఆ తొందర.

హాస్టల్ కి నడుస్తున్నంతసేపూ సునంద శరీరం నించి వచ్చే మనోహర పరిమళం నా చుట్టూ కమ్ముకున్నట్లు, నా మనసుని కావిలించుకున్నట్లు తీయని బాధ. ఇందాకా సభలో సునంద అంతసేపూ నవ్వుతూనే వుంది. 'ఓహ్హొహొ హ్హొహొ' అని కొంతసేపు "కొహ్హొహొహ్హొహొ" అని కొంతసేపూ రకరకాల స్థాయిల్లో. శ్రీహరితో మాట్లాడాలని చూసింది కాని లేడీస్ హాస్టల్ దాకా వెళ్లాలి కదా లేటవకూడదు అని కాబోలు నేస్తాలతో బస్సెక్కేసింది.

నేను మెస్ లోకి వెళ్లేసరికి శ్రీహరీ, మిత్రులూ భోంచేస్తున్నారు. 'కావ్యదహనోత్సవా'న్ని ఒకఘన విజయంగానే వాళ్లు గుర్తించారు. ఒకరికొకరు కంగ్రాట్స్, కృతజ్ఞతలు విసురుకుంటున్నారు. శ్రీహరి మామూలుగాకంటే బిగ్గరగా ఎక్కువ ఉత్సాహంగా ఉన్నట్లు మాట్లాడుతూ కనపడ్డాడు.

తన భోజనం అయ్యాక శ్రీహరి నాకోసం ఆగుతాడనుకున్నాను. కాని అతను వాళ్లతో వెళ్లిపోయాడు. నేను ఓ క్షణం మనసులోనే ఏడిచి వెంటనే కోలుకుని భోజనంలో నిమగ్నమయ్యాను. ఎంత ముఖ్యమనుకున్న విషయం కావచ్చు, భోజనం దగ్గర దాని గురించి బాధపడకూడదు. "అన్నం పరబ్రహ్మ స్వరూపం" అన్నాన్ని ఆరాధిస్తున్నప్పుడు మరో ధ్యాస దేనికి?

నేను రూంకి వెళ్లేసరికి తాళం వేసి వున్న తన గది ముందర గోడకానుకుని నిద్రపోతున్నాడు మురళీధర్. వాళ్ల గదికి ఒకటే తాళం. దాన్ని తీసుకుని శ్రీహరితో వెళ్లాడు అతని రూంమేట్. మా గది తాళం తీసి మురళీధర్ ని లేవగొట్టి తీసుకెళ్లి నా మంచంమీద పడుకోబెట్టాను. మురళీధర్ మాట్లాడకుండా వెంటనే నిద్రపోయాడు.

నేను రెండు మంచాలమధ్య నేలమీద నాలుగు న్యూస్ పేపర్లు వేసుకుని పడుకున్నాను. నిద్ర పట్టటంలేదు. నాకేదో ఆందోళనగా వుంది. శ్రీహరి గురించా? సునంద గురించా? లేక

సమాజం గురించా?

ఏమో. నిద్ర పట్టేక కలల్లో ఏమైనా తెలుస్తుందేమో!

* * *

ఆ మర్నాటినుంచి శ్రీహరి దినచర్యలో మార్పొచ్చింది. ఇన్నాళ్ళూ అతను తెగ చదివే వాడు. మార్క్స్, మర్‌క్యూజ్, మావో, సార్త్రే, రసెల్, గుంటర్‌గ్రాస్ ...ఒకరేమిటి అందరు మహా రచయితలూ అతని వాళ్ళేనే. చదివి నాకు, ఎవరేనా వస్తే వాళ్ళకీ లెక్చర్లిచ్చేవాడు. ఇప్పుడు చదవడం, రూంలో వుండడం తగ్గింది. మిత్రుల గదులకి వెళ్తున్నాడు. ఏవేవో ఆకాశాన్నంటే ప్లాన్స్ వేస్తున్నాడు. వీలున్నప్పుడల్లా నేనతని వెంటే వుంటున్నా. అతనిలో ఏదో వింత శక్తి వుంది.

కాని అతని పనుల్ను, మాటలు నాకర్థంకాకనో, మా తాత బోధలకు విరుద్ధంగా ఉంటానో నాకు బొత్తిగా నచ్చటంలేదు ఇప్పటికీ. నేనతని సిద్ధాంతాలనూ, వ్యక్తిత్వాన్నీ ఆరాధించగలను కాని ఆమోదించలేకపోతున్నాను.

## 6

"మేము వ్రేలు చీకటంలో సెక్స్ ఉందంటాడు ఫ్రాయిడ్
మేము కాలు చాపటమే ఆర్థిక విపర్యాసమంటాడు మార్క్స్
గంట కొట్టగానే చొంగ కారుస్తూ
పరుగెత్తే కుక్కలమంటాడు పావ్‌లావ్
ఎలుకల మీద ప్రయోగాలు చేసి చేసి
మీరే ఎలుకలన్నాడొక శాస్త్రవేత్త
అనుమానం వేస్తున్నది, మేమెవరం ఓదేవా?
సింహానికి జూలమర్చి, ఏనుగుకు తొండమిడిన మహానుభావా"

శ్రీహరి సిద్ధాంతాలను నేను ఆమోదించటం లేదు. కాని విని విని వాటి గాలి సోకిన నా మనస్సు అల్లాడకుండా ఎలా వుంటుంది? ఫ్రాయిడ్, మార్క్స్, పావ్‌లోవ్ సిద్ధాంతాల్లో ఎంతో వైవిధ్యం వుంది. కాని మూడూ నాస్తిక మతాలే. ఇన్ని లక్షలయేళ్ళుగా ఈ సిద్ధాంతాలు లేకపోవటాన మనిషి పశువులా బ్రతికాడని ఓసారీ, మనిషి పశువేనని మరోసారీ అనిపిస్తుంది; శ్రీహరి మాటలు వింటుంటే. నా కాళ్లక్రింద భూమి కరిగిపోతున్నట్లుంటుంది. వీటిని తట్టు కోడానికి నా దైనిక దైవ ప్రార్థన పెంచబోయాను. కాని అసలు ప్రార్థనకి కూర్చోవడమే కష్టం కాసాగింది. నా మనస్సు దేవుడివేపు వెళ్లకుండా ఏవేవో అదృశ్య శక్తులు అటకాయిస్తున్నాయి. అల్లరి పెడుతున్నాయి. నా అలజడి, అశాంతి ఎంత హెచ్చు పెరిగాయంటే కూర్మారావు రూం లో కూర్చుని శ్రీహరీ వాళ్లూ మద్యం సేవిస్తుంటే వాళ్ల చేతుల్లోని గ్లాసులన్నీ లాగేసుకుని గడగడా తాగేయాలని పించిందోనాడు.

కాని ఆ క్షణాన దైవం నన్ను చల్లగా చూసినందున అక్కణ్ణుంచి లేచి వచ్చేశాను. నా రూం తలుపులు గడియపెట్టి తల గోడకేసి కొట్టుకున్నాను. ఎన్నిసార్లో గుర్తులేదు. ఏమైపోతున్నాను

నేను? ఏమైపోతున్నాడు శ్రీహరి? మా దినచర్య సంతలా తయారైంది ఎంచేత? ఏ వెల్లుగలకీ ప్రస్థానం? ఏ స్వప్నం? ఏ దిగ్విజయం?

* * *

శివరాత్రినాడు రోజంతా ఉపవాసం జాగరం చెయ్యడానికి నిశ్చయించుకున్నాను. సాయంత్రం బీచ్ లో కొత్తగా కట్టిన శివాలయానికి వెళ్లాను. నేను రూంలో కూర్చుని ఆ పరమేశ్వరుణ్ణి ఈ ఒక్కరోజైనా మనసారా ధ్యానించాలని చేసిన ప్రయత్నం పూర్తిగా విఫలమైంది. ఆలయంలో వుండే ప్రత్యేక పవిత్ర వాతావరణం నాకు సాయపడుతుందని ఆశ!

నేను గుడికి నూరు గజాల దూరాన వుండగా ఒక విచిత్ర దృశ్యం కనపడింది. పది పదిహేనుమంది యువతీ యువకులు బీచ్ రోడ్ నుంచి ఆలయానికి దారితీసే బాటమీద న్యూస్ పేపర్లు వేసుకుని అడ్డంగా పడుకున్నారు. మరికొందరు గుడికి కొంచెం దూరంగా నిలుచుని అటువేపు బంతి పడేలా బంతాట ఆడుతున్నారు. ఎవరేనా గుడికి వెళ్తున్నా, వస్తున్నా ఈలలూ, కేకలూ వేస్తున్నారు. బంతి 'గురి తప్పి' భక్తులకి తగులుతోంది ప్రతీసారీ. "సారీ మేస్టార్లూ", "సారీ మేడమ్", సారీ మదాంజాల్" అంటూ సారీ చెప్తూనే బంతి వాళ్ల కాళ్లకి తగిలేలా విసురుతున్నారు ఆటగాళ్లు. తగిలినప్పుడల్లా రోడ్డుమీద పడుకున్న వాళ్లు గాలిలోకి చేతులు పైకెత్తి నమస్కరిస్తూ "హరహరా! ఆపద్బాంధవా! అనాథ రక్షకా! ఈ బంతిని నీ మూడో కంటితో భస్మం చేయవా" అని అరుస్తున్నారు వెటకారంగా.

ఆ వచ్చేవాళ్లు భక్తులు. అదీకాకుండా శివరాత్రి. అంచేత సణుక్కుంటూ, విసుక్కుంటూ తమ పనిమీద వెళ్లిపోతున్నారే తప్ప ఈ అల్లరివాళ్లను ఏమీ అనటంలేదు. నాకు స్వామి వివేకానంద మాటలు గుర్తొచ్చాయి. "ఈ దేశపు పేదలు దేవతా స్వరూపులు" అని. అంతలో బీచ్ రోడ్ లో ఓ ఖరీదైన కారొచ్చి ఆగింది. కారులోంచి దిగినవాళ్లు విషయం గ్రహించి మళ్లా కారెక్కి తుర్రుమన్నారు. సామాన్యులు మాత్రం ఎలాగో బంతి దెబ్బల్ని సహిస్తూ గుడికి వెళ్లడం మానలేదు.

ఆ మూక శ్రీహరి పోగుచేసిందేనని నాకు అప్పుడు కాని గుర్తురాలేదు. గత నాలుగు రోజులుగా శ్రీహరి శివరాత్రి గురించి తెగ మాట్లాడాడు. ఏదో విధంగా శివనామస్మరణ చేస్తున్నాడు కదా అని తృప్తిపడ్డానే తప్ప ఈ కుతంత్రం గురించి నాకు ఊహే రాలేదు.

నేనీమధ్య నా ఒంటరి ఆలోచనలో ఒక విషయం గ్రహించాను. ఆలోచన ఎంత గొప్పది! అనుభవంలేని ఆలోచన వేళ్లు లేని చెట్టైతే ఆలోచన సాయంలేని అనుభవం మొదలు నరికిన వేరు! రెండూ వేరే కాని రెండూ వ్యర్థమే. నేను ఒక్కణ్ణే ఉన్నప్పుడు నా అనుభవాల్ని పోల్చి చూస్తూంటాను, వాటిలో మూలసూత్రాన్ని గ్రహించాలని ప్రయత్నిస్తాను. శ్రీహరి మాటల్నీ, చేష్టల్నీ నిత్యం గమనించి, తర్వాత ఆలోచిస్తూంటే ఈ రహస్యం నాకు గోచరించింది. శ్రీహరి ఎందరో మేధావుల, నాయకుల సిద్ధాంతాల్ని వాడుకుంటున్నాడు కాని వాళ్లెవరి మీదా అతనికి గౌరవం లేదు. ఒక నియంత తన అనుయాయుల్ని వాడుకునే పద్ధతిలోనే, అతను ఆధునిక సిద్ధాంతుల బోధల్ని పోగుచేస్తున్నాడు. అతను వీలున్నప్పుడల్లా సిద్ధాంతకర్తల్ని

నిర్దాక్షిణ్యంగా అవహేళన చేయడం చూసి మొదట నేను షాక్ అయ్యాను. గురుభావం లేకుండా ఒకరి నుంచి మనమెలా జ్ఞానార్జన చేయగలం? అలా చేస్తే అది దొంగతనం, ద్రోహం కాదా?

కాని వెంటనే నేనూ, శ్రీహరి చేసినలాంటి తప్పే చేస్తున్నాని గ్రహించాను. శ్రీహరి ఇతరులలో తప్పుల్నిపట్టి వెటకారం చేయడం తప్పో ఒప్పో; నేనతణ్ణి తప్పుపట్టడం మాత్రం తప్పే లెంపలు వాయించుకుని ఊరుకున్నాను.

అతనోసారి డాక్టర్ కోవూర్‌ని గురించి అపహాస్యం చేశాడు. "నాస్తికత్వం అంటూ వ్యాసాలూ, లెక్చర్లూ ఇచ్చి లాభం ఏమిటోయ్ గున్నేశ్వరరావూ? డైరక్ట్ ఏక్షన్ కావాలి. దేవుడు మనిషిని కష్టాల్లోంచి కాపాడలేడని తెలిస్తే తప్ప జనం వాణ్ణి నమ్మడం మానరు. అలాంటి సంఘటన మనం ఏర్పాటు చేయాలి" అన్నాడు నాతో. ఇదేనన్న మాట 'అలాంటి' సంఘటన. బంతి వచ్చి భక్తులకి తగలాలి, దేవుడి గుడి దగ్గర. దేవుణ్ణి ప్రార్థించినా ఫలితం రావటం లేదని తెలిసేలా ఈ రోడ్డుమీద పడుకున్న వాళ్ల కేకలు పనిచేస్తాయి. ఈ అనుభవం భక్తుల హృదయాల్లో నాస్తిక బీజాలను నాటుతుంది. ఈ తర్వాత మరో సన్నివేశం, తరవాత మరోటి అలాగన్నమాట.

శ్రీహరి నా మిత్రుడు, గురుతుల్యుడు, నా హీరోలలో ఒకడు. అతని లాంటి పని చేయడం చూసి నేనే అది చేస్తున్నంత అవమానంతో కుమిలి పోయాను. సిగ్గుతో నా చెవుల దగ్గర చెంపలు వేడెక్కి హోరు మొదలైంది. నేను అలాగే నిలుచుని వున్నాను స్పృహ తప్పిన రాయిలా.

కొన్ని నిమిషాలయ్యాక ఎవరిదో స్కూటర్ వెనకాల కూర్చుని హాస్టల్ నించి అటొచ్చిన మురళీధర్ గుడి దగ్గర ఆపించాడు స్కూటర్ని. అతనూ శ్రీహరిని చూశాడు. బీచ్ రోడ్‌నుంచి నేరుగా నా దగ్గరకు వచ్చిన మురళీధర్‌కి సంగతి అర్థంకాలేదు. రుమాలుతో మొహం తుడుచుకుంటూ "శ్రీహరి కోసం తిరుగుతున్నాం అతనికేదో టెలిగ్రాం వచ్చిందిట" అన్నాడు.

అతనటు వెళ్లబోతుంటే రెక్కపట్టి ఆపేశాను. "వెళ్లకు అనవసరంగా బుర్ర పాడవుతుంది" అంటూ చప్పట్లు కొట్టి శ్రీహరిని పిలిచాను.

శ్రీహరి మమ్మల్ని పోల్చుకుని రోడ్డుమీద పడుకున్నవాడు లేచి మా వేపు వచ్చాడు. అతని ముఖం నిండా పంచరంగుల నవ్వులు హోలీనాటి బుక్కాలా అలుముకుని వున్నాయి. విజయగర్వంతో అతని కళ్లు నాట్యం చేస్తున్నాయి. నేలమీద దొర్లటాన రేగిన క్రాపునీ, బట్టల్నీ సరిచేసుకుంటూ చకచకా మమ్మల్ని సమీపించాడు.

మురళీధర్ టెలిగ్రాం సంగతి చెప్పి "అదుగో స్కూటర్. అదెక్కి వెళ్లు. త్వరగా వెళ్లచ్చు" అని రోడ్ మీద ఎదురుచూస్తున్న ఆనంద్ దగ్గిరికి పంపేశాడు. శ్రీహరి నవ్వుకుంటూ వెళ్లాడు ఆనంద్ వైపు చెయ్యి ఊపి.

శ్రీహరి ఇటు రావడం చూసి ఆ అల్లరి మూకని విడిచిపెట్టి మావేపు వచ్చింది సునంద. చేస్తున్న ఘనకార్యానికి ఆవిడా మురిసిపోతోంది. ఆమెను చూడగానే నా కోపమూ, దుఃఖమూ మనస్సులోకి మాయమయ్యాయి.

ఇరవైయవ శతాబ్దపు హంసలా నడుస్తోంది సునంద. అంటే స్పీడు కూడా ఉందని

అర్థం. తనూ నేలమీద పడి దొర్లిందేమో జుట్టు రేగిపోయి ఏదో తెలియని కొత్త అందం వచ్చింది ముఖానికి. సాయంకాలపు ఎండలో ఈదుతున్న మత్స్యగంధిలా నడుస్తోంది. దారి పొడుగునా నేల తల్లి పులకించేలా నాట్యం చేస్తున్నాయి ఆమె పొడుగాటి కాళ్లు.

"ఏమండీ భక్త కన్నప్పగారూ. ఇంకా మీ కళ్లు శివుడికి ఇచ్చేయలేదా అలా చూస్తున్నారు. నేనేం శివలింగాన్ని కానే" అంది నవ్వుతూ.

సాచి లెంపకాయ కొట్టాలనిపించింది, చేతుల్ని బలవంతంగా ఆపి, పొంగివస్తున్న దుఃఖంలో ముంచేశాను. నేను చూస్తున్న సునంద ఆర్నెల్లక్రితం చెట్టు నున్న మామిడికాయల్ని భక్తిగా చూస్తూ నిలుచుండిపోయి నన్ను కోసివ్వమని అడగడానికి కూడా సిగ్గుపడిన ఆడపిల్లేనా? శ్రీహరి ఎంతపని చేశాడు! ఆర్నెల్లు సావాసం చేస్తే వారు వీరవుతారుట.

నేను ఆమెను ఎలా తిట్టాలా అని ఆలోచిస్తున్నాను. ఇంతలో మూడు జీపులు వేగంగా బీచ్ రోడ్ మీద వచ్చి, రోడ్డు నుంచి ప్రక్కనున్న ఎర్రమట్టి దిబ్బల్లోకి ఉరికేశాయి. రెండు నేల మీద పడుకున్న మా మిత్రుల ప్రక్కనించి దూసుకుపోయి గుడిని చేరాయి. ఒకటి వాళ్లమీద కొచ్చేస్తున్నట్లు కనిపించింది. వాళ్లు కంగారుగా లేచి నిలబడ్డారో లేదో మూడు జీపుల్లోంచీ దిగిన పోలీసులు వాళ్లనీ, భక్తులకు తగిలేలా బంతాట ఆడుతున్న క్రీడాకారుల్నీ చుట్టేశారు. లాఠీలు శివతాండవం చేశాయి. వాటికి ఆడామగా భేదం తెలీదుగా. మొత్తం ఇరవై రెండు మంది అబ్బాయిల్నీ, ముగ్గురు అమ్మాయిల్నీ సెక్స్ విచక్షణ లేకుండా చితక బాదేస్తున్నాయి లాఠీలు.

నేనూ మురళీధర్ బిత్తరపోయి చూస్తుంటే సునంద కుప్పకూలిపోయింది ఆ ఎర్రమట్టిలో.

"మనల్నీ కొడతారేమో వెళ్లిపోదాం" అన్నాడు మురళీధర్. నిజమేననిపించింది, కాని సునంద కదల్లేని స్థితిలో వుందని గమనించి, దేవుడి కోసం తెచ్చిన అరటిపళ్లలో రెండు ఆమె చేతుల్లో పెట్టాను, కొబ్బరికాయ మురళీధర్ కి ఇచ్చాను.

ఒక పోలీసు మమ్మల్ని గుర్తించి ఉత్సాహంగా పరిగెత్తుకొచ్చాడు కాని మా వాలకం చూసి ఆగిపోయాడు, మేం ముగ్గురం భక్తుల వేషాల్లో ఉన్నందున తన లాఠీని నిరుత్సాహపరచవలసి వచ్చినా వెంటనే సర్దుబాటుచేసుకుని "ఇక పర్లేదు గుడికి వెళ్లండి సార్. ఇంతదాకా ఈ స్టూడెంటూ-కొడుకులు మదించి అల్లరి పెడుతున్నారు. ఇందాకా మా పెద్ద దొర కార్లో ఫేమిలీతో వచ్చి ఈళ్లని చూసి గిరుక్కున వెనక్కొచ్చేశాడు. వెంటనే మేం వచ్చేశాం" అన్నాడు నవ్వుతూ. "ఈ పిల్లకి ఏమైంది సార్. పడిపోయిందా? బంతిగాని తగలకూడని చోట తగిలిందా? జీప్ ఎక్కిద్దామా?" అన్నాడు ఆందోళన కనపరుస్తూ.

"దెబ్బ తగలడానికి మేం అంతదాకా వెళ్తేగా. వాళ్లని చూసిందో లేదో ఇక్కడ కూల పడింది" అన్నాను. పోలీసు అలసిన గంధర్వకన్యలా వున్న సునందని మెచ్చుకోలుగా చూస్తూ అయిష్టంగానే మళ్లీ 'డ్యూటీ'కి వెళ్లిపోయాడు.

సునంద తేరుకుంది. ముగ్గురం భక్తులమేనని పోలీసు సర్టిఫికెట్ లభించింది కాని గుడికి వెళ్లే మూడ్ పోవటాన యూనివర్సిటీ వేపు వచ్చేశాం.

సునందకీ, శ్రీహరికీ లాఠీ దెబ్బలు తప్పాయని నేను ఆనందించబోతుండగా మురళీధర్ చెప్పాడు. "శ్రీహరి ఫాదర్‌కి చాలా జబ్బుగా వుందిట. వెంటనే ఊరికి రమ్మనీ ఆ టెలిగ్రాం" నేలమీద కూర్చుండిపోడం ఈసారి నావంతైంది. నా ముఖంలో ఏం మార్పొచ్చిందో సునంద, మురళీధర్ నా ప్రక్కకి చేరి తెగ కంగారుపడిపోయారు. సునంద కళ్లలో నీళ్లొచ్చేశాయి.

నేను మామూలుగానే ఉన్నాననుకొంటున్నాను. మన అనుభవాన్ని మనం పోల్చుకోలేక పోవటమే జీవిత లక్షణం అని ఎక్కడో చదివాను. "గోపాలం గారూ ..లేవండీ. లేవగలరా" ఏడుపు గొంతుకతో సునంద నా చేతిని పట్టుకుని గుంజుతోంది. పదిక్షణాల్లో లేచి కూర్చున్నాను. శ్రీహరికి ఏం కష్టం వస్తుందోనని నా గుండె లయ తప్పి కొట్టుకుంటోంది. శ్రీహరి తండ్రి అంటే ఏం లెక్కలేనట్లే కనిపిస్తాడు. కాని లోపల్లోపల ప్రేమ వుండదా? తండ్రికేమైనా అయితే. ఇతను తట్టుకోగలడా?

## 7

"మన కర్మల ఫలం ఒక్క మనంకాదు, చవి చూస్తుందఖిల జగతి
మన పద చిహ్నాల్లోనే బహుళ జీవితాల ప్రగతి"

మర్నాడు ఉదయం నేను చాలా ఆలస్యంగా నిద్రలేచాను. ఎందుకంటే శివాలయం సంఘటనలూ, శ్రీహరి ఊరికి వెళ్లడం... ఇవన్నీ నా మనస్సుని రకరకాలుగా ఏడిపించి, గంతు లేయించి, లాఠీచార్జీ చేసి, గుంజీలు పెట్టించి నిద్రపోకుండా చేశాయి. కునుకు పట్టినా పది నిమిషాల్లో ఉలికిపడి లేచిపోయేను నాలుగైదుసార్లు.

కాలం, ఖర్మం అంటారు. రెండూ కలిస్తేనే అనుకోని విపత్కర పరిణామాలు వస్తాయి. శ్రీహరీ, అనుచరులూ శివరాత్రినాడు శివాలయం దగ్గర అల్లరి తలపెట్టడం, చేయడం మాత్రం చాలదు ఈ గొడవ జరగడానికి. ఒక పోలీస్ ఆఫీసర్‌కి శివభక్తి వుండాలి, అంతేకాదు ఊళ్లో ఎన్నో శివాలయాలు ఉండగా ఈ ఆలయానికే ఆయన రావాలి. ఇన్ని కలిసివస్తేగాని అంత క్రూరమైన లాఠీచార్జి జరగదు. గుడ్డిలో మెల్ల అన్నట్లు పోలీసులు వాళ్లని అరెస్టు చేయలేదు. కొట్టి కొట్టి చేతులు నొప్పెట్టాయేమో, మా వాళ్లని అక్కడే వదిలేశారు పేర్లు, ఎడ్రస్‌లూ నోట్ చేసుకుని, వాళ్లు డాక్టర్ దగ్గరకెళ్లి కట్లు కట్టించుకుని వచ్చేసరికి పదిన్నర అయింది ఆ రాత్రి.

వాళ్లొచ్చారని తెలిసి చూడ్డానికి వెళ్లాను. వాళ్ల వడిలిపోయిన ముఖాలు, తలలకీ, చేతులకీ ఇతరచోట్లా వున్న బేండేజీలూ చూడగానే బేరుమని ఏడిచేశాను. 'వాళ్ల ఓస్ ఈ మాత్రానికే ఏడుస్తావేం' అన్నట్లు నవ్వుకుని "శ్రీహరి ఏమయ్యాడు గురూ" అని అడిగారు. అతని తండ్రికి జబ్బుగా వుందని తెలిసి ఊరికెళ్లాడని చెప్పాను.

వాళ్లు నొచ్చుకున్నారు. శ్రీహరిమీద వాళ్లకి ఎంత నమ్మకం! అతని మూలంగా దెబ్బలు తగిలాయని అసలు అనుకున్నట్లే కనపడటంలేదు. నిజం చెప్పద్దూ నేను భయపడ్డాను వాళ్లకి శ్రీహరి అంటే కోపం రావచ్చునని, తమని పోలీసుల లాఠీలకి ఎర చేసి తను మాత్రం చల్లగా తప్పుకున్నాడని అపవాదు వేయచ్చునని. వాళ్లందుకు విరుద్ధంగా ఎంతో ధీమాగా హీరోల్లా కన

పడ్డంతో నేను తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాను. కష్టాన్ని, అందులోనూ ఊహించని దాన్ని ఎదుర్కొంటున్నప్పుడే మనుషుల సిద్ధాంతాలూ, విశ్వాసాలూ పరీక్షకు కూర్చుంటాయి. అలాంటి పరీక్ష ప్యాస్ అయ్యారు వీళ్లిప్పుడు.

నిజానికి నాకు దేవాలయాల దగ్గర అల్లరి చేయడం అంటే ఇష్టం ఏ మాత్రమూ లేదు. కాని నా యిష్టాయిష్టాలనే అందరూ అవలంబించాలనే దురాశ నాకింతవరకూ కలగలేదు. అందులోనూ శ్రీహరిలాంటివాణ్ణి తప్పులు పట్టడం నేను కలలో కూడా చేయలేను.

మేం మాట్లాడుతూ వుండగానే కూర్మారావు నాయకత్వాన డజన్లు డజన్లుగా మిగతా విద్యార్థులంతా అక్కడకు రాసాగారు. మర్నాటినుంచీ స్ట్రయిక్ చేయాలని క్షణాల్లో నిశ్చయమైంది. ఆ చర్చల్లో దేవుణ్ణి రకరకాల భాషల్లో తిట్టడం కూడా జరగడంతో భరించలేక నేను నెమ్మదిగా నా రూంకి వచ్చేశాను.

నిద్ర పట్టలేదు. రాత్రంతా నిజంగా శివరాత్రి అయింది. అందుకే మర్నాడు నిద్ర లేచేసరికి ఎనిమిది దాటిపోయింది. స్నానాదులు ముగించి దైవప్రార్థనకి కూర్చున్నాను. మనసు మనసులా లేదు. ఇసుక తుపానులా అల్పమైన భయాలు ఆందోళనలు పిచ్చి ఊహలు వచ్చేసి నా మనోమందిరాన్ని కమ్మేస్తున్నాయి.

ఏమై పోయావు దేవుడా అనుకున్నాను. సరిగ్గా అదే ప్రశ్న క్రితం శివరాత్రికి అదే గుడికి వచ్చి పోకిరీ కుర్రాళ్లు అవమానించిన ఓ అమ్మాయి అడిగింది. కొంచెంలో మానభంగం తప్పిపోయింది ఆ అమ్మాయికి. ఇసకలో దొర్లుతూ ఏడుస్తూ "ఎంతపని చేశావు దేవుడా; ఏమైపోయావు దేవుడా; నీ కళ్లముందే ఇంత ఘోరమా దేవుడా?" అని అరుస్తూన్న ఆ పిల్లని నేనూ శ్రీహరీ చూశాం-మౌనంగా, కళ్లప్పగించి.

అక్కణ్ణించి వచ్చేస్తుంటే శ్రీహరి పిడికిలి బిగించి గాలిలో విసురుతూ "దేవుడు! ఉంటే కదా ఈ అమ్మాయి గోడు వినడానికి? సరిగ్గా టైంకి అటొచ్చి మనవాళ్లు ఆమెను ఆదుకున్నారు కాని దేవుడొచ్చాడా గుళ్లోంచి?" అన్నాడు కసిగా. నేనేమీ జవాబు చెప్పలేకపోయాను. తరువాత మా తాతని అడిగితే ఆయన ఈ చిక్కు విడదీశాడు. "రాష్ట్రపతి దేశానికి రాజ్యాధిపతి. కాని ఆయన నేరుగా పరిపాలించడు. అంతా పార్లమెంటుద్వారానే జరుపుతాడు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే రాష్ట్రపతి పాలన అనేది ఏర్పడుతూ వుంటుంది. అలాగే దేవుడూను. మామూలుగా దేవుని పాలన ప్రకృతి శక్తులద్వారా, మనుషులద్వారా జరుగుతూ వుంటుంది. మరీ అవసరం వస్తేనే ఆయన స్వయంగా దిగివస్తాడు, అదే అవతారం".

శ్రీహరికి అదే చెప్పాను తరువాత. అతను నన్నో వ్యంగంగా చూసి, మాట్లాడకుండా ఊరుకున్నాడు. ఈ విషయంలో అతనికి వాదన ఇష్టంలేదని నేనూ ఊరుకున్నాను.

నా వాదనకి శ్రీహరి ఇచ్చిన జవాబే కాబోలు ఈ శివరాత్రి నాటి వాళ్ల అల్లరి. ఈ అల్లరీ, పాపం అల్లరిపడ్డ మనుషులు, లాఠీచార్జీ చేసిన పోలీసులూ, దెబ్బలు తిన్న శ్రీహరి అనుచరులూ వీళ్లలో ఎవరిద్వారా దేవుడు పని చేశాడు? నా కర్థం కాలేదు. లేక అందర్లోనూ దేవుడున్నాడు కనుక అక్కడ జరిగిన పనులన్నీ దైవ కార్యాలేనా! అందరూ దైవ ప్రేరణ పొందే ఆయా పనులు చేశారా!

ఆ మర్నాడు నేను ఇలా నాలో నేను కుస్తీ పడుతుండగా మురళీధర్ వచ్చాడు. వస్తూనే "గోపాలంగారూ మీరు దైవభక్తులు కదా. శ్రీహరినీ అతని ఫ్రెండ్సునీ తిట్టరేం" అనడిగాడు.

"ఎందుకు తిట్టాలి?"

"నాస్తికుల్ని తిట్టాలిగా"

"తిడితే వాళ్లు మారిపోతారా?"

అతను తెల్లబోయి నన్ను చూస్తూ ఉండిపోయాడు. కొంతసేపటికి నోరు పెగుల్చుకుని ని "మీరు శ్రీహరి మాటలు విని పాడై పోయారు" అన్నాడు. ఆ అనుమానమే నాకూ ఉంటోందీ మధ్య. నేను అతని వాదనల్ని బుద్ధిపరంగా నిరాకరించవచ్చు కాని హృదయంలో ఏదో మార్పు వస్తున్నట్లుంది. పూర్వంలా దేవుణ్ణి తల్చుకోగానే ఆనందం కలగటంలేదు. మనస్సు ప్రశాంతంగా వుంటంలేదు. ఏదో తెలీని అసంతృప్తి, ఆరాటం నన్నావేశిస్తున్నాయి.

అందుకే వారం రోజులక్రితమే ఈ సమస్యని వెళ్లబోస్తూ మా తాతకి పెద్ద ఉత్తరం రాశాను. ఆయన తాపీగా జవాబు రాస్తున్నాడేమో ఇంతవరకూ ఏ కబురూ రాలేదు.

నాకు మురళీధర్ మీద వెర్రి ప్రేమ పుట్టుకొచ్చింది. ఎలా గ్రహించాడో నా సమస్యని.

మనం ఇతరుల గురించి నిశ్చలంగా ఆలోచిస్తేనే మనకు వాళ్ల గురించి తెలుస్తుంది. అంటే మన మనస్సుని నిరపేక్షంగా వాళ్లకిచ్చామన్నమాట. ఇవ్వందే ఏదీ రాదు. మురళీధర్ నా గురించీ, శ్రీహరి గురించీ ఎంతో ఆలోచించి వుండాలి. అదే నిజమైన ప్రేమ. ప్రేమ ఉంటే అన్నీ అర్థమవుతాయంటే ఇదే అర్థం.

ఇదంతా నాకు మా తాత నేర్పిందే. ప్రేమంటే మనసివ్వడం అని. మనం సమాజంలో 'కుళ్లు'ని గురించి అదేపనిగా ఆలోచిస్తున్నామంటే మనం కుళ్లుని మాత్రమే ప్రేమించామని అర్థం. అందుకే చెడు చూడకు, చెడు వినకు, చెడు మాట్లాడకు అన్నారు గాంధీగారు. మంచి గురించే ఆలోచించాలి. అదే సత్త్వం, అంటే బలం. బలాన్ని పెంచుకుంటేనే మనం మన బ్రతుకునీ బాగుచేసుకుంటాం, ఇతరుల అభివృద్ధికీ దోవ చూపిస్తాం.

మురళీధర్ కూడా ఇదే దారిలో నడుస్తున్నాడని తెలిసి నాకు ముచ్చటేసింది. నవ్వుతూ అడిగాను "పాడై పోయానా? అంటే ఏమిటి మురళీ?"

అతను ఒక నిమిషం తటపటాయించి "మనస్సు పాడు చేసుకుంటున్నారు. మీ మొగంలో ఏదో మార్పొస్తోంది. కళ తగ్గుతోంది. శ్రీహరికీ అంతే" అన్నాడు బిగ్గరగా.

"నిజమేననుకోండి. అందుకే మా తాతకి ఉత్తరం కూడా రాశాను. ఇంకా జవాబు రాలేదు... కాని మురళీధర్, శ్రీహరి చాలా గొప్పవాడు. మనం మన కుటుంబ గురించీ, ఒకళ్లిద్దరు స్నేహితుల గురించీ మాత్రమే ఆలోచిస్తాం, శ్రీహరి ప్రపంచం అంతటి గురించి ఆలోచిస్తాడు. అదింకా గొప్ప ప్రేమకదా" అన్నాను. మురళీధర్ ఏదో చెప్పబోతుంటే సునంద వచ్చేసింది మాగది గుమ్మం దగ్గరకి.

ఆనందంతో నా గుండె ఎగిరి గంతేసింది. అంతదాకా నేను, మురళీధర్ పడుతున్న తర్జన భర్జన ఎటు మాయమైందో చల్లగాలి సోకగానే మాయమైన చెమటలా! "రండి రండి. క్లాసు

'లు లేకపోయినా వచ్చేశారే" అన్నాను. కాలేజీ సమ్మెలో వుందికదా.

సునంద కళ్లు వాలిపోయాయి.

నాకర్థమైంది. అలాగని ఆమెకు తెలిస్తే ఇంకా సిగ్గుతో కందిపోతుంది. అందుకే "లైబ్రరీకి వచ్చారా" అన్నాను. ఒంచిన తలని నిలువుగా ఆడించి, వెంటనే కంగారుగా అడ్డంగా ఆడించింది సునంద.

శ్రీహరి నుంచి ఉత్తరం రాలేదు మాకెవరికీ. అలాగని చెప్పినా నిరుత్సాహ పడుతుంది, చెప్పకపోతే ఆత్రుతతో నలిగిపోతుంది. చివరకి రెండూ ఒకటే. ఏం చెప్పడానికీ తోచక, కొంత వ్యవధి కోసం "కాఫీ రప్పిస్తానుండండి" అని వేగంగా గదిలోంచి బయటపడ్డాను. బ్లాక్ బోయ్‌కి కాఫీ తెమ్మని చెప్పి వస్తుంటే పోస్ట్‌మన్ కనిపించాడు.

రెండు ఉత్తరాలు. ఒకటి మా తాతనించి. రెండోది శ్రీహరి రాసింది. అదే ముందుగా విప్పాను. శ్రీహరి డైరెక్ట్ ఎటాక్ ఇలా వుంది. "మా ఫాదర్ పోయాడోయ్. హార్ట్ ఎటాక్. ఉన్న ఏడు లక్షలూ చాలవని డబ్బుకోసం ప్రాణత్యాగం చేసి అమరవీరుడయ్యాడు. ఇది చాలక కర్మలూ, శార్థాలూ అంటూ పెద్దవాళ్ల న్యూసెన్స్. సూపర్ స్టిషన్ విశ్వరూపం చావు దగ్గర కనిపిస్తుందనుకో. ఓ పక్కన చచ్చి మళ్లీ పుట్టేస్తాడంటారు, అదే నోటితో మనం పెట్టే పిండాకూడు కోసం ఆవురావురుమంటూ కూర్చుంటాడంటారు. వీళ్లంతా రెండు నాలుకల స్నేక్స్.

శివాలయం దగ్గర మన తడాఖా చూసి జనం ఏమంటున్నారు? ఊరంతా అదిరిపోయి ఉంటారు.

నేనిక్కడ పదిరోజుల్దాకావుండి అందరి ఏడుపూ పంచుకోకపోతే స్వర్గంలో మా నాన్న ఏడుస్తాడట. ఒదిలేలా లేరు"

ఇలా సాగింది ఉత్తరం. నేను 'షాక్' అయ్యాను.

తండ్రి-తనువిచ్చిన తండ్రి పోయాడని చీమంత కూడా దుఃఖం కలగలేదా శ్రీహరికి? ఇతనికి హృదయం ఉందా? ఉంటే ఏమైంది?

నా మనస్సుని తుపాన్‌లా కుదిపేస్తున్న భావపరంపరని తప్పించుకోడానికి మా తాత ఉత్తరం ఆత్రంగా తెరిచి చదవసాగాను.

"చిరంజీవి గోపీకి ఆశీర్వచనములు. నీ ప్రశ్నలకి జవాబు ఉత్తరాల్లో కుదరదు. రేపు శుక్రవారం గోదావరీకి వస్తున్నా. అన్నీ మాట్లాడదాం. మీ యూనివర్సిటీని చూసినట్లూ వుంటుంది. ఈ మధ్య మీ నాన్న దగ్గర్నుంచి ఏ సమాచారమూ లేదు, అంటే అంతా కులాసా అని అర్థంకదా..."

నీ శ్రేయోభిలాషి
వీర బసవయ్య.

తాతలు దిగి రావాలి అని వినడమేకాని అదెంత గొప్ప విషయమోనని పించిందిప్పుడు. డెబ్బై ఐదేళ్లు దాటిన మా తాత నా గురించి ఇంతదూరం ప్రయాణం పెట్టుకుని రావడం నిజంగా స్వర్గాన్నించి వచ్చినంత అపురూపమే. కృతజ్ఞతతో మనసులోనే దైవానికి నమస్కారం

పెట్టాను.

ఆ్రతుత అణుచుకోలేక వరండాలోకి వచ్చేస్తున్న సునంద నాకెదురైంది. ఆశగా నా కళ్లలోకి చూసింది. అక్కడ చెప్పడం ఎందుకని "శ్రీహరి లెటర్ రాశాడు. పదండి రూంలో చదువుదాం" అన్నాను. ఇద్దరం వడివడిగా నడిచాం.

సునందని కుర్చీలో కూర్చోపెట్టాను. ఉత్తరంలోది దుర్వార్త. ఆ వార్తని నేనే చెప్పాలా, లేక ఉత్తరం ఆమె చేతిలో పెట్టాలా ఏది మంచిది అని ఆలోచిద్దామంటే వ్యవధిలేదు. రెండూ చేద్దామని శ్రీహరి ఫాదర్ చనిపోయాడు అంటూ అతని ఉత్తరం అందించాడు. ఆమెకు ఏమైనా షాక్ తగిలితే అది లోతుగా పోకుండా ఉత్తరం ఆపుతుందని. అదే జరిగింది.

శ్రీహరి ఉత్తరాన్ని సునంద ఆబగా చదివేసింది. మళ్లీ చదివింది. ఆమెకు ఏడు పొచ్చేస్తోంది. అంచేత నేను ఏమీ గమనించనట్లు "అతని కరేజ్ చూశారా. అదే ధైర్యం అంటే. ఇంత కష్టం వచ్చినా చెక్కు చెదరలేదు అతని మనస్సు. నిజంగా సునందగారూ! శ్రీహరి మామూలు మానవుడు  కాదు. అతనో అద్భుత వ్యక్తి" అని కంగారుగా మాట్లాడేయడం సాగించాను. మురళీధర్ మాత్రం నిస్సంకోచంగా 'బేరు'మని ఏడుపు మొదలుపెట్టాడు. ఎదురుగా ఓ ఆడపిల్ల వుంది అనే సిగ్గుకూడా లేకుండా. అతన్ని ఊరడించడంలో సునంద కొంత తేరుకుంది.

ఇంతలో కాఫీ ఫ్లాస్కుతో బ్లాక్ బోయ్ బాబూరావు వచ్చాడు. అతనికి సంగతి తెలిసిపోయింది. కాఫీ గ్లాసుల్లో పోసేసి చిల్లర తరవాతిస్తా సార్ అంటూ ఉడాయించాడు. శ్రీహరికి వున్న న్యూస్ వాల్యూ అతనికి తెలుసు. అతని తండ్రి పోయాడని అందరికీ తనద్వారా తెలియాలి. అదీ వాడి తొందర.

మురళీధర్ ఏడుపు ఆగాక సునంద గంభీరంగా కూర్చుంది కుర్చీలో. కొంతసేపు ఎవరం మాట్లాడలేదు. చివరికి సునంద "ఏమండీ, ఆనాడు శివాలయం దగ్గర అల్లరిచేసినందుకే శ్రీహరి తండ్రిని కోల్పోయాడా" అంది భయంగా దీనంగా. ఆ ప్రశ్న విని నేను గతుక్కుమన్నాను. సునంద 'నాస్తికత్వం' ఇలా వుందన్నమాట.

ఇలాంటి నాస్తికత్వం కంటే ఆస్తికత్వంలోనే ఎక్కువ మొండితనం వుంది. అదే కర్మ సిద్ధాంతం. దాని ప్రకారం ఎవరి కర్మఫలం వారే అనుభవించాలి. శ్రీహరి తండ్రికి గుండెజబ్బు వుంది, దానికి శ్రీహరి బాధ్యత ఏమీ లేదు. శ్రీహరి చేసిన తప్పుల ఫలితం శ్రీహరికే తప్ప మరెవరికీ చెందదు.

అదే క్లుప్తంగా సునందకి చెప్పాను. ఆమె ముక్కు చిట్లించి "ఏడిసినట్లుంది మీ కర్మ సిద్ధాంతం. దీని చాటునే దాగి పేదల కష్టాలకి వాళ్ల కర్మే కారణమంటూ ధనవంతులు హాయిగా దోచుకుంటున్నారు వాళ్లని" అంటూ చిన్న లెక్చర్ ఇచ్చింది. అచ్చం ఆడగొంతుక పెట్టి శ్రీహరి మాట్లాడినట్లే వున్నాయి సునంద మాటలు.

"మీరు ఒకవైపే చూస్తున్నారు. పేదలు కష్టపడుతుంటే వాళ్లకి సాయం చేసిన వాళ్లకి పుణ్యం వస్తుందనీ, పుణ్యఫలంగా ఎన్నో సుఖాలు వస్తాయనీ, అంచేత పరోపకారం చేయాలని కూడా కర్మ సిద్ధాంతం చెపుతుంది"

సునంద ఆవేశంగా చేతులు తిప్పుతూ "చాల్చాల్లెండి. మీరు శ్రీహరిగారి రూంమేట్‌గా ఇన్నాళ్లుండి కూడా ఇలా మాట్లాడ్డం డామ్ షేమ్" అంది.

చర్చలూ, వాదనలూ చిన్న చిన్న అభిప్రాయ భేదాలను సర్దుబాటు చేసేందుకు సరిపోతాయి. భావాల్లో అంతరం మరీ ఎక్కువ వున్నప్పుడు వాదన కేవలం కంఠశోష అవుతుంది. కేవలం ఆవేశాన్ని ఆద్రేకపరుస్తుంది. అని నాకెప్పుడో తెలుసు.

కాని నాకు ఇంతకు ముందెన్నడూ కలుగని ఓ చపలత్వం ఆవేశించింది. అదే సునందని వాదనలోకి దింపి; ఆమె ఆవేశంతో జేవురించిన ముఖంతో కీచుమని అరుస్తుంటే చూడాలని. ఈ కోరిక నాగరిక ప్రపంచంలో ప్రతి మగాడికీ సాధారణంగా తీరని కోరికే. నాగరికత హెచ్చు పెరిగిన కుటుంబాల్లో మనుషులు భావాల్ని అణిచిపెట్టుకోవడంలో చాలా కృషి చేస్తారు, స్త్రీలు మరీని.

అంచేత కర్మ సిద్ధాంతం అంటే ఆమెకు అర్థం కాదని తెలిసి కూడా వాదన పెంచాను. ఆమెను ఆవేశం క్షణక్షణం పెరిగిపోయింది. వాదించడానికి తనకు తెలిసింది ఏమీలేదని తెలిసేకొద్దీ ఆమె కంఠస్వరం పెరిగింది. చివరికి ఏడుపు పర్యంతం వచ్చింది. కళ్లనీళ్లతో నన్ను శపించింది సునంద. "మీవన్నీ కుళ్లు సిద్ధాంతాలు. తాతలనాటివి. వాటికి కాలం చెల్లింది" అని. నేను అవమానంతో తలవంచుకున్నాను. కుళ్లు వున్నది నా సిద్ధాంతాల్లోకాదు; ఆమెను రెచ్చకొట్టిన నా చపలత్వంలో. మనసారా 'సారీ' చెప్పాను.

* * *

తరువాత ఒక అరగంట ఇంకేవేవో మాట్లాడాక సునంద వెళ్తానని లేచింది. నేను, మురళీధర్ ఆమెకూడా రోడ్ మీదకు వెళ్లి బస్సెక్కించాం.

నా మనసు పూర్తిగా వికలమై పోయింది.

ప్రేమే దైవం అంటారు తాత్వికులు. ప్రేమలో దైవత్వం ఉందిట. అందుకే మనలోని దివ్యత్వాన్ని పెంపు చేయాలంటే అందర్నీ ప్రేమించాలని, సద్భావం వుంచుకోవాలనీ మా తాత చిన్నప్పుడే నాకు నేర్పాడు.

కాని నేనిప్పుడు సునందని అకారణంగా వాదనలోకి ఈడ్చి రెచ్చగొట్టాను. ఇక్కడ ప్రేమ ఏముంది? ఆవేశంలో మనుషుల మనస్సు విశ్రాంతిని కోల్పోతుంది, శరీరంలో అక్కర్లేని రసాయనిక మార్పులు కలుగుతాయి. ఆ మార్పులు అనారోగ్యానికి బీజాలు.

సునందని కవ్వించి ఏడిపించి హింసించే హీనదశ నాకెందుకు వచ్చింది? గత కొద్ది నెలలుగా శ్రీహరి మాటల్ని విని విని మనస్థిమితం దెబ్బ తినడం చేతనా? దైవ చింతన తగ్గిపోవటం చేతనా?

ఏమైతేనేం. ఏవో ప్రభావాలు నామీదకు వస్తున్నాయి. వాటి వలన ఊహించని పరిణామాలు వస్తున్నాయి. ఇన్నేళ్లుగా నేను చదివిన పవిత్ర గ్రంథాలూ, తాత వ్యాఖ్యలూ వివరణలూ వీటిని ఆపలేకపోయాయి.

నాకు ఏడుద్దామన్నా ఏడుపు రాలేదు. ఈ విషయంలో మురళీధర్ ఎంతో అదృష్టవంతుడు.

## 8

"ఆశయ శిఖరాల పైకి ఎక్కించే శక్తి ఏది
చెదరిన నమ్మకల గూడు దక్కించే యుక్తి ఏది?"

యూనివర్శిటీ ఇన్‌గేట్ దగ్గర ఆటో ఆపమన్నాడు మా తాత. "ఇంకా రెండు ఫర్లాంగుల దూరం వుంది తాతా" అన్నాను. ఆయన దిగబోతుంటే. "నడుద్దాం. దారిలో మీ విశ్వకళా పరిషత్ భవనాలని చూడచ్చు" అన్నాడు మా తాత. ఆయన తెచ్చిన రెండు సంచులూ పట్టుకుని నేనూ దిగాను. ఆటోకి డబ్బులిచ్చేసి నడవసాగాం.

"లెట్రిన్స్‌కి ఇంతంత పెద్ద బిల్డింగ్స్ కట్టేరేమిట్రా" అన్నాడు మా తాత. నాకు నవ్వొచ్చింది.

"అది లెట్రిన్ కాదు తాతా. కాలేజీ" అన్నాను. దాన్ని లెట్రిన్ అని ఎందుకనుకున్నాడో వివరించాడాయన.

"మన ఊళ్లలో ఇలాంటి రాతలు ఎక్కువుంటాయిరా పబ్లిక్ లెట్రిన్ల గోడల మీదేకదా. మనుషులుండే ఇళ్లమీద ఇలాంటి రాతలుంటాయా. అందుకే ఇవి లెట్రిన్ లనిపించింది"

నిజమే. ఆ రాతలు విద్యార్థులు అనేక సంవత్సరాలుగా రాసినవి. "...పందీ, వెనక్కిపో, ...డౌన్ డౌన్, ...కుక్కల్ని ఎదిరించండి, ...జిందాబాద్, ...ముర్దాబాద్, ...నిరసించండి, ... విద్యావిధానం పోవాలి..." ఇంకా అనేకానేక ఉచ్చరించరాని నినాదాలతో సహా గోడల్నిండా ఎక్కడా ఖాళీ లేకుండా అనేక రంగులతో రాసి వున్నాయి. భవనాలు పూర్తిగా నిండిపోయాక రోడ్డుమీద కూడా రాశారు. నేను వాటికి అలవాటు పడిపోయాను. కాని మా తాత ఎత్తి పొడుపుతో మళ్లీ అవమానం కలిగింది నాకు.

తరువాత కాఫీ తాగుతూ కేంటీన్ లోపల గోడల మీద కూడా నినాదాలు రాసి ఉంటం చూసి ఆశ్చర్యపోయాడు మా తాత. "పోనీ పైన రాసేరనుకో. లోపలెందుకు రాయనిచ్చార్రా ఇవన్నీ"

నాకు చెప్పక తప్పలేదు. "అడ్డుకుంటే తంతారని భయం. ఆ మాటకొస్తే మా క్లాస్ రూంలో కూడా గోడలన్నీ ఖరాబే" అన్నాను కాఫీ, సిగ్గు కలిపి మింగుతూ.

"చదవేస్తే ఉన్న మతి పోయిందిట. ఇలా గోడల్ని పాడుచేసేవాళ్లే రేపటి పెద్ద ఆఫీసర్లు...కాని అబ్బీ, దేవుడున్నాడురా. మన మంత్రుల్ని చూడు. ఉన్న వెయ్యిమందిలోనూ యూనివర్సిటీ చదువు లేనివాళ్లే మూడు వంతులు పైగా. అలాగే కోటీశ్వరులలోనూ ఈ 'గొప్ప' చదువులు లేనివాళ్లే ఎక్కువ. తమ కాలేజీ భవనాల్ని ఇలా కలుషితం చేసే మేధావులకి డబ్బు, అధికారం లేకుండా చేశాడు దేవుడు. అబ్బో దేవుడంటే మాటలా. ఆయనకి తెలీదా ఇలాంటి వాళ్లని మంత్రులు, పారిశ్రామికాధిపతులు అవనిస్తే దేశం మసి అయిపోతుందని! దేవుడు సర్వశక్తిమంతుడే కాదు సర్వజ్ఞుడురా. ప్రతీ చిన్న విషయం ఆయనకి లెక్కే" అని భక్తితో చేతులు జోడించి కేంటీన్ గోడమీదున్న కుమారస్వామి ఫోటోకి నమస్కరించాడు మా తాత.

'ఎప్పుడూ ఉద్రేకం కనపర్చని మా తాత ఇలా విరుచుకపడ్డం వింతగానే ఉంది. కాని ఇదేముంది? ప్రథమ షాక్. అసలు షాక్ హాస్టల్స్ లోపల చూశాక వస్తుందీయనకి' అనుకున్నాను.

మేం కేంటీన్ నించి నా రూంకి నడుస్తుంటే ఆయన తొంభై, డెబ్భై, నూటమూడు...అంటున్నాడు ఉన్నట్టుండి. "ఏమిటి తాతా ఈ అంకెలు" అన్నాను.

"విద్యార్థుల వయస్సులు. అంచనా వేస్తున్నాను"

"మరి తొంభై, డెబ్భై...అంటావేమిటి? మావాళ్ల సగటు వయస్సు ఇరవై ఒకటి" అన్నాను.

"నువ్వనేది జనన మరణాల ఆఫీసు వయస్సు..నేననేది వాళ్ల ఆరోగ్యానికి తగ్గ వయస్సు. ఆ అబ్బాయిని చూడు. నేను కుస్తీపడితే రెండు క్షణాల్లో పడిపోతాడు. నా వయస్సు డెబ్భై అయిదు. దానికి అయిదేళ్లు కలుపు; అతని ఏజ్ వస్తుంది. ఆ చప్పిదవడలు, వంగిన నడుము, చచ్చు నడక... ఎన్నేళ్ల వాళ్లకి వస్తాయిరా అవి?..." అని ఆయన బాధగా నిట్టూర్చాడు.

రూంకి చేరాక మా తాత స్నానం అంటూ లేచాడు. "నీళ్లుండవు" అన్నాను నిస్సత్తువగా.

"ఎందుకుండవు"

"ఉదయాన్నే ఖాళీ అయిపోతాయి. ఓవర్ హెడ్ టాంక్స్" అని మావాళ్లు కుళాయి బుర్రలు విరిచేస్తారనీ, అంచేత నీళ్లు తెల్లారకుండానే టాంక్ లోంచి నేరుగా మురిక్కాలవల్లోకి పోతాయనీ చెప్పాను. స్నానంచేస్తే ఆ పది నిమిషాల్లోనే చెయ్యాలి.

మా తాత స్నాన ప్రయత్నం విరమించి కూజాలో నేను దాచిన నీళ్లతోనే ముఖం, కాళ్లు, చేతులు కడుక్కున్నాడు.

ఇంక మళ్లీ యూనివర్సిటీ గురించి మాట్లాడలేదు ఆయన. పేరుకి హాస్టల్ రూంలో ఉన్నాడు కాని ఆయన మనస్సు మరో ప్రపంచం ఎందులోనో ఉండసాగింది.

మా తాత్విక చర్చ మొదలైంది.

అలవాటు ప్రకారం ఇద్దరం కళ్లు మూసుకుని కొంతసేపు దైవ ప్రార్థన చేశాం. మా తాత దైవభక్తి ఆవశ్యకత, కర్మ సిద్ధాంతం, పాపపుణ్యాలు, జన్మ పరంపర వీటన్నిటి గురించీ నాకు చిన్నప్పట్నించీ చెప్తూనే ఉన్నాడు. వాటిని మళ్లీ మననం చేసుకోడం, ఇప్పటి సమస్యలకి అన్వయించడం మాత్రమే మేమిప్పుడు చేసింది.

"అంత ఆందోళనగా పెద్ద ఉత్తరం రాశావు. ఏమిటోయ్ కథ?" అడిగాడు మా తాత. నేను శ్రీహరి గురించీ, అతని మాటల్లోనూ, అతనిచ్చిన పుస్తకాల్లోనూ నేను నేర్చుకున్న ఆధునిక సిద్ధాంతాల గురించీ, ఈ ప్రభావాల కారణంగా నాలో కలిగిన అలజడి-అన్నీ తొందర తొందరగా చెప్పేశాను. చెప్పేకొద్దీ నాలో ఆవేశం పెరిగిపోయింది.

సాంతం చిన్న నవ్వుతో శ్రద్ధగా విన్నాడు మా తాత. అంతా విని "ఓష్ ఇంతేకదా. ఇంగ్లీషు వాళ్లకి వేదాలూ శాస్త్రాలూ పురాణాలు లేవుకదా. ఇప్పుడిప్పుడే కొండని తవ్వి ఎలకని పట్టినట్లు నాలుగు సంగతులూ తెలుసుకుంటున్నారు. వాటిలో అంతా అజ్ఞానమే" అన్నాడు చాలా ధీమాగా.

నాకు ఆనందంతో గుండె జల్లుమంది. ఎన్ని సముద్ర తరంగాలూ, ఉప్పెనలూ వచ్చి ఢీ కొట్టినా చలించని మహాపర్వతంలా కనిపించాడు మా తాత.

నా సమస్యలు పొగమంచులా కరిగిపోయినట్లు ఫీలయ్యాను. ఆ సాయంత్రం నేను దైవప్రార్థన చేస్తుంటే పవిత్రమైన కాంతి నా శరీరంలోనా, చుట్టూనూ నిండినట్లైంది.

## 9

"గాజుల గలగల, నవ్వుల కిలకిల
చక్కని చల్లని రాతిరి నిండా, చల్లని మెల్లని రాతిరి నిండా..."

నిన్నటి మా తాత్విక చర్చతో నా హృదయం ఊరట పొందిందేమో రాత్రి మంచి మొద్దు నిద్ర పట్టింది నాకు. నిద్ర లేచేసరికి బాగా ఎండగా వుంది. తొందరగా మంచం దిగి టూత్ బ్రష్ తీస్తుంటే దాని క్రింద మా తాత రాసిన చీటి ఉంది – "బీచ్ కి వెళ్తున్నాను. పదింటికి వచ్చేస్తాను" అని. నేను ఆ చీటీని ఇంకెక్కడ ఉన్నా చూడకపోయే అవకాశం ఉండేది; అందుకే దాన్ని టూత్ బ్రష్ క్రింద ఉంచిన మా తాత మెళుకువని పోల్చుకుని మురిసిపోయాను.

పళ్లు తోముకుంటుంటే ఎవరో గుర్తు చేసినట్లు హఠాత్తుగా రాత్రి నాకొచ్చిన కలల గురించి గుర్తొచ్చి నా ఒళ్లు పులకరించింది. అంత అందమైన కలలు నాకింత క్రితం ఎప్పుడూ రాలేదు.

కలలో నేనూ, సునందా; ఇంకా ఎవరెవరో ఉన్నారు కాని వాళ్లనవసరం. కల మళ్లీ కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంటే వింత అనుభూతులతో, కాళ్లలో ఒణుకుపుట్టించే ఉద్రేకంతో నిలబడలేక వరండా మెట్లమీద కూర్చుండిపోయాను.

అది చాలా అద్భుతమైన కల. సునంద కోసం నేను పారిజాత వృక్షం ఒకటి దొంగిలించాను. ఆ చెట్టు శ్రీకృష్ణుడు సత్యభామ కోసం ఇంద్రుణ్ణి తన్ని భూమి మీదకు తెచ్చిందే. సునంద కోసం నేనా చెట్టుని ఉన్నచోటు నించి పెకలించి ఆమె హాస్టల్ రూం కిటికీ దగ్గర పాతా లనుకున్నాను. అక్కడుంటే కిటికీలోంచి పరిమళాలు గదిలోకి వస్తూ ఉంటాయి; పువ్వులు కోసుకోవాలంటే కిటికీ చువ్వల్లోంచి చెయ్యి చాపితే చాలు రెండు క్షణాల్లో మూరెడు దండకి సరిపోయినన్ని కోసుకోవచ్చు.

కాని చెట్టుని భుజాన్నేసుకుని రోడ్లమీద వెళ్తే బాగోదు. అందరూ నవ్వుతారు. అంతే కాదు ఇది యాంత్రిక యుగం. రైళ్లు, విమానాలు అందరికీ అందుబాటులో ఉన్నవాయె. నేను రైల్వేస్టేషన్ కెళ్లి రెండు రైలు చక్రాలు దొంగిలించాను. రెండు చేతుల్తోనూ వాటిని పట్టుకుని పారిజాత వృక్షం వద్దకు నడుస్తుంటే సునంద ఎదురైంది. "చేతిలో ఆ రైలు చక్రాలేమిటండీ" అంది.

ఏమీ ఎరగనట్లు నటన! నాచేతే చెప్పించాలి, తనకి తెలిసిందే అయినా. తాను మాత్రం తెలిసినా నోరిప్పి చెప్పకూడదు! నేను మాట్లాడలేదు. రైలుచక్రాల్ని అవలీలగా మోస్తున్న యోధునిగా నా డిగ్నిటీ నాకుంది.

అప్పుడు నన్ను సునంద కావిలించుకుంది. ఆ తరువాత చాలా కల నడిచింది కాని

ఇక్కడ చెప్పక్కర్లేదు అదంతా. అసలు విషయం ఒక ఆడపిల్ల అలా చొరవగా ఒక అబ్బాయిని కౌగలించుకోడమే. అది ప్రత్యేక సందర్భమే కావచ్చు! నా చేతులు రెండింట్లోనూ బరువులుంటాన ఆమె చొరవ తీసుకోవలసిన అవసరం వచ్చిందనవచ్చు. ఏమైనా అది అపురూపమే.

కల పదే పదే గుర్తొచ్చి కితకితలు పెడుతుంటే ఎలాగో స్నానం దాకా వచ్చాను. మా తాత వచ్చినప్పట్నుంచీ బాబూరావు రెండు బకెట్ల నీళ్లు ఉదయం పట్టేసి దాస్తున్నాడు. నేను టవల్ భుజాన్నేసుకుని బాత్‌రూం నించి వచ్చేసరికి గదిలో మా తాత కూర్చుని ఉన్నాడు.

"మీ శ్రీహరి పెద్ద మొనగాడంటావు కదుటోయ్. నిన్న రాత్రంతా నిద్దట్లో ఒకటే ఏడుపు; నిన్ను వాటేసుకుని" అన్నాడు మా తాత. నేను ఆశ్చర్యంగా "శ్రీహరి ఎప్పుడొచ్చాడు? ఏడీ" అన్నాను.

"కోణార్క్‌లో వచ్చాడులే. వస్తూనే నన్ను పోల్చుకుని ఓ అరగంట భీకరంగా వాదించాడు. కుర్రాడిలో ప్రతిభ, సాహసం ఉన్నాయి. బుద్ధి పాదరసమే! రేపు మాట్లాడదాం అని చెప్పి పడుకోమన్నాను నేను. నీ పక్కనే పడుకున్నాడు. రైలు బట్టలు కూడా మార్చుకోకుండా... మూడింటికి కాబోలు అతని ఏడుపుతో నాకు నిద్రా భంగమై పోయింది. శ్రీహరి చలికి తల్లి డొక్కలో దూరిపోయిన పిల్లాడిలా నీకు హత్తుకుపోయి నిద్రలోనే ఏమేమో చెప్పేస్తూ ఏడుస్తూ వున్నాడు. తండ్రి చనిపోడంతో బాగా షాకై ఉంటాడు..."

"అతనలా లెక్కచేసే మనిసి కాదు తాతా" అన్నాన్నేను. అంతలో నా మధుర స్వప్నం గుర్తొచ్చి సిగ్గుతో తల్లడిల్లిపోయాను. నిద్దట్లో నన్ను కౌగలించుకుని శ్రీహరి ఏడుస్తుంటే సునంద నన్ను నడిరోడ్డు మీద కౌగలించుకుని పాట పాడినట్లు కలగన్నాన్నేను!

తింటూ తింటూ ఉన్న పాలకోవా మన నోటిలో కచిక బూడిద అయిపోతే ఎలా ఉంటుంది! అలా ఫీలయ్యాను. దేవుడి మీదా, ఆయన కల్పించిన కలల మీదా కోపం, ఉడుకుమోత్తనం వచ్చాయి. ఇందులో ఏమైనా న్యాయం ఉందా? ఇప్పుడు కలైంది; రేపు వాస్తవంలో కూడా ఆయనిలాంటి తమాషాలే చేస్తే? నాకేం నచ్చలేదు దేవుడి వరస. అంతదాకా కలలు భవిష్యత్తును సూచిస్తాయనీ, తెల్లవారే ముందొచ్చిన కలలు నిజమవుతాయనీ కొందరనే మాటల ఊతంతో సునంద నన్ను ప్రేమిస్తోందనే చిన్న పగటి కల కూడా కన్నాన్నేను. ఎంత అవమానం! ఎంత హాస్యాస్పదం ఈ వింత సంఘటన!

మరైతే జీవితంలో కలల విలువ ఏమిటి? మా తాతకి నా కల సంగతి టూకీగా చెప్పి అర్థం చెప్పమన్నాను. ఆయన కుర్చీలో సుఖంగా సర్దుక్కూర్చుని "కలలు కూడా నిజమేరా. మన పూర్వజన్మ సంస్కారాలు కలల్లో కనిపిస్తాయి..." అంటూ చెప్పబోతుంటే "మరైతే సునంద నన్ను పూర్వజన్మలో ప్రేమించిందా? అప్పుడు రైళ్లూ, రైలు చక్రాలూ ఎలా ఉంటాయి?" అని ఎదుర్కొన్నాను.

మా తాత కొంచెం తటపటాయించి "జ్ఞానవాశిష్టం చదివితే అంతా తెలుస్తుంది, ఈ కలల కమామీషు...కలలకీ, మెళుకువలో అనుభవాలకీ సంబంధాలు తప్పక ఉంటాయి కాని రెండు రెళ్లు నాలుగన్నంత సరళంగా ఉండవు...ఓ మనిషికి తీసిన ఛెస్ట్ ఎక్స్‌రే ఫోటోకీ, మామూలు ఫోటోకి ఉన్న సంబంధం ఏమిటి...ఎక్స్‌రేలో ఎముకలు కనిపిస్తాయి. మామూలు

ఫోటోలో ఎదురు రొమ్ము పై చర్మం కనిపిస్తుంది. ఆ రెండూ ఒకదాని ఫోటోలే కాని వాటి ప్రయోజనాలు, లక్షణాలు వేరేగా ఉన్నట్లే, కలా మెళుకువాను. ఈ వేదాంతం తర్వాత మాట్లాడదాం కాని నీకు సునంద అంటే యిష్టమా" అన్నాడు. అవునని తల ఆడించాను.

"మరి ఆ పిల్ల మాటో"

"తెలీదు"

"అసలే తెలియదా?"

"శ్రీహరిని ప్రేమిస్తోందనుకుంటాను"

"మరి తెలియదంటావేం. తెలిసినా అది నిజం కాదేమోననే ఆశ ఉంది నీకు..." ఆయన నిశ్చలంగా నా కళ్లలోకి కొన్ని క్షణాలు చూసి "ఈ విషయంలో నీ బుర్ర పాడుచేసుకోకు. ప్రేమలూ పెళ్లిళ్లూ పూర్వజన్మలనించే తెచ్చుకుంటాం మనం. ఆ అనుబంధాల బలాబలాల్ని బట్టి ఈ జన్మలో సంబంధాలుంటాయి. సైకో ఎనాలిసిస్ మహాపాపకృత్యం. మనస్సు లోతు ఆలోచనకి అందదు. మన ఇష్టాయిష్టాలే మనకు తెలియవు, పై వాళ్ల విషయం అంచనా వేయడానికి ప్రయత్నిస్తే బుర్ర వేడెక్కి పిచ్చెత్తుతుంది-" అని ఆయన చెప్తుంటే నేను ఉక్రోషంతో "మరి మనస్సులోంచి తోసుకువచ్చే కలల్నీ ఆరాటాల్నీ ఆశలనీ ప్రేమలనీ ఏం చేయమంటావు తాతా" అని అరిచాను.

మా తాత నన్ను ప్రేమగా చూస్తూ మాట మార్చేశాడు. నేను విసిరిన ప్రశ్న తనను అసలు చేరనట్లు "నీకు చదువు పూర్తవుతోందని తెలిసి పెళ్లి సంబంధాలు వచ్చేస్తున్నాయోయ్. మొన్న కేతవరం నుంచి భీమారావుగారు వచ్చారు టాక్సీ చేసుకుని. ఆయన మూడో కూతురు వీరలక్ష్మి అని, పెళ్లికి ఎదిగింది ఉందని, జాతకం, ఫోటో ఇచ్చి నన్ను కాళ్లు పట్టుకుని బతిమాలాడు. ఈ కాలపు కుర్రాళ్లు తాతల మాటలు వింటారా అని నేనంటే కొందరు తాతల మాట లైతే వింటారని చమత్కరించాడు. నువ్వు నా మాట కాదనవని!" అన్నాడు.

గారడివాడు టోపీలోంచి కుందేలుని తీసినట్లు ఆయన చేతి సంచిలోంచి ఓ నోట్ బుక్ తీసి అందులో దాచిన ఒక జాతక చక్రం నకలూ, రెండు ఫోటోలు బయటపెట్టాడు.

వీరలక్ష్మి ఫోటో చూడగానే నా గుండె లయ తప్పింది - నిస్పృహతో. సునందని చూసిన కళ్లతో మరే అమ్మాయిని చేసినా అంతేనేమో. అదీ కాకుండా వీరలక్ష్మికి కొంచెం కెమేరా భయం ఉన్నట్లుంది. ఎదురుగా దెయ్యం కనపడితే ఎలా ఉంటాయో అలా ఉన్నాయి ఆమె చూపులు. వాటి నైశిత్యాన్ని తట్టుకోలేక రెండో ఫోటో (ఫుల్) చూశాను. వీరలక్ష్మి ఒక ఎత్తైన బల్లమీద ఉంచిన ఆర్మనీ పెట్టె వాయిస్తున్నట్లు నటిస్తోంది అందులో. ఆమె సంగీతం 'చూడముచ్చటగా' ఉండి చెవులకు బాధగా ఉంటుందనే సూచన కనపడింది నాకు! నీరసం ముంచుకొచ్చింది.

అంతలో బాబూరావు టిఫినూ, కాఫీ పట్టుకుని వచ్చాడు. ఆకలిచేత కొంతా, ఫోటోల నించి రక్షణ కోసం కొంతా నేను అతి ఆత్రంగా టిఫిన్ తినడం మొదలెట్టాను. మా తాత మాత్రం తన యత్నం విజయవంతమైనట్లుగానే తృప్తిగా కూర్చుని వీరలక్ష్మి జాతకాన్ని పరిశీలిస్తున్నాడు. బాబూరావు ఆ ఫోటోల్ని పసిగట్టి "అయ్‌గారికి పెళ్లి సంబంధమా తాతగారూ. తొరగా పెళ్లి చేసేయండి" అని మా తాతని ఎంకరేజ్ చేశాడు.

పెద్దల వ్యవహారాల్లో ఓ 'బ్లాక్ బోయ్' కలగజేసుకోబూనడం మా తాతకి నచ్చినట్లు లేదు; మూతి బిగించాడు. నేను వెంటనే "బాబూరావు నాకు చాలా సన్నిహితుడు తాతా. రాత్రింబగళ్లు పనితో సతమతమవుతూ కూడా మెట్రిక్ పరీక్షకి చదువుతున్నాడు. నైస్ బోయ్" అన్నాను. బాబూరావు మొహం చేటంత అయింది సంతోషంతో. దాంతో మా తాతకి కోపం తగ్గింది. బాబూరావు అందించిన కాఫీ కప్పు అందుకుంటూ "బాగా చదువుతున్నావ్ రా? చదువు. మంచి ఉద్యోగం వేయిస్తాను" అన్నాడు. బాబూరావు పరశంతో ఇకిలిస్తూ "మా అయ్ గారున్న చోటే వేయించాలి తాతగారూ. అయ్‌గారి పెళ్లి పనులన్నీ నేనే చేయిస్తా. మీకు శ్రమ ఉండదు" అని భరోసా ఇచ్చాడు.

అప్పుడే గదిలోకి వచ్చాడు శ్రీహరి; వెనకాలే సునంద. సునంద మా తాతని చూసి గతుక్కుమని వెనక్కి తగ్గింది కాని మరుక్షణం ధీమాగా లోపలికి వచ్చి ఒక మంచం చివర్న కూర్చుంది. వాళ్లకి కూడా కాఫీ యిమ్మన్నాను బాబూరావుతో.

శ్రీహరి బాబూరావు మాటలు విన్నట్లున్నాడు. మా తాతని ఉద్దేశించి గోడవేపు చూస్తూ "ఈ దోపిడీ వ్యవస్థలో పెళ్లీ ప్రేమా అర్థంలేని మాటలు. అరవై ఆరు పెర్సెంట్ మనుషులు రెండు పూటలా భోజనానికి నోచుకోని ఈ దేశంలో..." అంటుంటే, "అరవై ఆరు శాతం కాదు హరీ, అరవై తొమ్మిదిన్నర" అని సవరణ చేసింది సునంద. శ్రీహరి ఆమెవైపు మెచ్చుకోలుగా చూసి "ఎగ్జాక్ట్‌లీ. ఇంతమంది ఆకలితో మాడుతుంటే ప్రేమట ప్రేమ. సునందా ముఖేష్ పాడాడు ఆ పాట-సుధామల్ హోత్రాతో కలిసి. ఏమిటది...ఆఁ గుర్తొచ్చింది" అని చరణం పాడి వినిపించాడు. "భూక్ ఔర్ ప్యాస్‌కి మారీ హుయి ఇస్ దునియామే, ఇష్క్‌హీ ఏక్ హకీకత్ నహీఁ కుఛ్ ఔర్ భీహైఁ..." (ఆకలి, దాహం దెబ్బ కొడుతున్న ఈ ప్రపంచంలో ప్రేమ ఒక్కటే కాదు ఇంకా ఇతర సమస్యలున్నాయి అనీ అర్థం). మెరుస్తున్న కళ్లతో మిగతా పాట అందు కుంది-సునంద "తుమ్ అగర్ ఆంఖే చురావో..." అంటూ.

పాట అవనిచ్చి మెచ్చుకున్నాడు మా తాత. "హిందీ సినీమాల్లో పాటలు రాసేవాళ్లకీ బాగానే ముడుతుందిట. ఆకలి మీద ఈ పాట రాసి ఏ ఐదువేలో ఆ కవి సంపాదించినట్లే, ఈ పాడు వ్యవస్థలో ప్రేమలూ పెళ్లిళ్లూ కుదరవనే ఏకాభిప్రాయం కారణంగా మీరిద్దరూ దగ్గిరయ్యారు. బాగుంది" అని మా తాత అంటుంటే శ్రీహరి మొహం జేవురించడం నేను కుతూహలంతో గమ నించాను.

"ఇందులో దగ్గరవడం ఏమిటో నాకర్థం కావటంలేదు. మీ పాతకాలం వాళ్లకి ఓ అబ్బాయీ అమ్మాయీ కలిసి కనపడితే చాలు- అక్కడ సెక్సే కనిపిస్తుంది. కాని మేం అలా అనుకోటం లేదు. ఒక కామన్ కాజ్ కోసం-" అని శ్రీహరి బిగ్గరగా అంటుంటే వంతగా "ఒక ఆదర్శం కోసం, సమాజాన్ని మార్చడానికి మేమంతా కలిసి పనిచేస్తున్నాం" అంది సునంద.

"అది నిజమైతే ఎంత బాగుణ్ణు" చల్లగా అంటించాడు మా తాత. శ్రీహరి కోపంగా ఏదో అనబోతుంటే కాఫీ కప్పు అందించాడు బాబూరావు. వాడి టాక్ట్‌కి మురిసిపోయాన్నేను. శ్రీహరి కాఫీని చూడగానే శాంతించాడు. అతనీ మధ్య 'మందు' కూడా తరచు సేవిస్తున్నాడు

కాని, అతని ఫస్ట్ లవ్ సిగరెట్లు, తరవాత కాఫీని. సునంద కాఫీ సిప్‌చేస్తూ "తాతగారూ మీకీ విషయాలు అర్థంకావు. మీరు హాయిగా కృష్ణా రామా అంటూ కూర్చోక వీటిలో ఎందుకు వేలు పెడతారు" అని సలహా యిచ్చింది.

"బాగా చెప్పావమ్మా. ఈ విషయాలు నాకు తెలియవు. తెలుసుకుందామనే ఈ ఊరు వచ్చింది; నా మనవడు వీటి గురించి ఉహు పోరు పెట్టేస్తుంటే సరదాపుట్టి వచ్చాను. చెప్పమ్మా మీ ప్రోగ్రాం" అన్నాడు మా తాత.

సునంద చెప్పింది: ఆధునిక భావాల్ని ప్రజల్లోకి ప్రవేశపెట్టాలి. బూజు పట్టిన భావాల్ని ఖండించాలి...

మా తాత ఆమె చెప్పేదంతా శ్రద్ధగా విని ఏమీ విననట్లే నాతో "వీరలక్ష్మి నీకు నచ్చినట్లేకదరా అబ్బీ. ఆయనక్కి ఉత్తరం రాసేస్తాను. ముహూర్తం పెట్టించమని" అన్నాడు. ఆయనిలా మాట మార్చడం, నా పెళ్లి ప్రసక్తి తేవడంలో ఎంతలోతైన 'కుట్ర' ఉందో తరువాత ఆయన చెప్పేదాకా తెలీలేదు నాకు. సునంద, శ్రీహరి ఎలా రియాక్ట్ అవుతారో బయట పెట్టాలని ఆయన ప్లాన్‌ట.

"ఏమిటోయ్ అప్పలకొండా, నీకు పెళ్లా? పైగా మీ తాత తెచ్చిన సంబంధమా?" అన్నాడు శ్రీహరి. సునంద కూడా కొంచెం మావేపు జరిగి "ఈరోజుల్లో కూడా ఏరేంజ్‌డ్ మేరేజెస్సా!" అంది. ఫోటోల్ని చూసి వీరలక్ష్మి కోతికి ఓ మెట్టు తక్కువ అని గ్రహించిన ఆమె ముఖంలోని వెలుగును నేను మర్చిపోలేను.

"నిక్షేపంలాంటి సంబంధం. పిల్ల దీపంలా ఉంది. అన్ని పనులూ వచ్చు; పెద్దవాళ్ల శిక్షణ అలాంటిది... పాతికమందికి సులువుగా వండి వడ్డించగలదు..."

వంట వడ్డన ప్రసక్తి రాగానే హేళనగా నవ్వారు శ్రీహరీ, సునందా. 'చూశావా?' అన్నట్లు నావేపు చూశాడు మా తాత. తల ఆడించాను. ఇందులో ఉన్న జోక్ ఇది. చాలామంది 'ఆధునిక' మేధావులకి పొలంలోనూ, ఫ్యాక్టరీలోనూ జరిపే శ్రమే శ్రమ; వంటింట్లో గృహిణి పడేది శ్రమ కాదు. ఎందుకంటే వీళ్లు డబ్బు మనుషులు. డబ్బు సంపాదించే శ్రమ మాత్రమే వీళ్లకి అనుతుంది. ఈ డబ్బు దృష్టి మన దేశంలో కంటే పాశ్చాత్య ప్రపంచంలో చాలా ఎక్కువ. భారతీయ సంప్రదాయం 'అన్నదాతా సుఖీభవ' అని దీవిస్తుంది అన్నం పెట్టిన వాళ్లని; గృహిణిని గృహలక్ష్మి అని కీర్తిస్తుంది.

"ఎందుకు నవ్వుతారు?" అమాయకంగా అడిగాడు మా తాత.

"మీ మనవడి కాబోయే పెళ్లాం వండి వడ్డిస్తే తిందామని ఆశ కలిగి" వెటకారంగా అంది సునంద. నాకా క్షణంలో ఆమె ఆడతనం, అందం, అన్నీ కోల్పోయిన వింత ప్రాణిలా కనపడింది. నిరుత్సాహం వచ్చింది. వెంటనే తమాయించుకున్నాను. సునంద పొరపాటున ఒక తప్పు మాట అన్నంత మాత్రాన ఆమె విలువ వ్యక్తిత్వం ఏం తగ్గిపోతాయి...ఎవరి భావాలు వాళ్లవి...ఇలా రెండు నిమిషాలు నాకు నేనే సర్ది చెప్పుకుని మామూలు మనిషిని అయ్యాను. తిరిగి తలెత్తి సునందని చూసేసరికి ఆమె నవవికసిత పుష్పంలా ఎలక్ట్రిక్ గిటారు స్వరంలా

మత్తెక్కిస్తూ కనిపించింది. మనస్సులోనే దేవుడికి ధన్యవాదాలు చెప్పుకున్నాను. "శ్రీహరిలాంటి మేధావినీ, సునందలాంటి సుందరినీ సృజించిన ఓ భగవంతుడా, నువ్వు ఆనంద స్వరూపుడవు కాక మరేమవుతావు!" అని.

మరి కొంచెంసేపు మా తాతా శ్రీహరీ సరదాగా సామాజిక స్పృహ గురించీ, దేవుడి గురించీ చర్చించుకున్నారు. సునంద, ఫోటోలో ఉన్న వీరలక్ష్మిని పరిశీలనగా చూసి ఆమె వేసుకున్న నగలు, బట్టల గురించీ, రూపు రేఖల గురించీ కొన్ని వ్యాఖ్యలు చేసి నన్ను (ఆడవాళ్ల) మరో ప్రపంచంలోకి తీసుకుపోయింది; మాకు తెలిసిన కాలేజీ అమ్మాయిల గురించీ, సినిమాల గురించీ ఇష్టాగోష్టి జరిపాం.

తరువాత అందరం కలిసి మెస్‌లో భోంచేశాం. శ్రీహరి సునందని బస్సెక్కించడానికి వెళ్లాడు. మేం రూంకి వస్తుంటే మా తాత "పెళ్లికింకవ్యవధి అట్టే లేదురా. వైశాఖంలో ముహూర్తాలున్నాయి. పిల్లనెప్పుడు చూస్తావు?" అన్నాడు. "మీరంతా చూశారుగా. పెళ్లిచూపులెందుకు వేరే. కాని పెళ్లి మాత్రం నాకు ఉద్యోగం వచ్చాకే" అన్నాను.

మా తాత నవ్వుతూ "పెళ్లి అయింతర్వాత కలలు బాగుంటాయిరా. నిజాయితీగా ఉంటాయి. మీ బామ్మ నీ పెళ్లేనా తను చూస్తానో లేదోనని బెంగెట్టుకుంది. పెద్ద మనవడివి కదా, అందుకూ తొందర. సరే భీమారావుగారు రేపే చేసేస్తానంటూ ఎగురుతున్నాడు" అన్నాడు. నేను కాదన్లేదు.

మధ్యాహ్నం కొంతసేపు విశ్రమించాం. మా తాతకి మా చదువుల వరస నచ్చలేదు. మా స్ట్రైక్ ఇంకా నడుస్తోంది. పరీక్షలు దగ్గరకొస్తున్నాయనే దిగులు ఏ మాత్రమూ లేకుండా క్లాసుల్ని బహిష్కరిస్తున్నారు మావాళ్లు. మా తాత దీన్ని గురించి ఆలోచిస్తూనే ఉన్నాడు వచ్చినప్పట్నించీ. "అబ్బీ మీ స్ట్రైక్ ఎందుకురా?" అన్నాడు.

"ఎందుకేమిటి? ప్రజాస్వామిక హక్కుల కోసం"

"ప్రజాస్వామ్యమూ లేదు బండరాయీ లేదు. అంతా చదువు తప్పించుకోడానికి. ఒక్కొళ్లకీ పట్టెడు కండలేదు, గంటసేపు చదివే ఓపిక లేదు. నెల్లాళ్ల క్లాసుల కెళ్లేసరికి విసుగు, అలసట వచ్చేస్తాయి. విశ్రాంతి కావాలి. ఆ సంగతి తెలీక, నిద్ర ముంచుకొస్తున్న చంటిపిల్లలు రాత్రి ఐస్‌క్రీం కావాలని మారాం చేసినట్లు వీళ్లు అది కావాలి ఇది కావాలి అని వొంకపెట్టి క్లాసులు మానేస్తారు... ఈ చర్చంతా ఎందుకులే. ఎవరి ఖర్మ వాళ్లది. అదే నడిపిస్తుంది జీవులని" అన్నాడాయన.

ఆ సాయంత్రం మా తాతని రైలెక్కించాను. రైలు కదులుతుంటే నాకు ఏడుపు పొంగి వచ్చింది. ఏడుస్తూనే చేయి ఊపి వీడ్కోలు చెప్పాను.

రాత్రి నాకు చాలా కలలొచ్చాయి. వీరలక్ష్మి బావురుపిల్లి రూపాన్ని ధరించి వచ్చి నా మొహం అంతా రక్కేసి నాలుగు కాళ్లతోనూ గెంతుతూ లయబద్ధంగా "నీ మదినీ, నేనె కోరితినీ..." అంటూ పాట పాడింది. ఆమె నాలుగు కాళ్లకీ (అదే, చేతులకీ) ఉన్న నలభయి గాజులూ గలగలా తాళం వేశాయి పాటకి.

## 10

"నీ కోసం నీ కోసం ఈ సిగరెట్ వెలిగించా!
గాలిలోన తేలిపోవు
ఉంగరాల సొగసు నేను చూస్తుంటే
నీవు నన్ను చూడాలని..."

నన్నూ వీరలక్ష్మినీ శోభనం గదిలో విడిచిపెట్టి తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయారు అంత దాకా కిలకిలలతో, పాటలతో మంగళ హారతులతో మత్తువాసనలతో మమ్మల్నిద్దర్నీ ముంచెత్తేసిన ముత్తైదువలు. వాళ్ళకూడా వెళ్ళిపోయినట్లున్నారు, ఇన్నేళ్ళుగా నాతో ఉంటూ నాకు శృంగారం, ప్రణయ కళ నేర్పే శ్రీ హర్షుడూ, కాళిదాసూ, ముక్కు తిమ్మన్న మొదలైన కవులు కూడా. గది బయట మాటలూ నవ్వులూ పెళ్లి సందడీ నాకు వినిపిస్తున్నా విచిత్రమైన నిశ్శబ్దం నన్ను కమ్మేసింది.

...నిద్రలోంచి మగతగా లేచినవాడిలా తల ఎత్తి గది అంతటా చూశాను. గోడ మీద కరుచుకుని ఉన్న ఎర్ర తేలులా ఒక గోడని ముఖం ఆన్చి నిలుచుని ఉంది వీరలక్ష్మి-నా ధర్మపత్ని. ఎడం చేతి వేళ్లతో ముఖాన్ని కప్పుకొని ఉంది. వేళ్ల సందుల్లోంచి నన్ను చూస్తోందేమో. నా శరీరం ఆపాదమస్తకం సన్నగా వణకసాగింది.

ఏమై పోయాయి నా కలలూ కావ్యాలూ? ఎక్కడ దాక్కున్నాయి నేను నేర్చిన కళా రహస్యాలు? ఎక్కడకు పోయాయి నా దైవభక్తి, ఆత్మవిశ్వాసం?

నేను నా నూతన వధువుతో మాట్లాడాలని మా పెళ్లి కుదిరిననాటి నుంచీ పోగుచేసుకున్న మధుర వాక్యాలు గుర్తురావేం? ఆమె కళ్లలో కళ్లు కలిపి మూగ భాషలో నా హృదయాన్ని ఆమె కిచ్చి ఆమె హృదయాన్ని పొందాలనుకున్నానే; నా పిరికి హృదయాన్ని ఆమెకు ఇచ్చి ఏం లాభం ఇప్పుడు?

వెళ్లి నావేపు వీపు తిప్పి నిలుచున్న ఆమెను కావిలించుకుంటేనో?

నా మనసులోనే పొంచి ఉన్న కవులంతా "ఒద్దు ఒద్దు. అదీ బలాత్కారంగానే లెక్క మా దృష్టిలో. పెళ్లిలో చేయీ చేయీ కలిసినంత మాత్రాన నీకు ఆమె ఒడలితో ఆటలాడే హక్కు లేదు. ముందుగా మనస్సులు కలవాలి. తర్వాతే మిగతావి..." అని వెక్కిరించారు నన్ను.

నాకు మాట రావటంలేదు. వచ్చినా ఏ జలుబు చేసిన కాకి కూతలాగో వచ్చేలా ఉంది. అలా మాట్లాడి ఓ ఆడపిల్లని బెదరకొట్టడమా?

అకస్మాత్తుగా గుర్తొచ్చింది నాజేబులో ఉన్న సిగరెట్ పెట్టె. ఆశాజ్యోతి వెలిగింది నా మనస్సులో. నాకు సిగరెట్ అలవాటు లేదని చెప్పినా "ఫరవాలేదు ఉండనీ బావా. దర్జాగా ఉంటుంది" అని నా జేబులో దాన్ని పడేసిన నా చిన్న బావమరిది మీద ఎంతో ప్రేమ వచ్చేసింది నాకు. సిగరెట్ నోట్లో పెట్టుకుని అగ్గిపుల్ల గీసి అంటించాను. వెలగలేదు. మళ్లీ వెలిగించాను వెలగలేదు. మళ్లీ...

శంకర్ జైకిషన్ పాటల్లో ఎకార్డియన్లు 'కఁయ్యిఁ'మన్నట్లు నవ్వు వినిపించి ఉలికిపడ్డాను. వీరలక్ష్మి గోడ దగ్గిరుండే విరగబడి నవ్వుతోంది. ఎందుకొ అర్థంకాక నేనూ వెర్రి నవ్వొకటి

మొగాన పులుముకుని ఆమెవేపు చూశాను.

ఎలాగో నవ్వాపుకుని "అలా పెట్టకూడదు. ఫిల్టరున్నవైపు నోట్లో ఉండాలి. తిరగేసి పెట్టుకున్నారు. ఎలా వెలుగుతుంది." అని మళ్లీ "ఖ్ఖిక్ల్రీ హ్లీ హ్లీ" అని నవ్వింది వీరలక్ష్మి. పొరపాటు గుర్తించి నేనూ నవ్వేశాను.

నా నవ్వుతో కొంచెం ధైర్యం వచ్చింది కాబోలు, నాకు నాలుగడుగుల దూరానికి వచ్చి నిలబడింది ఆమె. నేనీసారి సిగరెట్ సరిగానే వెలిగించాను. అలవాటు లేకపోటాన దగ్గు వచ్చింది; అయినా వీరోచితంగా కాల్చి పొగ వదిలాను.

"దగ్గొస్తోంది. ఎందుకూ కాల్చడం? మీకు చెడు అలవాటులు ఏమీ లేవుటగా"

"ఒక్కటి తప్ప"

"ఏమిటి?"

"ఆడపిల్లలంటే భయం"

మళ్లీ నవ్వింది. ఆమెలో కొత్త ఠీవి వచ్చేసింది.

"ఎందుకు భయం?" కళ్ళు పెద్దది చేసింది.

"ఎందుకేమిటి! అది మగాళ్ల లక్షణం, అంతే"

"నిజమే!"

"అందుకే ఆ భయాన్ని మరిచిపోడానికే సిగరెట్లూ, తాగుడూ, యుద్ధాలూ అన్నీ చేస్తారు" నామీద నాకే కలిగిన జాలితో ఇంకాస్త గట్టిగా పొగపీల్చి ఉక్కిరి బిక్కిరయ్యాను. బాగా దగ్గరకు వచ్చేసింది నా భార్య. నావైపు కరుణ నిండిన కళ్లతో రెప్పవాల్చకుండా చూస్తున్న ఆ అమ్మాయి దేవతలా మెరిసిపోతోంది.

"నేను మంచిదాన్నే. నేనంటే ఎవ్వరూ భయపడరు"

"నిజమే?"

"ఒట్టు!.... సిగరెట్లు కాల్చకండి"

"మానేస్తా. కాని ఒక్క షరతు"

"చెప్పండి"

"నువ్వు నా ఒళ్లో కూర్చొని, ఈ సిగరెట్ తీసేసి అవతలకు విసిరేయాలి"

ఒక క్షణం తటపటాయించి వెంటనే ధైర్యం పుంజుకుని నా తొడమీద కూర్చుంది వీరలక్ష్మి, భయంగా అంటీ అంటనట్లు. సిగరెట్ అందుకోబోతే బాగా దూరంగా వంగి నా తల అటు తిప్పేశాను. పట్టుదలతో తన రెండు చేతులూ నా మెడకి చుట్టి తనవైపు లాక్కుంది వీరలక్ష్మి. నేను పులకరించిన నా శరీరాన్ని మామూలు స్థితికి తెచ్చి సిగరెట్ తీసి కిటికీలోంచి విసిరేశాను. నా ప్రేమ, ఔదార్యం తప్ప మే యితర రక్షణా లేకుండా నాతో ఈ గదిలో ఉన్న ఒక అమ్మాయిని నేనే మాత్రం బలవంతం లేకుండా నా చెంతకు తెచ్చుకో గలిగాననే గర్వంతో, దైవంపై భక్తితో ఒక క్షణం పరవశించిపోయాను.

"నాచేత సిగరెట్లు మాన్పించావోయ్ భారతనారీ" అని వీరలక్ష్మిని దగ్గరకు తీసుకున్నాను. అలా రెండునిమిషాలు ఉండిపోయాం.

తరువాత గది తలుపు తెరిచి డాబా మీదకు తీసుకెళ్లాను నా భార్యని. "నిద్దరొస్తోందా?"

లేదని తల ఆడించింది. ఇద్దరం అక్కడున్న కుర్చీల్లో కూర్చుని కబుర్లు మొదలు పెట్టాం. ఆ కుర్చీలోనే నిద్రపోయిన వీరలక్ష్మిని రెండు చేతుల్లోకి తీసుకుని గదిలో మంచం మీద పడుకోబెట్టేసరికి రాత్రి రెండున్నర అయింది.

ఆ తర్వాత రెండు రాత్రులూ నేర్పుగా, సున్నితంగా చాపక్రింద నీరులా మమ్మల్ని ఒకటిచేశాయి.

* * *

వీరలక్ష్మిని పుట్టింట్లోనే ఉంచి, మళ్లీ యూనివర్సిటీలో అడుగు పెడుతున్నప్పుడు నేనో హీరోలా ఫీలయ్యాను. ప్రాచీన కవుల నించి నేర్చుకున్న ప్రణయ సంప్రదాయాన్ని నా వైవాహిక జీవితంలోకి తెచ్చుకోగలిగినందుకు; పెళ్లాన్ని ప్రబంధ సుందరిగా మన్నించగలిగినందుకు; కలల్ని నిజం చేసుకున్నందుకు.

ఈల వేసుకుంటూ నాలుగంగల్లో మెట్లెక్కి వరండాలో స్పీడ్‌గా నడిచి నా రూంలోకి అడుగు పెట్టుంటే గుప్పున పొగ వదులుతూ శ్రీహరి ఒక మంచం మీదా, ఏదో చెప్తూ సునంద మరో మంచం మీదా కూర్చొని ఉన్నారు. నన్ను సాదరంగా ఆహ్వానించారు. నేను కుర్చీలో కూర్చుంటూ "మీరిద్దరూ తప్పక వస్తారనుకున్నాను. రాలేదేం?" అన్నాను. నా సూట్‌కేస్ తెరిచి మిఠాయిల పొట్లాం పైకి తీశాను.

"ఎలా వస్తామనుకున్నావు శోభనాద్రీ? ముక్కూ మొహం తెలియని పిల్లని నీ తాత చెప్పాడుదా అని చేసేసుకున్నావు. అందుకే నిరసన తెలియజేశాం"

నాకు నవ్వొచ్చింది. నేనూ వీరలక్ష్మీ గడిపిన మధుర క్షణాలు-రోజులు క్షణాల్లా గడిచాయి కనుక అవి క్షణాలే-మనస్సులో మళ్లీ మెదలడంతో శ్రీహరికి సిద్ధాంతమే ముఖ్యం; అనుభవం ఎలా ఉన్నాసరే. (జీవితాన్ని రెండు రెళ్లు నాలుగు అన్నంత ఖచ్చితంగా అర్థం చేసుకోడం కుదరదు. శ్రీ శ్రీ 1+1=1 అన్నందుకే ఆయన మహాకవి. జీవితం తర్కానికి అందదు). నేను ప్రేమించి పెళ్లి చేసుకోలేదని మాత్రమే చూస్తాడు తప్ప, శ్రీహరి, నా అనుభవం ఏమిటో అడగడు. నాకు అతని ధోరణి అలవాటేగా. నవ్వేశాను.

కాలేజీలకి వెళ్తున్నారుట అందరూ.

"అయితే స్ట్రైక్ విజయవంతమేనన్నమాట!" అన్నాను.

"విజయంలేదు గాడిద గుడ్డులేదు. అధికార మదంతో ఉన్నవాళ్లు నడుస్తున్న చరిత్రనీ రాబోయే పరిణామాల్ని ఎలా గుర్తిస్తారు? అంచేత ఎడకమిక్ సంవత్సరం పాడిగించే ప్రమాదం లేకుండా మేమే కాల్ ఆఫ్ చేశాం. ఆరు వారాల తర్వాతపరీక్షలు"

"కంగ్రాచులేషన్స్" అన్నాను. మళ్లీ క్లాసు మొదలయ్యాయని నాకెంతో సంతోషం వేసింది.

"నో, థాంక్స్" అంది సునంద.

"అదేం? పోనీ ఈ స్వీట్లుతినండి మీ కోపం, కారం తగ్గుతాయి" ఇద్దరూ ఒక్కొక్క

స్వీట్ మాత్రం తిన్నారు. స్వీట్ తింటూ కూడా సిగరెట్ కాలుస్తూనే ఉన్నాడు శ్రీహరి. అతని కాళ్ల ముందు డజను సిగరెట్ పీకలు, రెండు ఖాళీ పెట్టెలు ఉన్నాయి.

శ్రీహరి సిగరెట్ల వాడకం మరీ పెరిగిపోయింది. ఇన్ని సిగరెట్లు ఎవరి కోసం కాలుస్తున్నాడో? సమాజం కోసమా? సునంద కోసమా? సిద్ధాంతాల కోసమా? ఇక్కడ హేతువాదం లోపిస్తుంది ఇంత హేతువాదికి! "నువ్వు సిగరెట్లు కాల్చడం కంటే తప్పా మనుషులు దేవుణ్ణి నమ్మడం" అని నేను గేలిచేస్తే అతను పట్టించుకోడు. సునంద దగ్గరున్నప్పుడు అతని స్మోకింగ్ మరీ విజృంభిస్తుంది కనుక ఆమె మానిపించే ప్రశ్నే లేదు.

శ్రీహరి, సునంద ఎన్ని గంటలేనా మాట్లాడుకోగలరు. కాని ఎంత మాట్లాడినా ఒకరి గురించిఒకరు ఎప్పుడూ ఏమీ అడగరు. వాళ్ల అనుబంధం ఉమ్మడి శత్రువును ఎదురుకుంటున్న యోధుల మిత్రత్వంలాగే ఉంటుంది.వాళ్లిద్దరూ పెంటకోట నించి పెంటాగన్ వరకూ, మా ప్రొఫెసర్ల నించి మహా నాయకుల వరకూ ఏవేవో విషయాలను చర్చించి, విమర్శించి ఖండిస్తూ ఉంటే నేను పాతం పుస్తకాలు దుమ్ము దులిపి చదవసాగాను. ఒక పుస్తకం విప్పగానే అక్షరాల తెరల వెనుక వీరలక్ష్మి వెన్నెల నవ్వు వెలిగినట్టై "నీ కోసం నీ కోసం ఈ గ్రంథం నమిలేస్తా" అని చదువులో మునిగిపోయాను.

* * *

క్లాసులయిపోయాక సాయంత్రం సునందని బస్సెక్కించడానికి వెంట వెళ్లాం నేనూ శ్రీహరి. బస్ రావటం లేదు.

ఇంతలో గురునాథం కొంచెం బెదురుగా చూస్తూ మావేపు వచ్చాడు. గురునాథంమాకు డిగ్రీ రోజుల్నించీ ఫ్రెండే. ఫిలాసఫీ ఏమ్మే చదువుతున్నాడు. "ఏమిటోయ్ గురునాథ్" శ్రీహరి పలకరించాడు. గురునాథ్ మాట్లాడలేదు. ఇబ్బందిగా తల వంచుకుని నిలబడ్డాడు. శ్రీహరి రెట్టించాడు. "ఏమిటి కథ" గురునాథం ఓసారి సునందవేపు చూసి, "వెంటనే తల దించేసుకుని, "లేడీస్- తర్వాత చెప్తాను" అని గొణిగేడు.

సునంద బస్సెక్కాక చెప్పాడ గుర్నాథం. అతనికి బ్రోతల్స్‌కి వెళ్లే అలవాటు ఏర్పడింది యూనివర్సిటీకి వచ్చాక. ఆరోగ్యానికిమంచిది కాదని నేనంటే? "ఆ జాగ్రత్తలు మాకు తెలుసులేవోయ్. ఇంజెక్షన్లు వెళ్లే ముందొకటీ, తరవాత ఒకటీ. అంతే సేఫ్" అన్నాడు. మరోసారి శ్రీహరీ నేనూ మందలించినప్పుడు అతను గుర్రుగా చూస్తూ- "అందరూ మీలా మంచివాళ్లే అవ్వాలేమిటో?" అన్నాడు వినయంగా. నేను తెలియని వింతఅనుభూతితో కరిగిపోయాను. గుర్నాథానికి వ్యభిచారం తప్పు అని తెలుసు. కాని యవ్వనపు కోరికల్ని తట్టుకోలేక బజారులో వాటిని తీర్చుకుంటున్నాడు.

అందం ఏమిటంటే అతను తన బలహీనతని బలహీనతగా గుర్తించడం. మనసుని అదుపులో పెట్టుకోలేక తమతో చదువుకునే అమ్మాయిల వెనకాల అసభ్యంగా అల్లరి చేసే వాళ్లకంటే ఇతనెన్ని రెట్లో పవిత్రుడని నేను గ్రహించాను. మానసిక వ్యభిచారం మామూలు చీకటి తప్పుకంటే నూరు రెట్లు హీనం, విషమయం అని శాస్త్రాలు చెప్పిన సత్యం నాకు

బోధపడింది. అప్పట్నించీ నేను గుర్నాథాన్ని మామూలు స్నేహంతో బాటు గౌరవంగా చూడడం మొదలెట్టాను.

ఇప్పుడు గుర్నాథానికి ఒక వింత కష్టం వచ్చి పడింది. అతను మరో ఇద్దరు ఉత్సాహ వంతులయిన యువకులు ఒక పడుపుకత్తెను తెచ్చి హాస్టల్ గదిలో దాచారు. ముగ్గురూ సామరస్యంతో ఆమెను పంచుకుంటున్నారు. ఇలా ఒక వారం ఏ చిక్కూ లేకుండా నడిచింది.

కాని విద్యార్థుల్లో అసూయాపరులు కొందరు ఈ రోజు మధ్యాహ్నం హాస్టల్ అధి కారులకి ఈ విషయం చెప్పి, వాళ్లని గుర్నాథం రూంకితీసుకొచ్చి రహస్యాన్ని బయటపెట్టారు తలుపులు పగులకొట్టి. ఇప్పుడు గుర్నాథాన్ని హాస్టల్ ఖాళీ చేయమన్నారుట; పైగా కాలేజీ లోంచి వెళ్లగొడతామని చెప్పారుట.

గుర్నాథం అంతా చెప్పి "లోకంలో ఇంత దుర్మార్గం ఉందని నాకెప్పుడూ తెలీదు గురూ. ఇప్పుడే చూస్తున్నాను. ఒకడు సుఖంగా ఉంటే ఓర్చలేరు మన స్టూడెంట్లు" అని వాపోయాడు.

అతని బాధ అలా నలుగురి మధ్యా ఒక బజారు మనిషితో కలిసి దొరికిపోయినందుకు కాదు; ఆ అమ్మిని నెల మొత్తానికి కుదుర్చుకున్నారుట. ఇప్పుడు హాస్టల్ ఖాళీ చేస్తే ఆమె మళ్లీ తనూరెళ్లిపోతుందిట. డబ్బు నష్టం. అదీ సమస్య.

కథ ఈ వింత మలుపు తిరగ్గానే నాకూ శ్రీహరికీ నవ్వొచ్చింది. నవ్వేశాం. గుర్నాథం కూడా శృతి కలిపాడు మాతో. కాని వెంటనే సీరియస్‌గా మొహం పెట్టి "శ్రీహరీ నువ్వు కాలేజీకి లీడరువి. నన్ను గండం తప్పించి గట్టెక్కించే పూచీ నీది. ఆ పని చేస్తానను, ఎంత నవ్వినా నేను కాదనను" అన్నాడు.

శ్రీహరి హామీ ఇచ్చాడు. గుర్నాథాన్ని ఈ విషయంలో ఏ మాత్రం కంగారు పడవద్దని చెప్పి పంపేశాడు. నేను ఆందోళనగా శ్రీహరి చొక్కా పట్టుకుని లాగి "హరీ, ఇది చాలా అల్ప సమస్య. గుర్నాథం చేసింది మంచిపని కాదు. అతన్ని ఎలా సమర్థిస్తాం?" అన్నాను.

"ఎలా సమర్థిస్తాం? విద్యార్థుల్ని సమీకరించి! అధికారుల నియంతృత్వ ధోరణిని ఎదుర్కోక తప్పదు" అన్నాడు శ్రీహరి. అతని గొంతులోని తీవ్రత, కాఠిన్యం నన్ను కలవరపెట్టాయి. ఇక్కడ 'అధికారుల నియంతృత్వం' ఏమీ నాక్కనపడలేదు.

శ్రీహరి గుర్నాథం సమస్యని రకరకాల దృక్కోణాలలోంచి చూపించాడు నాకు. జీన్‌పాల్ సార్త్రే, ఫ్రాయిడ్, ఏండిలా బెల్, హెర్బర్ట్ డ్రాన్స్‌ఫీల్డ్, బెర్‌ట్రండ్ రస్సెల్...అందరి సిద్ధాంతాలూ వచ్చేశాయి గుర్నాథం పక్షానికి. శ్రీహరి వాదనలోని నైపుణ్యం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. అతని నాలుక మీద సరస్వతి శక్తి తాండవించింది. శ్రీహరిలో ఉన్న మాజిక్‌కి దాసోహమని ఊరుకున్నాను నేను.

విద్యార్థుల్ని శ్రీహరి సమీకరించడం చూడముచ్చటగా ఉంది. విద్యార్థులు గ్రూపులుగా ఉంటారు. గ్రూపులకి సహజ నాయకులుంటారు. వాళ్లలో కొందరికి నిజం చెప్పాడు ఇతను. మరి కొందరికి యూనివర్సిటీ వలస కాలపు విద్యా విధానాన్ని మార్చాలని చెప్పాడు.

రాత్రికి రాత్రి పోస్టర్లు తయారయ్యాయి. హాస్టల్ డాబా మీద ముప్పైమంది విద్యార్థులు ఇంక్‌తో, పెయింట్‌తో వాటిమీదా రకరకాల నినాదాలు రాశారు. నినాదాలు ఎన్ని రకాలైనా సారాంశం ఒకటే - యూనివర్సిటీ అధికారులు నియంతలు, విద్యార్థులకి శత్రువులు - అంతే.

తెల్లారేసరికి గోడల మీద పోస్టర్లు, రోడ్ల మీద విద్యార్థి ప్రవాహాలూ, గాలిలో ప్రతిధ్వనించే నినాదాలూ! క్రితం సమ్మె ముగిసి పన్నెండు రోజు అయింది, మళ్లీ సమ్మె! కొందరు విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం కొండెక్కిందని బెంగెట్టుకున్నారు. మురళీధర్ ఏడుపే మొదలెట్టాడు.

కాని మధ్యాహ్నానికల్లా అందరూ క్లాసులకి వెళ్లచ్చుననే వార్త వచ్చింది. శ్రీహరీ, ముఖ్య అనుచరులూ అధికారులతో మాట్లాడారు. గుర్నాథాన్ని ఇప్పుడున్న రూం నుంచి ఖాళీ చేయించారు. కాని దూరంగా ఉన్న మరో హాస్టల్‌లో రూం ఇచ్చారు. సమ్మె ఒక్క పూటలో విజయవంతమైంది. విద్యార్థులు శ్రీహరిని భుజాల మీదేసుకుని చేసిన ఊరేగింపు చాలా ఉత్తేజకరంగా నడిచింది.

* * *

శ్రీహరిలో నాయకత్వ లక్షణాలన్నీ ఉన్నాయి. ధైర్యం, చొరవ, భావ నైశిత్యం... అన్నీ. ఇతడు కాబోయే ఒక దేశనాయకుడని చాలామంది నమ్మారు. నేను సరేసరి.

* * *

మా పరీక్షలు సవ్యంగానే జరిగాయి. నేను, శ్రీహరి, సునంద ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాం.

అందరం ఇళ్లకి వెళ్లిపోయే రోజు వచ్చింది. నేను శ్రీహరిని అడిగేశాను. "నువ్వు సునందని ప్రేమించావా?" అని.

అతను నన్ను వింతగా చూసి "ప్రేమంటే?" అన్నాడు.

"ప్రేమంటే ప్రేమే" అన్నాను ధైర్యంగా. ప్రేమంటే ఫ్రాయిడ్ ఏమన్నాడో, ఇడిపస్ ప్రభువు ఏమన్నాడో ఎరువు తెచ్చుకుని చెప్పాల్సిన అవసరం లేదు నాకు. కాని శ్రీహరి మాత్రం ప్రేమ, సెక్స్, స్నేహం వగైరా విషయాల మీదున్న రకరకాల సిద్ధాంతాల్ని చక్కగా జతపర్చి నాకు వివరించసాగాడు. దూరంగా సునంద, వరలక్ష్మి, మరి కొంతరు అమ్మాయిలు ఇసకలో కూర్చుని వీడుకోళ్లు కాబోలు చెప్పుకుంటున్నారు.

నేను శ్రద్ధగా పావుగంట విని "వాళ్ల సిద్ధాంతాలు నీ ప్రేమ గురించి ఏం చెప్పగలవు? ఇంతకీ నీ భావాలు చెప్పలేదు నువ్వు" అన్నాను.

"ప్రేమ ఏమోగాని సమ్మర్లో నేనూ సునందా రిజిస్టర్డ్ మేరేజ్ చేసుకోవాలనుకుంటున్నాం. ఎక్కడో ఎప్పుడో ఇంకా తెలీదు. నీకు ఆహ్వానం వస్తుందిలే" అన్నాడు శ్రీహరి తల వంచుకుని. నేను హాయిగా ఊపిరి పీల్చుకున్నాను.

## 11

"మురికి బట్టల శయ్యపై శాశ్వతంగా కనులు మూసిన తదనంతరం.
మా అలసిన శరీరాలను కడిగించు ఒక కప్పు స్ట్రాంగ్ కాఫీతో"

కలకత్తా మహానగరంలో ఒక ప్రయివేట్ ఇంజనీరింగ్ సంస్థలో నాకు ఉద్యోగమైంది. పొదుపుగా గడుపుకుంటే ఒక పెళ్లంతో సుఖంగా బ్రతకడానికి చాలిన జీతం! మూడు నెలల తర్వాత ఇల్లు దొరికింది. వీరలక్ష్మిని తీసుకువెళ్లాను కాపురానికి.

శ్రీహరి సునందల పెళ్ళికి నాకు ఆహ్వానం రాలేదు. పెళ్లయిందని మాత్రం తెలిసింది. ఉత్తరం రాసి ఏవో అక్కడ దొరకని పుస్తకాలు కావాలని అతనడిగితే కొని పంపించాను. పెద్దలకంటే పిన్నల మనస్సులు బాగా వంగుతాయి కనుక వాళ్లతో గడిపేందుకు, వాళ్లని మార్చేందుకు వీలుగా ఒక కాలేజీలో లెక్చరర్‌గా చేరాడుట శ్రీహరి. అతనికి తగిన ఉద్యోగం అని సంతోషించాను.

కలకత్తాలో నేను ఇంటినుంచి ఉద్యోగానికీ, తిరిగి ఇంటికి రావడం రెండేసి గంటల ప్రయాణాలు బస్ స్టాపుల్లోనూ, చువ్వలు పట్టుకుని ఒంటి కాలిమీద నిలబడి బస్‌ల్లోనూ, ఎప్పుడూ సంతలా ఉండే వీధుల్లోనూ ఎక్కడ చూసినా కలకత్తా సంక్షోభం, సమ్మర్దం, సంఘర్షణల తాకిడితో అలసట చిందులూ ఉంటుంది. బస్‌లూ, ట్రాములూ, కార్ల మోతలూ, ఊరేగింపులూ ఆందోళనల పోరాటాలూ- ఎటు చూసినా భయం భయం బ్రతుకు భయం, అన్నా ఈ లోకం పన్నిన పద్మవ్యూహం అన్నట్లుంటుంది. ఈ విషవాయువుల విలయతాండవమే, వాసనలే, సత్యజిత్ రే, మృణాల్ సేన్, రుత్విక్ ఘటక్ ప్రభృతుల కళాఖండాల్లోనూ కనపడేది. వాళ్ళిచ్చే సందేశం ఇదే – జీవితం నిత్య సంకుల సమరమని, ఇంకిపోయిన కన్నీళ్ల సముద్రమని.

నాకు కలకత్తాలో శ్రీహరిలాంటి మహామేధావులు అయిదారుగురు తగిలారు; ఇంకెన్ని వేలమంది ఉన్నారో నాకు తెలీనివాళ్లు. ఇందరూ భావిస్వర్గానికి నిచ్చెనలు కట్టబోతున్నారు.

ప్రశాంత్ ఛటర్జీ నాకు సన్నిహితుడయ్యాడు. అతను మూర్తీభవించిన కలకత్తాలా నిద్రపోతున్నప్పుడు కూడా ముందుకు దూకబోతున్నవాడిలాగే కనిపిస్తాడు. ప్రపంచంలో అతనికి తెలిసినన్ని విషయాలు మరెవరికీ తెలియవని పిస్తుంది.

తరచు కలిసేవాళ్లం. శ్రీహరి దగ్గరలేని లోపం తీరింది నాకు. అతని విప్లవ భావాలు అగ్నిహోత్రం నించి పైకెగసే నిప్పురవ్వల్లా పవిత్రంగా, అద్భుతంగా, శక్తిమంతంగా ఉంటాయి. "ఇది కొన ఊపిరితో ఉన్న దోపిడీ వ్యవస్థ. ఒక్క తాపు తంతే పిండి పిండి అయ్యేటంత పుచ్చిపోయింది" అని అతను వదిలిన సిగరెట్ పొగ పైకి చూస్తూ అంటుంటే నేడోరేపో అన్నీ మారిపోతాయి అనిపించేది నాకు.

కలకత్తా వచ్చిన రెండు నెలల తర్వాత వీరలక్ష్మికి తలనొప్పి బాధ పట్టుకుంది. నేను సాయంత్రం అలసి సొలసి ఇంటికొచ్చేసరికి వడిలిన ముఖంతో, ఏడుపుతో ఉబ్బిన కళ్లతో స్వాగతమిస్తుంది నా గృహలక్ష్మి. అలా కొన్నాళ్లు జరిగేసరికి నాకు ఇల్లంటేనే భయం పట్టుకుంది. రోడ్ సైడ్ టీ దుకాణాల దగ్గర మిత్రులతో గడిపి ఆలస్యంగా ఇంట్లో కెళ్లడం మొదలు పెట్టాను.

జీవితం రంపంపొట్టు కూరిన బూరిలా ఉంది.

* * *

మా బామ్మ మూడు నెల్లు మంచం పట్టి చివరకు ప్రశాంతంగా తన భర్త చేతులలో పడుకుని ప్రాణం వదిలింది. కబురు తెలిసి నేనూ, వీరలక్ష్మి మా ఊరు వెళ్లాం.

మేం వెళ్లేసరికి నవ్వుతూ ఎదురొచ్చాడు మా తాత. నా భార్యని ఇంట్లోకి వెళ్లమని చెప్పి, నాతో "మీ బామ్మ నిన్ను చూడలేకపోయానని రెండు మూడు సార్లందోయ్. కాని అదంతా నాటకం. దానికి అప్పటికే ఈ జన్మమీద మమత పోయింది. మరో జన్మ, మరో ఇల్లు, మరో కుటుంబంలో పుట్టడం; మళ్లీ శైశవం, బాల్యం, యౌవనం... ఇలా మరో జీవితం. పునరపి జననం, పునరపి మరణం... ఈ జీవిత చక్రానికి అంతేమిటి" అన్నాడు.

మా తాత చెప్పంటే 'జీవితంలో సమస్యలేమిటి! అంతా భ్రమ. చావూ బ్రతుకూ కష్టం సుఖం ఇవన్నీ భ్రమ' అనిపించింది. కలకత్తాలో నేను ఇన్ని నెలలూ పోగుచేసుకున్న బెంగలూ, భయాలు క్షణంలో మాయమయ్యాయి. ఇంట్లోకెళ్లాం ఇద్దరం.

ఇంటినిండా చుట్టాలే. వాళ్లందర్నీ చూసేసరికి నాకు కడుపు నిండిపోయింది. అందరం యోగక్షేమాలని పంచుకుంటూ ఉండిపోయాం.

* * *

నేనూ, వీరలక్ష్మి కలకత్తా తిరిగి వెడుతూ గడిచిన పదిహేను రోజుల్నీ నెమరు వేసుకున్నాం. "జీవితం అందమైనదే. తీయనిదే" అనిపించింది. ఆమె వికసిత వదనాన్ని చూస్తుంటే. మేం మా ఇంట్లో, తోటల్లో చెట్ల కింద చేసుకున్న రెండో హనీమూన్ మత్తెక్కించే జ్ఞాపకాలను మిగిల్చింది.

అక్కడ మా పెద్దక్కయ్య కొడుకు రామం శ్రీహరి గురించి చెప్పిన మంచి మాటలూ బాగున్నాయి. శ్రీహరి చాలా గొప్పవాడని విద్యార్థులలో నమ్మకంట. అతను లెక్చరిస్తుంటే ఒక విజ్ఞాన సర్వస్వం వింటున్నట్లు ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంటుందన్నాడు నా మేనల్లుడు. విద్యార్థి దశలో శ్రీహరి ఎలా ఉండేవాడో నేను చెప్పాను.

మేం కలకత్తా చేరి ఇల్లంతా చక్కదిద్ది కుదుటపడేసరికి రెండు రోజులు పట్టింది. ఆ రెండు రోజులూ నేనూ నా భార్యా కూనిరాగాలు తీసుకుంటూ, మా ఊళ్లో పొందిన మధురానుభవాల్ని ముచ్చటిస్తూ గడిపేశాం.

మూడో నాడు ఉదయం నేను పళ్లు తోముకుంటుంటే ఆశుతోష్ ఏడుపు మొహంతో వచ్చి ప్రశాంత్ ఛటర్జీ చచ్చిపోయాడని చెప్పాడు. ఎవరో మెడ కోసి చంపాశారుట.

నేను కంగారుగా స్నానం ముగించి బట్టలేసుకుని టిఫిన్ తినకుండా ప్రశాంత్ ఇంటికి పరుగెత్తాను.

ప్రశాంత్ ఉండే గదిన్నర ఇల్లు చూడవచ్చిన వాళ్లతో కోలాహలంగా ఉంది. ఒక చిరుగు చాపమీద కుళ్లు దుప్పటి క్రింది ఉంది అతని శవం. అతని భార్య కాళీచరణదాసి అతని పాదాల చెంత కూలపడి సన్నగా ఏడుస్తోంది. ఆమె పాపిడిలోని సిందూరం రక్తప్రవాహంలా ఉంది.

"ఎవరు చంపారో తెలిసిందా?" మెల్లిగా అడిగాను నా ప్రక్కనున్న గజానన సన్యాల్‌ని. అతను విషాదంగా నవ్వి "ఇంకెవరు. మన సోదరులే" అన్నాడు.

ప్రశాంత్ ఒక రహస్య విప్లవ సంఘంలో నాయకుడట. సంఘంలో సైద్ధాంతిక పోరాటం జరుగుతోందిట మూడు నెలల్నుంచీ. ఫలితం ఈ హత్య.

## 12

"ఎవడు హితుడిట, సహృదుడెవ్వడు మనుజుడిట ఏకాకి తనలో
ప్రవత్సంతత తిమిర ఘుర రుత యుత స్వాంత గంభీర ఖనిలో
వెలుగు లెక్కడ సోనియా!"

ప్రశాంత్ ఛటర్జీని బూడిద చేశాక మధ్యాహ్నం ఇంటికొస్తున్న నాకు ఏం చేస్తున్నానో చూస్తున్నానో తెలీడం లేదు. మనం ఒకచోట నిద్రపోతుంటే ఎవరో నెమ్మదిగా మన మంచాన్ని మరో ఊళ్లో ఉంచేస్తే అక్కడ నిద్రలేవగానే ఎలా ఉంటుంది? అలా ఉన్నాయి నాకు తెలిసిన వీధులూ తెలిసిన ఇళ్లూ అన్నీ వింత రూపాలతో.

ప్రశాంత్ చచ్చిపోయాడంటే నమ్మలేకపోతున్నాను. అతని శవం మంటల్లో కాలి మసి కావడం చూసి కూడా. అతను అంత జీవంతో, చైతన్యంతో, భవిష్యత్తు మీద నమ్మకంతో ఉండేవాడు. అంతా ఒక చిన్న చాకు అతని మెడ మీద గీసిన గీతతో మాయమైపోతుందా. ప్రాణం లేని రూపాయిన్నర చాకుకి అనంతమైన జీవశక్తిని హరించేంత పొట్ట ఎక్కడుంది?

నాకు తెలియకుండానే ఏడుస్తూ రోడ్లన్నీ నడిచి ఇంటికి చేరాను. తలుపు తీసే ఉంది. వీధి గదిలో సోఫాలో పడుకుని నోరారా ఏడవసాగాను. వీరలక్ష్మి వచ్చి నన్ను ఊరడిస్తుంది.

ఆమె రాలేదు. ఎంతసేపటికీ రాలేదు. నీరసంగా సోఫాలోంచి లేచి లోపలి కెళ్లాను. మంచం మీద ముడుచుకు పడుకుని మూలుగుతోంది నా భార్య. మళ్లీ తలనొప్పి మొదలైంది.

నేను వీధి తలుపు మూసి వచ్చి ఆమె ప్రక్కనే పడుకున్నాను. ఒకరిని ఓదార్చే ఓపిక మరొకరికి లేదు. సాయంత్రం పాలమ్మి వచ్చి కేక వేసేదాకా మేం అలాగే ఉన్నాం.

నాకు కాఫీ ఇస్తూ "మనం ఇక్కడ ఉండద్దు. బాగులేదు" అంది వీరలక్ష్మి. ఏమిటన్నట్లు చూశాను.

"మొన్న మీ బామ్మగారు పోయినప్పుడు వచ్చారుకదా, ఓ బట్టతలాయన! మీ పెదనాన్న భార్య తరపు బంధువు. రాజమండ్రిలో మీకు తగిన ఉద్యోగం ఏదో ఉందన్నాడు. దానికి మామూలు కాయితం మీద అప్లికేషన్ రాసి పంపడమేట; పంపేయండి. నాకిక్కడేం బాగులేదు" గారంగా అంది చివరి మాట. నేను కాదనకుండా చేయడానికి నా తల నిమురుతూ మెడ మీద కితకితలు పెట్టింది.

"అలాగేనోయ్" అని ఆమె అరచేతిని ముద్దు పెట్టుకున్నాను. బెదురుగా నా వళ్లో చేరింది వీరలక్ష్మి. మేం కలకత్తా చేరాక ఇలాంటి సాన్నిహిత్యమే మాకు కరువైంది.

కాని నా హృదయం; ఇంకా ప్రశాంత్ ని తనలో కలుపుకున్న వల్లకాట్లోనే ఉంది. పదేపదే అతని మాటలూ, నడకా, భవిష్యత్తు గురించిన బంగారు కలలూ, ముద్దొచ్చే అతని విజ్ఞానవాదం... నా చుట్టూ అల్లరి చేస్తున్నాయి. వాటి తాకిడికి తల తిరిగిపోతోంది నాకు. నెమ్మదిగా నా భార్యను మరో కుర్చీలోకి పంపేశాను.

అవమానంతో, తుర్రుమని ఎగిరిపోయిన ఆశలతో ముఖం అరచేతుల్లో కప్పుకుని ఏడవసాగింది వీరలక్ష్మి. ఆమెను లాలించి ఊరడించే శక్తి లేక అలా చూస్తూ ఉండిపోయాను.

* * *

రైల్లో రద్దీలో చక్రాల కూతలో, రైలుపెట్టె కుదుపులో, చుట్టూ ఉన్న చుట్ట, సిగరెట్, చెమటల వాసనల్లో పన్నీటి జల్లులాంటి ఆశ! నేను రాజమండ్రీ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వస్తున్నానని శ్రీహరికి రాశాను; దారిలో దిగి తన ఇంటికి కూడా రమ్మని రాశాడు శ్రీహరి. తనకీ నన్ను చూడాలని ఉందిట. నేను సెలక్టయ్యాను. తిరుగు ప్రయాణంలో శ్రీహరిని కలవబోతున్నాను. ఆదివారం అతనింట్లోనే ఉంటాడు. యూనివర్సిటీ రోజుల్లో నేనూ శ్రీహరీ కలిసి ఎన్ని సిద్ధాంతాలు చర్చించాం! అవన్నీ నా చెవిలో పాత పాటల్లా మ్రోగి గతపు సువాసనల్ని గుర్తు చేస్తున్నాయ్. శ్రీహరి ఇల్లు సులువుగానే దొరికింది. నాకు తెలియకుండానే నా ముఖం నవ్వులతో మెలికలు తిరిగిపోతోంది. వెళ్లి తలుపు కొట్టాను.

"ఆయన లేరండీ" సునంద గొంతు వినిపించింది.

"నేను సునందా, తలుపు తియ్యండి" అన్నాను.

సునంద తలుపు తీసి "ఓ మీరా! రండి రండి. ఈ రోజు మీరు వస్తారని హరి చెప్పాడు కూడాను" అంది.

"హరి ఎక్కడికెళ్లాడు"

"సినిమాకి. మార్నింగ్ షో - ఏదో గొప్ప హాలీవుడ్ పిక్చర్‌ట. చూడక తప్పదనీ మిమ్మల్ని ఉండమనీ చెప్పి వెళ్లాడు"

సునంద జ్వరం తగిలిన దేవతలా ఉంది. అందం చలాకీతనం ఏమీ తగ్గినట్లు లేవు కాని వాటివెనుక ఏదో.... నాకు తెలీని ఏదో లోపం ఉన్నట్లనిపించింది.

ఇద్దరం కబుర్లలో పడ్డాం. నేను, శ్రీహరి, సునంద కాలేజీలోనూ, ఊరి వీధుల్లోనూ, సముద్రం ఒడ్డునా కొన్ని వందల గంటలు గడిపి ఉంటాం. వాళ్లిద్దరూ హీరో హీరోయిన్లలా ఉంటే నేను విదూషకుడిలా ఉండేవాణ్ణి.

"ఆ రోజులే బాగుండేవి" అంది సునంద. ఆమె గొంతులోని ఆవేదన జీరని పోల్చి ఉలిక్కిపడ్డాను. ఇప్పుడేమైంది ఆమెకి? హాయిగా ఏరికోరిన శ్రీహరిని పెళ్లాడింది. డబ్బు లోటూ లేదు.

మర్యాదగా ఉండదని ఆ ప్రశ్నల్ని అడగలేదు నేను.

శ్రీహరి మధ్యాహ్నం రెండైనా ఇంటికి రాలేదు. సునంద కళ్లలో దిగులు చిక్కనైంది. "ఇప్పుడప్పుడే రాడేమో. మీరు భోజనం చేస్తారా" అంది.

"ఏం ఎందుకు రాడు? నేను ఈ రోజు వస్తానని తెలుసుగా"

"తెలుసు. నాకు చెప్పాడు కూడాను. కాని ఏవేవో పనులు.. మీరు భోం చేసెయ్యండి. ఫర్వాలేదు"

నేను భోం చేస్తుంటే నా కంచానికి పక్కగా నాకు చాలా దగ్గరగా కూర్చుంది సునంద. "మీకు పామిస్ట్రీ వచ్చుటగా"

"ఓనమాలదాకా"

"అయితే నా చెయ్యి చూసి నేనెప్పుడు చచ్చిపోతానో చెప్పండి" అంది చేయి అందిస్తూ. ఒక్క క్షణం నోట్లో అన్నం ముక్కు-లోకి రాబోయి ఉక్కిరి బిక్కిరైపోయాను. ఆమె అరచేతిని నా చేతిలోకి తీసుకుని రేఖల్ని చూసినట్లు తీవ్రంగా కళ్లు చిట్లించి "మరొక్క అరవై ఏళ్లలో" అన్నాను.

"అమ్మబాబోయ్. అన్నేళ్లే! ఎందుకన్నేళ్లు బ్రతకడం" అంది సునంద.

"ఎందుకేమిటి? బ్రతకాలని దేవుడు రాసి పెట్టాడు కనుక" అన్నాను నవ్వు తెచ్చుకుని.

అవును ఎందుకు బ్రతకాలి? ప్రశాంత్ ఛటర్జీ జీవితం, మరణం చూశాక నాకీ ప్రశ్న మొదలైంది. భవిష్యత్తులో అంత నమ్మకం ఉన్న ప్రశాంత్‌కి ఏమి సాధించాడని భవిష్యత్తు లేకుండా పూర్తయిపోయింది జీవితం? నేను పావలా కోసం, ఉంపుడుకత్తెల కోసం, ఆస్తుల కోసం మనుషులు గొంతులు కోసుకోవడం విన్నాను. కాని వాళ్లంతా పశుప్రాయులైన మనుషులు. వాళ్లకి విజ్ఞానం, ఆదర్శాలు, సంఘదృష్టి ఏమీ లేవు. కాని ప్రశాంత్‌ని చంపినవాళ్లకి ఇవన్నీ ఉన్నాయి. వ్యక్తి ఆస్తి, వ్యక్తివాదం విషప్రాయం వాళ్లకి. కాని అభిప్రాయ భేదాల కారణంగా ప్రశాంత్‌ని చంపేశారు. భౌతికవాదికి అభిప్రాయాలు అంత ముఖ్యమా?

ప్రశాంత్‌కి కర్మసిద్ధాంతం, జన్మ పరంపరల్లో నమ్మకం లేదు; మనిషి చచ్చేక అంతా ఖతం; వీరమరణం నించి వీరస్వర్గం రాదు ఎందుకంటే స్వర్గం అనేదేలేదు; అలాగే పాపం పుణ్యం లేవు కనుక అతన్ని చంపిన వాళ్లకి నరకమూ రాదు. పోలీసులకి హత్య ఎవరు చేసిందీ ఎలాగూ తెలియదు. తెలిసినా సాక్ష్యాలు దొరకవు. అంచేత ఏ ప్రమాదమూ లేదు.

ఇదంతా గుర్తుకురాగానే నాకు నీరసం కమ్ముకొచ్చి ఇక ఒక్క ముద్ద కూడా తినలేక పోయాను. సునందకి బలవంతంగా తినిపించే ఛాన్సు ఇవ్వకుండా కంచంలో చెయ్యి కడిగేసుకున్నాను.

"అదేమిటీ అలా చేశారు"

"ఆకల్లేదు. శ్రీహరి ఏమంటున్నాడు?"

"బాగానే ఉన్నాడు. కాని ఆధునిక భావాల్ని అర్థం చేసుకునే బుర్ర ఉన్న వాళ్లు కాలేజీలో బొత్తిగా లేరు. అందరివీ ఇక్ష్వాకుల నాటి బూజు పట్టిన భావాలే. మీరు దగ్గరలేని లోటు బాగా ఫీలవుతున్నాడు హరి"

"అందుకే కాబోలు నేనొస్తున్నానని తెలిసి సినిమాకి వెళ్లిపోయాడు" అన్నాను నవ్వుతూ.

నాకు తువ్వాలు ఇచ్చి, లేచాక పక్క-పొడి ఇచ్చింది సునంద. నేను హాల్లో కుర్చీలో కూర్చున్నాక పక్కనున్న కుర్చీలో కూర్చొని మళ్లీ తన ఎడమ చెయ్యి చాపింది. నేను సిద్ధాంతిలా గంభీరంగా "చాలా అందమైన చేయి. సౌభాగ్య చిహ్నాలన్నీ ఉన్నాయి. ధనరేఖ, విద్యారేఖ చాలా స్ఫుటంగా ఉన్నాయి. బహు సంతానవతి ఈ జాతకురాలు..." అనా మొదలు పెట్టాను.

కోపంతో చేయి లాగేసుకుని ఎలాగో నవ్వుతూ "నేను ముప్పై ఏళ్ళు దాటి బ్రతకను. నాకు బాగా తెలుసు" అంది.

"కొండవాడు చెప్పాడా? ఈ మధ్య కొండవాళ్ళ మనుషుల జాతకాలు చెప్పడం మానేశారనీ దేశాల జాతకాలు చెప్తున్నారనీ విన్నాను. శ్రీకాకుళం కొండల్లో పెద్ద జ్యోతిషాలయం వెలిసిందిట" అన్నాను.

"విప్లవం అంటే ఎందుకంత ద్వేషం మీకు?"

"ద్వేషమా! అది నా భాషలోనే లేదు. ద్వేషం ప్రశాంత్ ఛటర్జీని హత్యచేసే బాపతు మనుషుల సొత్తు. వాళ్ల సిద్ధాంతం ప్రకారం స్వంత ఆస్తి ఉండకూడదు కాని సొంత ద్వేషం ఉండచ్చు"

"ప్రశాంత్ ఛటర్జీ ఎవరు?"

"మన శ్రీహరిలాగే మంచి గతంలో లేదనీ, భవిష్యత్తులోనే ఉన్నదనీ నమ్మినవాడు..." క్లుప్తంగా ప్రశాంత్ గొప్పతనం, అతని అకాల మరణం గురించి చెప్పాను.

అంతా మౌనంగా విని "హరి కూడా ప్రమాదాల్లో చిక్కుకున్నాడంటారా?" అంది సునంద.

"మీ భర్త గురించి నన్నడుగుతారేమిటి?"

"నాకు తెలిసినంత వరకు అతనికి రాజకీయాలేం లేవు"

"అయితే ఫర్వాలేదు"

గడియారం మూడు కొట్టింది. శ్రీహరి ఇంకా రాలేదని నాకు చాలా చిరాకేసింది. "మీరు భోంచేసేయండి సునందా. నేనీలోగా మా మేనల్లుణ్ణి చూసి వస్తాను. వాడు శ్రీహరి స్టూడెంటే" అని వీధిలోకి వెళ్లిపోయాను. రిక్షాలో రామంగదికి వెళ్లాను. ఉన్నాడు.

కుశల ప్రశ్నలు అయ్యాక వాడే మొదలెట్టాడు. "శ్రీహరి మేష్టారు చాలా గొప్పవాడు మావయ్యా. కాని ఆయన స్థాయి మాకు అర్థం కాదుగా. ఫస్టియర్ పరీక్షల్లో ఫిజిక్స్ అందరం పాడు చేశాం. వెళ్లిన తొంభై మందిలో ఏడుగురమే ఫిజిక్స్‌లో పాస్ అయ్యాం" అన్నాడు వాడు.

నాకు నా మేనల్లుణ్ణి చూస్తే జాలేసింది. స్టూడెంట్‌కి పాఠాలు అర్థం కాకుండా చెప్పేవాడు గొప్ప టీచరు! శ్రీహరికి ఉద్యోగం ఇచ్చినవాళ్లు అతను పిల్లలకి ఫిజిక్స్ అర్థమయ్యేలా చెప్పాలనే అనుకున్నారు; ఫిజిక్స్ తప్ప అన్నీ చెప్పి ఉంటాడు శ్రీహరి. అమెరికాలో కార్ల పరిశ్రమ చైనాలో కమ్యూన్‌లు, రష్యాలో ఫియట్ కార్లు, స్వీడిష్ ఫిలిం దర్శకులూ.... ఇవన్నీ చెప్పి వాళ్లని మురిపించి ఉంటాడు.

నేను వచ్చేసరికి ఇంట్లో లేకుండా పోయాడనే కోపంతో ఇలా తప్పులు పడుతున్నానేమో శ్రీహరిలో. ఈ అనుమానం వచ్చి రామాన్ని సూటిగా అడిగాను. శ్రీహరి క్లాసుల్లో ఏం చెప్పేవాడని. వాడు బాగా ఆలోచించి "చాలా అద్భుతమైన విషయాలు మావయ్యా. ఓ వారమంతా ఆటంబాంబు ఎలా తయారైందో చెప్పారు...." అంటుంటే.

"అది మీ సిలబస్‌లో ఉందా?" అన్నాను.

"లేదనుకో"

"ఇంకా ఏం చెప్పాడు?"

"అమెరికాలో సినిమాలు తీయడం గురించి చెప్పారు. కళ్లకు కట్టినట్లు, డిస్నీల్యాండ్ లో సెట్సు ఎంత పెద్దవో, ఊరు తగలబెట్టే దృశ్యం కోసం ఒక ఊరే ఎలా నిర్మించారో...." ఉత్సాహంగా చెప్పసాగాడు రామం.

నాకంతా అర్థమైంది. విద్యార్థులకి అవసరం లేనివి ఎన్నో చెప్పడంతో అవసరమైనవి నేర్పే వ్యవధి, ఓపిక లోపించాయి శ్రీహరిలో. రామాన్ని దారిలో పెట్టాలని "అవన్నీ తరవాత నేర్చుకోవచ్చురా. ఇంటర్మీడియట్ క్లాసులో కాదు వాటి గురించి వినాల్సింది. ఇకనుంచి నువ్వు శ్రీహరి ఏం పాఠం చెప్పినా రోజూ ఇంట్లో మాత్రం సిలబస్ ప్రకారం చదువుకో. అనుమానం వస్తే శ్రీహరిని వేరే అడిగి తెలుసుకో" అని బోధించాను.

నేను, రామం మళ్లీ శ్రీహరి ఇంటికి వెళ్లాం. అతనింకా ఇంటికి రాలేదు. బిక్క మొహంతో వీధి మెట్లమీద కూర్చుని ఉంది సునంద. నా గుండె చెరువైంది.

ఏమిటీ శ్రీహరి వరస ఇలా ఉంది?

నేను సునందని ఈ ప్రశ్నే అడిగి ఊరడించబోయాను. ఆమె "కంయ్" మన్నట్లు "వడ్డించిన విస్తరి మీ జీవితం. మీ కమ్మని కలల్తోనూ, తాతల నీతులతోనూ హాయిగా గడిపేయండి. మా దృష్టిది వర్తుల మార్గం. ఆద్యంతరహితం. భవిష్యత్తు కోసం పోరాటం సాగించే వాళ్లకు ఇలాటి ఒడిదుడుకులు తప్పవు" అని నాలుగూ దులిపేసింది. ఆ ధాటీని చూసి రామం తెల్లబోయాడు. నాకు సునంద దూకుడు అలవాటే కనుక వెంటనే నవ్వుతూ, "శ్రీహరి ఈసారెలాగో తప్పించుకున్నాడు. నాకు రాజమండ్రిలోనే జాబ్ దొరికిందిలెండి. వారం వారం మీ యింటికి వచ్చేస్తానింక..." అని వీడ్కోలు తీసుకున్నాను.

కాని లోపల్లోపల నాకు దుఃఖం పొంగి వస్తోంది. శ్రీహరి వింత ప్రవర్తన నాకేదో మానని గాయం చేసింది. తర్వాత మా తాతతో మాట్లాడుతూ ఈ విచిత్ర ఘట్టాన్ని వివరించాను. ఆయన క్షణం ఆలోచించి "నిన్ను చూడ్డానికి ఆ అబ్బాయికి మొహం చెల్లలేదురా. అనుకున్నవి ఒక్కటీ సాధించలేనివాళ్లు విచిత్రంగానే ఉంటారు. పైకి తెచ్చిపెట్టుకున్న గాంభీర్యం, మొరటుతనం; లోపల్లోపల భోరుమని ఏడుపు. దీన్ని గురించి మనసు పాడుచేసుకోకు" అన్నాడు.

ఆయన ఊరడింపుతో నాకు ధైర్యం వచ్చింది కాని శ్రీహరి చేసిన గాయం అలాగే ఉండి పోయింది.

## 13

"సత్యమందకే నీరస తథ్యాలను పిదుకుతారు
ఆత్మజయం దుర్లభమై కోరుతారు దిగ్విజయం"

మేం కలకత్తా విడిచిపెట్టి రాజమండ్రిలో కుదుటపడ్డాక ఓ పెద్ద తుఫాను నించి బయటపడినట్లైంది. కలకత్తాలో ఎందరో స్పెషలిస్టులు కుదర్చలేని వీరలక్ష్మి తలనొప్పి పదిరోజుల్లో ఏ మందులూ లేకపోయినా తగ్గిపోయింది.

మా దాంపత్య వనంలోకి మళ్లీ వసంతం వచ్చింది. కలకత్తా కల్లోలానికి తట్టు కోలేక పారిపోయిన మన్మథుడూ, గంధర్వులూ, చిలకలూ, పువ్వులూ మా ఇంటికి మళ్లీ వచ్చేశాయి.

సమస్యలు లేవనికాదు. ఉద్యోగంలో రకరకాల గొడవలుంటాయి. ఈర్ష్యలూ, స్పర్థలూ, అధికారం కోసం పోటీలు... అనేకం. వాటిని తగినంత పేరుకోనిచ్చి ఓ రెండ్రోజులు మా తాత దగ్గర గడిపేసరికి అవీ శాంతిస్తుండేవి; తలంటుకున్నట్లు!

ఉన్నట్టుండి ఓ రోజున గోదావరి గట్టున విహరిస్తున్న మాకు సునంద కనిపించింది ఓ సిమెంట్ బెంచీ మీద కూర్చుని. ముందుగా ఆమెను చూసిన వీరలక్ష్మి నన్ను సంతోషపెట్టడానికి మీ ఫ్రెండు వచ్చాడండీ అంది. నాకు చాలా మంది స్నేహితులున్నా 'మీ ఫ్రెండు' అంటే శ్రీహరే! ఆశ్చర్యంగా అటు చూశాను.

సునందవైపుకు గబగబా నడిచాం. శ్రీహరి కనపళ్లేదు.

సునంద మమ్మల్ని చూసి ఓ క్షణం సందేహించి నవ్వుతూ చేయి ఊపింది. మేమిద్దరం ఆమె ప్రక్కని చేరాం.

"హరి ఏడీ. ఎక్కడ దిగారు?" అన్నాను.

"నేనిక్కడే ఉంటున్నాను" అంది సునంద.

నెమ్మదిగా అంతా చెప్పింది. శ్రీహరి కాలేజీలో చాలా పెద్ద లెక్చరర్‌గా పేరు పొందాడుట. విద్యార్థులు గుట్టలు గుట్టలుగా అతని సబ్జెక్టులో ఫేలవడం; అతని భావాలను సహోద్యోగులెవరూ ఆమోదించకపోడంతో అందర్నీ తిట్టడం; హేళన చేయడం; రోజూ సునందతో పోట్లాడ్డం; అప్పుడప్పుడు కొట్టడం కూడా జరిగాయిట. అతని ఆదర్శాలను కొందరు త్రాగుబోతులు మాత్రం హర్షించారుట. వాళ్లతోనే అతను రాత్రీ పగలు సిద్ధాంత చర్చలు చేస్తున్నాడట.

"శ్రీహరి మనిషి కాదండీ. అతనో లైబ్రరీ. పుస్తకాల గుట్టతో కాపురం చేయడం మనుషులకి కష్టం. ఎన్నాళ్లో సహించాను. అతని ఆదర్శాలు, పరిజ్ఞానం చాలా గొప్పవి. అంతటివాడు మరొకడు లేడు. కాని నాకు అతనితో ఒక ఇంట్లో ఉంటమే దుర్భరమైపోయింది..." అంది సునంద. ఆవేదనే తప్ప, ద్వేషం తృణీకారం లేని ఆమె మాటల్ని వింటుంటే నా ప్రాణం జిల్లార్చుకుపోయింది. సునందలాంటి దేవతకు కూడా కష్టాలా! మానవ జన్మ అంతేనేమో. పురాణ నాయికలు సతీదేవి, సీత, సావిత్రి, అహల్య, దమయంతి, ద్రౌపది... ఎవరికి తప్పాయి కష్టాలు? మళ్లీ అందరూ దైవాంశ సంభూతులూ ఉత్తమ గుణ నిధులే.

ఇంతలో నాకు తెలిసున్న సుబ్రహ్మణ్యం ఒకడు దూరాన కనిపించి మావేపు వస్తుంటే నేనే అతనివైపు వెళ్లాను. ఆ జేబీ సుబ్రహ్మణ్యం జీతం లేని సమాచార వాహకుడు, పత్రికకు వ్రాయని పాత్రికేయుడు, సహజ పరోపకారి. నన్ను చూస్తూనే "గురువుగారూ, సునంద గారు మీకు తెలుసా? అయితే ఫర్వాలేదు. ఈ రోజుల్లో అందం కూడా ఆడవాళ్లకి శత్రువేనండి. మొగుణ్ణి వదిలి వచ్చిందని రకరకాల గెద్దలు ఆమెచుట్టూ తిరుగుతున్నారు. మీరూ, వీరలక్ష్మిగారూ తరచు ఆవిడని మీటవుతూ ఉండండి. కొంత పరువూ ప్రతిష్ఠా వస్తాయావిడకి..." అంటూ కొన్ని వివరాలు యిచ్చాడు.

"మీ పరువు కూడా కొంచెం కలపండి."

"నేను యింకా బ్రహ్మచారిని కదా. అనేక అపోహలు వస్తాయి. అయినా వీలైనంత హెల్ప్ చేస్తున్నాన్లెండి...."

చీకటి పడుతుంటే నలుగురం ఊళ్లోకి నడిచాం. సునంద మేమున్న పేటలోనే మరో చివర ఉంటోందిట. ఏదో ట్యుటోరియల్ కాలేజీలో ఉద్యోగం చేస్తోందిట. ఆమె కన్నవాళ్ల దగ్గర ఉంటానికి మనసొప్పకే ఆ పని చేస్తోంది కాని వాళ్ల డబ్బూ ఆదరణా దొరుకుతూనే ఉన్నాయి.

మేం రాత్రి ఇంటికి వచ్చి భోజనాలు ముగించాక నేనొక్కణ్ణీ చీకట్లో కూర్చుని ఆలోచించసాగాను. ఆరో నెల కడుపుతో ఉన్న వీరలక్ష్మికి ఈ మధ్య ఎంత నిద్రా చాలటం లేదు; హాయిగా నిద్రపోయింది.

నిద్రకు వెలినై నేనొంటరినై, చీకటి నిండిన నా గదిలో, గదిలో నిండిన చీకటిలో; ఆలోచిస్తుంటే బ్రతుకంతా చీకటిమయంగా తోచింది. బ్రతకడం ఎందుకు అని సునంద అడగడం గుర్తొచ్చింది; చావడం ఎందుకు అని ప్రశాంత్ ఛటర్జీ మరణం అడిగింది. చావుకీ పుట్టుకకీ కారణం తెలీనపుడు, మధ్యనున్న బ్రతుకుకి కారణం ప్రయోజనం కనిపిస్తాయా?

జీవిత తత్త్వం సత్యం శివం సుందరం, మానవుడు ఆనంద స్వరూపుడు అన్నారు ప్రాచీనులు. జీవితంలోనూ, కళలోనూ అంతే - శాశ్వతానందమే పరమావధి. జీవితం అంతా 'మధువు' అన్నాడు యాజ్ఞ్యవల్క్యుడు. 'అహం బ్రహ్మ' అంది వేదం, మళ్లీ మాట్లాడితే సర్వం ఖల్విదంబ్రహ్మ' అంది. బ్రహ్మ అంటే సృష్టి యావత్తూ కలిసి.

కలకత్తా జనంతో ఈ మాటలంటే చెప్పుచ్చుకు కొడతారు. మళ్లా కలకత్తా కూడా సచ్చిదానందంలో భాగమే!

అంతులేని ఈ అలజడితో నా బుర్ర తిరిగిపోయింది. వీరలక్ష్మి పక్కను చేరి నిద్ర పోదామంటే నిద్ర రాలేదు. నిద్రలోనే కిలకిలా నవ్వింది ఆ సీమంతిని. "ఎందుకోయ్ ఈ నవ్వులు" అన్నాను. "తంతున్నాడు" "ఎవరు?" "ఇంకెవరు? మీ సుపుత్రుడు" అని మళ్లీ నిద్ర పోయింది. ఆమె గర్భంలో క్షణక్షణం ఆమె రక్తం పీల్చుకుని పెరుగుతున్న శిశువు కన్న తల్లి అనే గౌరవం లేకుండా ఆమెనే తంతున్నాడని విని నేనూ నవ్వాను. వాడికి కన్నతల్లి ఎలా అవుతుంది వీరలక్ష్మి? ఇంకా కనలేదుగా, అదీ వాడి పొగరు.

దేవుడి బిడ్డలు అంతే. పుట్టకముందు తల్లిని తంతూ ఉంటారు. తల్లి ప్రకృతిని హింసిస్తుంటారు. తండ్రి మొహమే చూడరు. దేవుణ్ణి చూసేదాకా మనిషి పుట్టినట్లే కాదేమో! ఈ ప్రశ్నకి మా తాత ఏం చెప్తాడోనని ముచ్చటపడ్డాను.

వీరలక్ష్మిని పురిటికి తీసుకెళ్తామని రాశాడు మా మామగారు. ఈలోగా మేం కొన్నాళ్లు మా తాతగారింట్లో గడపాలని నా ఆకాంక్ష. ఉద్యోగానికి సెలవు పెట్టి వీరలక్ష్మిని టాక్సీలో జాగ్రత్తగా మా ఊరు తీసుకువెళ్లాను. నా పినతండ్రీ భార్యా వీరలక్ష్మిని గారం చేయడంలో మునిగిపోయారు. నేనూ, మా తాతా వేదాంత గోష్ఠిలో పడ్డాం.

నేనడిగిన ప్రతీ ప్రశ్నకి ఆయన దగ్గర జవాబులు వున్నాయి. పింగ్ పాంగ్ బాల్ ఠక్కున ఎగిరినట్లు ఆయన జవాబులు ఎగిరి వస్తున్నాయి. అదొక అద్భుత అనుభవం.

నాస్తికత్వం ప్రసక్తి తెచ్చాను. "తాతా అందరిలోనూ దేవుడున్నాడు కదా. దేవుడు లేడని కొందరెలా అనగలుగుతున్నారు?"

ఆయన నవ్వుతూ "అదంతా ఆయన లీలరా. అదో నాటకమన్నమాట. మా చిన్నప్పుడు పూడిపెద్ది జమీందారుగారు నాటకాలు వేసినట్లు. ఆయన రసజ్ఞుడు, పరమ శాంతమూర్తి. కాని నాటకాల్లో దుర్వాసుడు, విశ్వామిత్రుడు వేషాలే వేసేవాడు. మీ శ్రీహరి ఏదో కొత్త సత్యం కోసం అన్వేషిస్తున్నాడు. దేవుడి పెళ్లికి అందరూ పెద్దలే అన్నట్లుగా ఎవరు దేని కోసం వెదకుతున్నా దేవుడి కోసం వెదుకుతున్నారు. నిజానికి ప్రశ్న వేసేవాడూ, ప్రశ్నా, జవాబూ, జవాబిచ్చేవాడూ అన్నీ దేవుడే" అన్నాడు. నేను ఆ జవాబుతో వచ్చిన భక్తి పారవశ్యంతో విలవిలలాడిపోయాను. ఎప్పుడూ లేంది తొమ్మిదింటికే నిద్ర వచ్చేస్తుందని మా తాతా అనటంతో మా చర్చకు అంతరాయం కలిగింది. నాకింకా చాలా ప్రశ్నలు మిగిలిపోయాయి. ఏవేవో చదివి, నేనూ ఎలాగో నిద్రపోయాను. కాని నాలుగున్నరకే మెళుకువ వచ్చేసింది. ఎంచేతనో ఎందుకో తెలియని ఆందోళనతో మంచం దిగి కిటికీలోంచి చూస్తే భావి యివతల నేల మీద పడి ఉన్న మాతా కనిపించాడు.

నేను పెరట్లోకి పరుగెత్తాను. తాతా తాతా అని పిలిచాను. ఆయన పలకలేదు. నాకు భయం కలిగింది. పరిశీలనగా చూశాను. క్రింద పడటంతో ఆయన కట్టుకున్న తువ్వాలు ఊడిపోయింది. లేవడానికి అటూ ఇటూ జరగడంలో అది ఆయన వీపు అడుగున చేరింది. ఒళ్లంతా చెమటలు ప్రవహిస్తున్నాయి.

కంగారుతో ఇంట్లో అందర్నీ నిద్ర లేపాలని పది అడుగులు అటు పరుగెత్తి, మళ్లీ మా తాతవేపే వెళ్లాను. మళ్లీ పిలిచాను. కొంచెం కళ్లు తెరిచాడు. 'హమ్మయ్యా! బ్రతికే ఉన్నాడ'ని పొంగిపోయాను.

చరిత్ర గమనపు వేగానికి తట్టుకోలేక భూమి మీదకు తాత్కాలికంగా వాలిన సంప్రదాయ వృక్షంలా ఉన్నాడు మా తాత. యుగయుగాల మానవ అనుభవమే సంప్రదాయం. దాని మొదలు ఎవరికీ కనపడనట్టే ఆయన పాదాలు అరటి చెట్టు నీడలో ఉండిపోయాయి. ముత్యాల్లా మెరుస్తున్న స్వేద కణాలతో నిండిన ఆయన శరీరం బాణాలతో తూట్లుపడి అంపశయ్య మీద పరున్న భీష్ముడిని గుర్తుకు తెచ్చింది.

మా తాత శరీరాన్ని కప్పాలని ఆయన వీపు క్రింద లుంగ చుట్టుకున్న ఉన్న తువ్వాలు లాగబోయాను. ఆయన నన్ను వారించే సైగ చేస్తూ "నాకింక బట్టలెందుకురా ఒంటిమీద? రేపు వల్లకాట్లోనైనా తీసెయ్యాల్సిందేగా" అని, ఆయాసంతో మళ్లీ కళ్లు మూసుకున్నాడు. నాకు ఆ మాటల అర్థం మర్నాడు కాని తెలియలేదు. మరొక్క రోజు మాత్రమే బ్రతుకుతానని ఆయనకి ఎలా తెలిసిందో?

ఈ ఇంట్లో ఇంత పెందలకడనే లేచేవాళ్లం మేమిద్దరమే. మా బాబాయి కుటుంబానికి

ఆరున్నరకి కాని తెల్లవారదు. ఇక వీరలక్ష్మికి అసలూ వేళాపాళా లేదు ప్రస్తుత ప్రత్యేక హోదా వల్ల.

కాని నేననుకోని విధంగా నా భార్య నిద్రలేచి నన్ను వెతుక్కుంటూ పెరట్లోకి వచ్చింది. బావి ప్రక్కన తడి మన్నులో పడుకుని ఉన్న మాతాతని చూసి 'కెవ్వు'మంది. నేను భయం లేదని చెప్పి ఊరుకోపెట్టాను.

మరికొద్ది నిమిషాలయ్యాక ఊతం ఇమ్మని చేతులు చాపాడు మా తాత. నేను, నా భార్య ఆయనకి చెరో వైపునా చేరి నెమ్మదిగా కూర్చోపెట్టాం. ఆయన స్వేచ్ఛగా ఊరిపి తీసి "ఇంక నేనే నిలపడగలను" అన్నాడు. కాని సాధ్యం కాలేదు. తూలిపడుతుంటే నేనూ వీరలక్ష్మి ఆయనని పట్టుకుని నెమ్మదిగా ఇంట్లోకి నడిపించాం. హాల్లో ఉన్న ఆయన మంచం మీద పడుకోబెట్టాం.

వీరలక్ష్మి వంటింట్లోకి వెళ్లి తనకోసం పిన్నత్తగారుంచిన పాలతో కాఫీచేసి పట్టు కొచ్చింది. మా తాత కాఫీ తాగేసి పడుకున్నా నేను అక్కడే కూర్చున్నాను.

ఎలాగో తెల్లవారింది.

నేను స్నానాదులు ముగించి దైవప్రార్థన చేస్తూ మామూలుకంటే గట్టిగా దేవుణ్ణి వేడుకున్నాను. "ప్రభూ మా తాతని బ్రతికించు. నా కోసం బ్రతికించు. నా సందేహాలన్నీ తీరేదాక ఆయన్ని మాతోటే ఉండనీ"

తరువాత మా తాత చుట్టూ ఉన్న అందరితో బాటూ నేనూ అక్కడ చేరాను. ఆయన చూడ్డానికి బాగానే ఉన్నాడు కాని మాట రావటం లేదు. ఎవరేనా ప్రశ్నిస్తే జవాబుగా ఆయన కళ్లల్లో నీళ్లొస్తున్నాయి.

డాక్టర్లొచ్చి పరీక్ష చేసి 'హోప్' లేదన్నారు. అందరికీ టెలిగ్రాంలు ఇమ్మన్నారు. నేను బావురుమన్నాను. మిగతా వాళ్లకి మా తాత కేవలం రక్తసంబంధి; నాకు అదికాకుండా, గురువు కూడాను. నాకెలాంటి గడ్డు సందేహం వచ్చినా చిటికెలో పరిష్కరించేవాడాయన. ఆయన లేకపోతే నేనేమైపోవాలి?

వీరలక్ష్మి మంచాన్ని విడవటం లేదు. బద్ధకంగా ఉందంటూ పడుకునే ఉంటోంది. నాకు అనుమానం వచ్చింది పురుడు వస్తుందేమోనని. నెలల నిండకుండానా? భయంతో వణికిపోయాను. రాజమండ్రిలో లేడీ డాక్టర్ లెక్క ప్రకారం వీరలక్ష్మికి మరో రెండు నెలల్దాకా పురుడు రాదని.

ఎందుకేనా మంచిదని నా పుట్టుకతో సహా ఎందరి జన్మలకో మంత్ర సానిత్వం వహించిన చెంచమ్మని పిలుచుకొచ్చాను. ఆమె నన్ను చూసి ఉన్న నాలుగు పళ్లూ బయట పడేలా నవ్వుతూ సంగతి కనుక్కొని మరో పది నిమిషాల్లో వచ్చేసింది.

వీరలక్ష్మి ఉన్న గదిలోకి వెళ్ళి నేనక్కడే నిలుచుని ఉంటే "వెళ్లెళ్లవయ్యా పెద్ద మొనగాడిలా నిలబడ్డావు. బయటకు పో" అని తరమేసింది.

తరవాత చెంచమ్మ హాల్లోకి వచ్చి శుభవార్త ప్రకటించింది. వీరలక్ష్మికి నెలలు నిండాయని కొన్ని గంటల్లో నొప్పులు మొదలు కావచ్చని.

* * *

సాయంత్రానికి మా తాత కొంత కోలుకున్నాడు. అందర్నీ వెళ్లిపొమ్మని నన్ను దగ్గరకు పిలిచాడు. ఆయన మంచం దగ్గర మోకరిల్లి నా చెవి ఆయన తలకు దగ్గరగా పెట్టాను.

"గోపీ నేను వెళ్లొస్తాన్రా.. నాకు తెల్సిందల్లా నీకు నేర్పాను... కాని అది చాలదు... మంత్రం, గురువు లేందే పూర్ణజ్ఞానం రాదు..." అంటూ పది నిమిషాలు ఏవేవో చెప్పాడు మా తాత తర్వాత నిద్రపోయాడు.

నాకు మతిపోయినట్లైంది. ప్రాచీన ఋషుల బోధలన్నీ తెలిస్తే చాలు, అవే పరిపూర్ణపు బ్రతుకిస్తాయనుకునేవాణ్ణి ఇన్నాళ్లు. ఒక్కసారి నా నమ్మకమంతా చెదరకొట్టేశాడాయన.

## 14

"ఈ విషమ సమస్య నుంచి బయటపడే బాట చూపు
నా దుర్బల హృదయంలో సంశయాల రూపుమాపు"

వీరలక్ష్మి నాకు ఒక కొడుకుని ప్రసాదించింది. తాను భూమి మీదకు దిగి వచ్చినట్లు మా అబ్బాయి కేరు కేరుమని ఉద్ఘాటిస్తుంటే మా తాత సంగతే మరిచి పోయాను; తిరిగి ఆయన మంచం దగ్గరకు వచ్చేసరికి చుట్టూ ఉన్న అందరూ నిశ్శబ్దంగా ఏడవటం కనిపించింది. 'మహారాజులా వెళ్లిపోయాడు' అంటోంది ఓ ముసలమ్మ.

మా తాత మరణించాడని నమ్మలేకపోయాను. నేను పుట్టినప్పట్నుంచీ ఆయన్ను చూస్తున్నాను; శాశ్వతంగా ఉండిపోయేలా కనపడేవాడు. ఆయన మరణం ఏవో విచిత్రమైన అనుభూతులను రేపింది నాలో; నిరాశ, భయం...

ఎవరికీ చెప్పకుండా వీధిలోకి వెళ్ళిపోయాను. ఊరంతా తిరిగి తిరిగి పొలిమేరలు దాటి పోయాను. అక్కడ పచ్చిక బీడు ఒక దానిలో 'రామ సేవాశ్రమము' అని పెద్ద అక్షరాలతో రాసి ఉన్న ఓ డాబా ఇల్లు కనబడింది. నిద్రలో నడుస్తున్నట్లు నడిచి అందులో ప్రవేశించాను.

ఒక లావుపాటి కాషాయాంబరధారి హాల్లో ఒక ఎత్తు తక్కువ బల్లమీద సుఖాసీనుడై ఉన్నాడు. ఆయన గురించి నేనింత క్రితం విన్నాను కాని ఎప్పుడూ చూడలేదు, ఆలోచించలేదు. చార్మినార్ సిగరెట్ కాలుస్తూ శిష్యులతో ఏదో చెప్తూ నవ్వుకుంటున్నాడు రామయోగి. నమస్కరించి నిలబడ్డాను.

ఆయన నన్నో క్షణం ఆదరంగా చూసి "కూచో కుర్చీలు లేకపోయినా కూర్చోడం మాననట్లే, ఇష్టం వున్నా లేకపోయినా సమయం వచ్చాక తనువు చాలించక తప్పదు. హహహా" అని నవ్వాడు. నేను గతుక్కుమన్నాను. మా తాత మృతి సంగతి ఎలా తెలిసిందీయనకి?

కూర్చున్నాను.

రామయోగి ఉత్సాహంగా చప్పట్లు చరుస్తూ "రాముని సేవా భజనా..." అని పాట, మొదలెట్టాడు. భక్తులు వంత పాడారు. నేను కలవలేదు వాళ్లతో...

ఐదు నిమిషాలు భజన అయింది. ఉన్నట్లుండి పాట ఆపేసి "అత్త మీద కోపం దుత్తమీద చూపించినట్లు నీకు మీ తాత మీద కోపమేమిటోయ్ పరంధామయ్యా" అన్నాడు రామయోగి.

నేను కోపంగా "నా పేరు పరంధామయ్య కాదు" అన్నాను.

"మీ శ్రీహరి ఏ పేరు పెట్టి పిలిచినా పలికావు కదా, నేను పిలిస్తే తప్పొచ్చిందా జలాలుద్దీన్"

నేను ఆశ్చర్యంతో, ఆనందంతో గలగలా నవ్వేశాను. ఈయనకి దివ్య శక్తులున్నాయి కాబోలు.

"దివ్యశక్తి కాదు నా బొందా కాదు. టెలిపతీ, థాట్ రీడింగ్ అనీ.... చిన్న ట్రిక్కులు. రష్యాల్లో గొడ్డు మాంసమే తప్ప మరేమీ ముట్టని నాస్తికులకి కూడా ఈ మాత్రం శక్తులు అలవడుతున్నాయి. కొంచెం ప్రాక్టీసు చేస్తే నీకూ వస్తాయి... ఇదంతా చెత్త. అసలు కావల్సింది మనోజయం. మన మనస్సులో ఏముంది?"

"ఆలోచనలు"

"బాగా చెప్పావు. ఆలోచనలు ఎలా వస్తాయి?"

ఆలోచించాను; నా ఆలోచనలను గమనించాను. నాకా క్షణంలో నేను ఫోర్త్ ఫారం చదివే రోజుల్లో గోడమీద రాసిన 'శరభరాజు కోడిగుడ్లు తినును' అనే వాక్యం గుర్తొచ్చింది. ప్రస్తుత వ్యవహారానికి ఆ వాక్యానికి ఏమీ సంబంధం లేదు కదా! ఎందుకు గుర్తొచ్చింది? ఎలా వచ్చింది? నేను కావాలని తెచ్చుకోలేదుగా!

నేను జవాబు చెప్పేలోగా రామయోగి కల్పించుకుని "మన ఆలోచనలను కూడా మనం తయారు చేసుకోనక్కర్లేకుండా తానే పంపిస్తున్న ఆ పరమాత్మ ఎంత కరుణామయుడో తెలిసిందా?"

"చెడ్డ ఆలోచనల్నీ ఆయనే పంపుతారండీ?"

"పంపడూ మరి? మనం ఎలా ఉంటే అలాంటి ఆలోచనల్నే పంపిస్తాడు. దొంగతనం చేసి దొరికిన మనిషికి చుట్టూ చేరినవాళ్లు మంగళహారతి పళ్లెం పడతారా? ఊహూ. తిట్లు తిడతారు. ఓపికుంటే కొడతారు. అలాగే ఆలోచనలూను. అదే బుద్ధీ కర్మానుసారిణి అంటే"

నాకర్థం కాలేదు.

"నీకిలా అర్థం కాదులే. నీకో మంత్రం ఇస్తాను. అది రెండు పూటలా ధ్యానం చేస్తూండు. మంత్రం అంటే మంచి మాట. దాని ప్రభావంతో నీ శరీరంలో మంచి పెరుగుతుంది. మనసూ మంచిదవుతుంది"

"నేనిప్పుడు మైలలో ఉన్నానండి"

"అయితే మరీ మంచిది. మైల త్వరగా ఒదులుతుంది" అని నన్ను తన దగ్గర కూర్చోమన్నాడు. మిగతా వాళ్లంతా ఆయన చెప్పకుండానే లేచి వెళ్లిపోయారు.

రామయోగి నా గుండెల మీద అరచేత్తో రాస్తూ కళ్లు మూసుకున్నాడు. ఒక నిమిషం పోయాక అస్పష్టంగా ఏదో గొణుక్కుని తరువాత పైకి పలికాడు. "ఇదీ నీ మంత్రం. ఏదీ, పదిసార్లు అనుకో!"

మనసులో మంత్రాన్ని పలికాను. భక్తులు తిరిగి వచ్చేసి మా చుట్టూ చేరారు.

రామయోగి వాళ్లతో "ఈ పెంచలయ్యకి తాత వెళ్లిపోయాడని బెంగపట్టుకుంది. అందుకే వెంటనే మంత్రం ఇచ్చేశాను. లేకపోతే చస్తాడు" అన్నాడు.

మంత్రం అప్రయత్నంగా నా మనసులో ఆడుతోంది. రామయోగి డాన్సర్ లా చేతులాడిస్తూ "తధికిణతోం తధికిణతోం తధికిణ... మంత్రం అంటే దివ్యశక్తి. దాన్ని నువ్వు జపం చేయటం లేదు; అది నిన్ను స్పందింపచేస్తోంది. దాన్ని అదుపులో పెట్టాలని ప్రయత్నించావా- తల... ప్పగిలి... చ్చస్తావు. అంచేత హాయిగా మీ అబ్బాయి తల్లిపాలు తాగుతున్నంత నిమ్మాచీగా మంత్రాన్ని తాగాలి. అర్థం గురించి ఆలోచించకు. తల...ప్పగిలి...చ్చస్తావు... ఇంక పో. మళ్లీ నాక్కాన పడితే కాళ్లు విరగకొడతా. ఫోవేం?" అన్నాడు.

నేను అయోమయంగా ఫీలై వెంటనే లేచి ఆశ్రమంలోంచి వెళ్లిపోయాను బైటకు. పొలాలూ, చెట్లూ, ఎండా, పసుప్పచ్చ అద్దంలోంచి చూస్తున్నట్టు మెత్తగా, చల్లగా కనిపించాయి. తూలుతూ ఇంటివేపు నడిచాను.

నేను ఇంటికి చేరేసరికి మా తాత ఆఖరి ప్రయాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆయన చనిపోగానే అసలు ఏడవని నేను ఇప్పుడు పొంగి వస్తున్న దుఃఖ ప్రవాహంలో కొట్టుకు పోయి 'బావురు'మన్నాను. నన్ను ఓదార్చడానికి నా మనస్సులోంచి కెరటాలుగా గుర్తుకు రాసాగింది మంత్రం.

కొద్ది క్షణాల్లో దుఃఖం మాయమైంది. ఏదో భ్రమ తొలగినట్లైంది. మా తాత నాక్కాన పడకుండా ఎక్కడో చుట్టుపక్కలే తిరుగుతున్నట్లైంది. 'ఓహో అదా సంగతి!' అనుకుని నవ్వు కున్నాను.

ఎలాగో కబురు తెలిసి చూడ్డానికి వచ్చిన శ్రీహరి "ఈ అంత్యక్రియలు, కర్మకాండ అంతా మూఢనమ్మకాల పుట్ట" అని లెక్చరిస్తుంటే నేను అనుకోకుండా అతన్ని రెక్కపట్టుకుని దూరంగా లాక్కువెళ్లాను. నా చేష్ట నాలో వచ్చిన ఏదో అనూహ్యమైన మార్పుకి నిదర్శనంగా కనపడింది నాకు.

## 15

"నాక్కొంచెం నమ్మకమివ్వు
కొండలు పిండి కొట్టేస్తాను"

చిన వీరబసవయ్య పుట్టిన తర్వాత నేను వీరలక్ష్మితో కలిసి షికారుకెళ్లడం ఇదే ప్రథమం. ట్రాన్స్ఫర్లతో విసుగెత్తి ఉద్యోగం మానేసిన మా అమ్మ మనవడి బాధ్యత తీసుకోడం వల్లనే మాకీ అవకాశం లభించింది. ఎగురుకుంటూ రాజమండ్రీ వీధులవెంట తిరగసాగాం.

విశాఖపట్నం గాలిలో విప్లవ కవిత్వం ఉంటే రాజమండ్రీ గోదావరి ప్రవాహంలో కాలాతీతమైన సంస్కృతి ఉంది. అందుకే 'కాటన్' దొర మురిసిపోయి ఆ నదీమతల్లికి ఆనకట్ట వడ్డాణం సమర్పించుకుని అమరుడైనాడు. ఇక్కడి మనుషులు కోనసీమ కొబ్బరి నీళ్లలాంటి తెలుగు మాట్లాడతారు. ఇదే శిష్ట వ్యావహారికమన్నారు.

వీరలక్ష్మితో మాట్లాడుతూనే ఈ ఊరి ఇరుకు రోడ్లనిండా ఓర్పుగా నేర్పుగా నడుస్తున్న అందరి తెలుగూ వినేస్తూ పరవశిస్తున్నాన్నేను. ఇది కందుకూరీ, ముళ్లపూడీ మాట్లాడిన తెలుగు, ఆదికవి నన్నయ ఈ జనానికి నేర్పినది.

...మా వెనక నుంచి వేగంగా వచ్చి మమ్మల్ని దాటి ముందుకుపోతున్న శ్రీహరి కనిపించాడు. మమ్మల్ని అతను చూడకపోడం అసంభవం. కాని చూడనట్లు వెళ్లిపోతున్నాడు. నేను రెండడుగులు పరుగెత్తి 'హరీ' అని అరిచాను. అసంకల్ప ప్రతీకార చర్య జరిగి శ్రీహరి, టక్కున వెనక్కి తిరిగి చూసి, తప్పదనుకుని ఆగి, మమ్మల్ని చూస్తూ నవ్వాడు.

ఎండునక్కలా ఉన్నాడు శ్రీహరి. కాని ఎంత చిక్కినా అలసినా వదలని ఏదో ఠీవి, ఆకర్షణ అతనిలో ఉన్నాయి. బెంగాలీ న్యూవేవ్ సినిమా హీరోలా బక్కపల్చగా ఉన్నా ఏదో అణచలేని ఆవేశం, స్పందన ప్రదర్శిస్తుంది అతని రూపం. ఏదో తీవ్రత, భవిష్యత్తువైపు చూసే కళ్లు - మహాప్రస్థానం అట్టపై శ్రీ శ్రీ బొమ్మలా.

"ఇదేనా రావడం?" శ్రీహరిని అడిగాను సునందతో మళ్లీ కలిసిపోయాడేమో అని ఓ క్షణం ఆశ మెదిలింది నాలో. కాని అతని 'వాటం' చూస్తే అలా లేదు. నాకు జవాబుగా ఏదో అస్పష్టంగా గొణిగాడు.

"సరేకాని ఎక్కడ దిగావు?" నేరుగా అడిగేశాను. హోటల్ పేరు చెప్పాడు. నాకు విచారంతో నీరసం వచ్చింది. సునందపై కోపం ఉండి ఆమె ఇంటికి వెళ్లలేదు. మా ఇంటికి రాకూడదా పోనీ? కాఫీ తాగాలని వంకపెట్టి హోటల్లోకి నడిచి కుర్చీలో కూలపడ్డాను. నా ప్రక్కన వీరలక్ష్మి, ఎదురుగా శ్రీహరి కూర్చున్నారు..

కాఫీల ఖరీదు తనే చెల్లించి వెళ్లిపోబోయాడు శ్రీహరి. నేను ప్రాధేయ పడుతున్న గొంతు పెట్టి అతన్ని ఎలాగో బతిమాలి ఆపాను. వీరలక్ష్మికి అతనితో నేరుగా పరిచయం తక్కువే కాని నా మాటలద్వారా అతని గురించి అంతా తెలుసు. "నా ప్రాణానికి ప్రాణమైన శ్రీహరి" ఇంత వింతగా ప్రవర్తించడంతో ఆమె చికాకు పడుతోందని నేను వెంటనే గ్రహించాను. నవ్వు తెచ్చిపెట్టుకుని "బాబు పాల కోసం ఏడుస్తాడేమో. నువ్వింటికి వెళ్తావా" అన్నాను. వీరలక్ష్మి ఎంతో సంతోషంగా రిక్షా ఎక్కి వెళ్లిపోయింది.

"పదవోయ్ నా ప్రాణసఖా. ఎక్కడేనా కూర్చుని మాట్లాడుకుందాం" అని శ్రీహరి పార్కుకి తీసుకెళ్లాను. ఇద్దరం పచ్చిగడ్డిలో కూర్చున్నాం.

నాకు గురువు దొరికాడనీ, మంత్రం ఇచ్చాడనీ, మంత్రం అంటే మంచి మాట అనీ, మంత్ర ధ్యానం మూడునెలలు చేసి నేను చాలా ధైర్యం, శక్తి, ప్రేమ సంపాదించాననీ గబగబా నాలుగు మాటల్లో చెప్పేశాను.

శ్రీహరి నావైపు జాలిగాచూశాడు. "మీ తాత పోయాక వెంటనే కొత్త మత్తుమందు కొనుక్కున్నావు! అవున్లే, నీకిది చాలా అవసరం. నీ పెళ్లి ఒక ఘోరమైన ఫెయిల్యూర్. ఇండియాలో అన్ని పెళ్లిళ్లూ అంతేననుకో. ఒకరి గురించి ఒకరు తెలుసుకోకుండా పెళ్లాడతారు మనవాళ్లు. ప్రేమలేని పెళ్లి ఒక గుదిబండ..." అని నాకు ఓర్పుగా ఓదార్పుగా చెప్పసాగాడు.

నాకు ఆ మాటలు వింటుంటే శ్రీహరి మీద ఎంత కోపం వచ్చిందంటే అతను కాలుస్తున్న సిగరెట్ లాగేసి దూరంగా విసిరేయాలనిపించింది. కాని వెంటనే తమాయించు కున్నాను. ఓ హాస్య సన్నివేశం గుర్తొచ్చింది. మా హాస్టల్‌లో జ్యోతిషం తెలియని ఒక యువ జ్యోతిష్కుడు ఉండేవాడు. అతను నా జాతక చక్రం చూసి "నీకు పధ్నాలుగో ఏట పెళ్లయింది కదా" అన్నాడు. లేదన్నాను. "నీ తల్లి పురిట్లోనే చనిపోయింది" అన్నాడు. కాదన్నాను. "అయితే ఇది నీ జాతక చక్రం కాద"న్నాడు.

నేను నవ్వుతూ "ఇంకా నయం మీకు నా చెయ్యి చూపించాను కాను; అది నా చెయ్యి కాదని ఉండేవారు" అనేసి జాతక చక్రం తీసుకుని లేచి వెళ్లిపోయాను. ఎదట కనపడేది లేదం టారు సిద్ధాంతులు- వాళ్ల సిద్ధాంతం ప్రకారం అది అక్కడ ఉండే వీలులేకపోతే! వాళ్లకి సిద్ధాంతమే సర్వస్వం; అనుభవం ఎలా ఉన్నా ఫర్వాలేదు.

నేను వీరలక్ష్మిని ప్రేమించకుండా పెళ్లాడానని శ్రీహరి సిద్ధాంతం. "ప్రేమంటే ఇలాగే ఉండాలి, మరోలా ఉండటానికి వీల్లేదు" అని ఒక్కొక్క సిద్ధాంతం ఒకలా అంటుంది. కొన్ని సిద్ధాంతాలు ప్రేమ అంటే కేవలం శరీరం సంబంధి అంటాయి; మరికొన్ని ప్రేమ శరీరానికి అతీతమైనది అంటాయి. శ్రీహరి ఏ సిద్ధాంతం ప్రకారం అనుకున్నాడో కాని నాకూ నా భార్యకీ ఒకరంటే ఒకరికి ప్రేమ లేదని మాత్రమే నిశ్చయించాడు. ఈ ప్రశ్నకి నిజమైన జవాబు మా ఇద్దరికి మాత్రమే తెలుస్తుందనే కనీస జ్ఞానం కూడా లేకపోయింది శ్రీహరికి. బిగ్గరగా నవ్వేశాను.

నా నవ్వుకి ఉలిక్కిపడి వెర్రిగా చూస్తూ ఉండిపోయిన శ్రీహరిపై మొట్ట మొదటిసారిగా జాలి కలిగింది నాకు.

శ్రీహరి హఠాత్తుగా లేచి నిలబడి "వెళ్తానోయ్ హనుమంతూ. బజార్లో పనుంది" అన్నాడు. అతనితో చాలా మాట్లాడాలని ఉంది నాకు. ఎలా అతన్ని ఆపాలా అని, తీవ్రంగా ఆలోచించబోయి ఊరుకుని, నా గురువుని తల్చుకున్నాను. "శ్రీహరి అమెరికా వెళ్లాలను కుంటున్నాడు" అని రామయోగి అరిచినట్లైంది.

"నీ అమెరికా ప్రయాణం ఎప్పుడు?" అన్నాను. అమెరికా వెళ్లాలనీ తన ప్రతిభా విజ్ఞా నాలకి  తగిన గుర్తింపు అక్కడే వస్తుందనీ శ్రీహరి మా తాత పోయిన రోజుల్లో చెప్పాడు.

'అమెరికా' అతని మీద మంత్రంలా పనిచేసింది. వెంటనే కూర్చున్నాడు. ఏయే యూనివర్సిటీల్లో ఏయే స్పెషల్ కోర్సులు ఉన్నాయో, ఏయే ప్రొఫెసర్ ఎంతెంత గొప్పవాడో పావుగంట చెప్పేశాడు నాకు. పదిహేను కాలేజీల అప్లికేషన్లు వగైరాలు తెప్పించాడుట.

అంతలో సిగరెట్ పెట్టి ఖాళీ అయి, మరో పెట్టెకోసం తన సంచీలో కంగారు వెదికి దొరక్కపోడంతో దాన్ని బోర్లించాడు శ్రీహరి. సంచిలోనివన్నీ గడ్డిలో పడ్డాయి. సిగరెట్ పెట్టెలు మూడున్నాయి. ఒకటి ఆత్రంగా తెరిచి సిగరెట్ తీసి అతను వెలిగించుకుంటుంటే, క్రింద కుప్పగా పడి ఉన్న ఎయిర్ మెయిల్ కవర్లు నా కంట పడ్డాయి. అవన్నీ అతను నింపిన అప్లికేషన్లతో ఉబ్బివున్నాయి. సిగరెట్ వాసన వేస్తున్నాయి; కొన్ని కాఫీ మరకలతో, కుక్క చెవులతో దీనంగా, మురికిగా ఉన్నాయి.

శ్రీహరి అప్లికేషన్ ఫారాల కోసం ఉత్తరాలు రాయడం విచిత్రంగా జరిగింది. మేం యూనివర్సిటీలో చదివినప్పుడు మా ప్రక్క గదిలో ఉండే, అమ్మా నాన్నల కోసం బెంగెట్టుకుని ఏడుస్తూ ఉండే మురళీధర్ మూడేళ్లయి అమెరికాలో ఉంటున్నాడు. అతను నాకు ఉత్తరం రాశాడు, నన్నూ శ్రీహరినీ అమెరికా వచ్చేసి రీసెర్చి చేయమంటూ. నేనతని ఉత్తరాన్ని శ్రీహరికి పంపాను. అతను అప్లికేషన్‌ల కోసం రాశాడు. అన్నీ నింపాడు. పోస్ట్ చేయలేదు ఆరు నెలలు గడిచినా!

ఈ రహస్యం నాకు తెలిసిందని శ్రీహరి గమనించలేదు. సిగరెట్ మైకంలో ఉన్నాడు. నేనా ఉత్తరాల్ని అతని సంచీలో పెట్టబోయాను. అప్పుడు శ్రీహరికి స్పృహ కలిగింది. "అవీ...అప్లికేషన్లు. పోస్ట్ చేయడం కుదర్లేదు" అన్నాడు నంగిరిగా. శ్రీహరి గొంతులో దైన్యం, నిరాశ చూసి నేను చలించి పోయాను. బాధతో నా హృదయం మెలి తిరిగిపోయింది.

గద్గద స్వరంతో "హరీ. నా మాట విను. నువ్విలా ఉండిపోతే సునంద ఏమైపోతుందోనని నాకు భయంగా ఉంది" అన్నాను. అతను మాట్లాడలేదు. "చిన్నప్పటి నుంచీ నా హీరోవి నువ్వు. ఎన్నో గొప్ప ఘనకార్యాలు చేస్తావని చూస్తున్నాను. సునంద అంతే. లే. నాతో రా. మా గురువు దగ్గర మంత్రం తీసుకో. ఉత్సాహం, ఊపిరీ వస్తాయి" అని పొగిడాను. అతను మాట్లాడలేదు.

"హరీ: మా ఇంటికొచ్చెయ్. రేపు ఇద్దరం మా ఊరు వెళ్దాం. రామయోగి నీకు మంత్రం యిస్తారు..."

"...."

నేనూ మాట్లాడలేదు. పార్క్ పక్కనే ఉన్న ఒక మేడ ఇంటివైపు చూస్తూ కూర్చున్నాను. పెద్దవాళ్లు పిల్లలకి ఇల్లప్పచెప్పి ఎటో వెళ్లి ఉంటారు. పిల్లలు ఇల్లు పీకి పందిరేస్తున్నారు. రేడియో బిగ్గరగా పెట్టి క్షణక్షణం స్టేషన్లు మార్చేసి ఆ వచ్చే వింత ధ్వనులకి నవ్వుతున్నారు. శ్రీహరి బుర్రలోని సిద్ధాంతాల్లాగే కొన్ని డజన్ల రేడియో స్టేషన్లు ఆ ఒక్క రేడియోలోనూ పరస్పరం పోట్లాడుకుంటూ, కాట్లాడుకుంటూ, తోసుకుంటూ తమ పాటల్ని, మాటల్ని, కథల్ని ఒకేసారి పలకబోతుంటే ఏదీ పలకటంలేదు. "కోళ్ల పెంపకం బ్రోచేవారాలిండి రేడి నందామయా గురు విద్యార్థి లోకం సూక్ష్మజీవుల భజన నిను వినా బర బర్ బర్ర్ర్ కార్మిక మంత్రి మీ రాకే ప్రభు యేసు ప్రబువు నలందా తక్షశి చతురాసన వోయిస్ ఆఫ్ అమెరికా శ్రీలంకా..."

"హరీ రేడియో స్టేషన్ల కాట్లాట వింటున్నావా" అన్నాను సర్దాగా; అతన్ని నవ్వించాలని. చిన్నప్పుడు శ్రీహరి సిద్ధాంతాలు మాట్లాడని నిమిషాలలో జోక్స్ సేలుస్తూ ఉండేవాడు. అలాంటప్పుడు గొంతును మార్చి ఎవరెవర్నో మిమిక్రీ చేస్తుండేవాడు. ఆలిండియా రేడియో "వార్తలు", జలుబు చేసిన కారు హారన్, తెలుగు మేస్టార్లు ఇంగ్లీషు మాట్లాడ్డం అతని మిమిక్రీలో ప్రత్యేకాకర్షణలు. అవన్నీ గుర్తొచ్చయినా కొంచెం కులాసాగా మారతాడని ఆశించాను.

కాని నా పప్పు ఉడకలేదు. అతను అలాగే దిగులుగా, నీరసంగా చూస్తూ ఉండిపోయాడు.

ఖిన్నుడినై నేనూ పార్క్‌లోని చెట్లనీ, మనుష్యుల్నీ చూడసాగాను.

శ్రీహరి తన ముందు గుట్టగా పడి ఉన్న పోస్ట్ చెయ్యని ఉత్తరాల్ని తదేక దృష్టితో చూస్తూ అదే పనిగా సిగరెట్లు కాలుస్తుంటే నాకు మనసులో ఏదో తెలియని ఆందోళన, ఆవేదన, నిరుత్సాహం నిలువెత్తు దెయ్యాల్లా ఎదిగి గొడవ చేయసాగాయి. లోలోపలే ఏడుస్తూ నా గురువుని ప్రార్థించాను; వెంటనే మంత్రం వేయి వెలుగుల చిట్టి చేతులతో నా హృదయం లోకి పాకుతూ వచ్చింది. నా మంత్రానిదీ మా అబ్బాయి వయస్సే!

నేను ఇంకేవో లోకాల్లోకి వెళ్లిపోయాను. అలా ఎంతసేపు గడిచిందో తెలీదు కాని కళ్లు తెరిచేసరికి మేడలోని రేడియో బుద్ధిగా పాడుతోంది.

"నాక్కొంచెం నమ్మకమివ్వు!
కొండలు పిండి కొట్టేస్తాను
చితికిన టొమేటోలాంటి సూర్యుణ్ణి
ఆరిన అప్పడం లాంటి చంద్రుణ్ణి
ఆకాశపు ఎంగిలి పళ్లెంలోంచి నెట్టేస్తాను..."

నా ఒంటి నిండా విద్యుత్తులా ప్రవహిస్తోంది ఈ పాట. 'నా క్కొంచెం నమ్మకమివ్వు' అనగానే, మరుక్షణంలో, నమ్మకం వచ్చేస్తుంది మనిషికి. అందుకే వెంటనే 'కొండలు పిండి కొట్టేస్తాను' అనగలిగాడు.

"...నిస్పృహాయ మానవేయుని నొసటిరాలు
ఒక్క కలంపోటుతోడ కొట్టేస్తా
జీవిత సభా భవనం నుంచి
అన్యాయాన్ని దౌర్జన్యాన్ని మెడబట్టుక గెంటేస్తా
ఇంకెన్నో ఎన్నెన్నో చేస్తాను; కాని ఒక్కటి–
నాక్కొంచెంనమ్మకమివ్వు!"

అంతేగా మరి! నమ్మకానికి నమ్మకం తోడు కావాలి నడిచే కాళ్లకి నడవని కళ్లు తోడైనట్లు! నమ్మకానికీ, నమ్మకానికీ, నా నమ్మకానికీ నీ నమ్మకానికీ, నాయకుని నమ్మకానికీ అనుచరుల నమ్మకానికీ, భర్త నమ్మకానికీ భార్య నమ్మకానికీ, ఒకరి తోడు ఒకరికి కావాలి. ఇదే ప్రతి మనిషి అనుక్షణం, అందర్నించీ కోరేది: నాక్కొంచెం నమ్మకమివ్వు.

ప్రపంచాన్ని జయించిన మహానియంత విమానంలో వెడుతూ దాన్ని నడుపుతున్న పైలట్‌నే నమ్మాలి.కోట్లు సంపాదించిన సినిమాతార బ్యూటీ స్పెషలిస్ట్‌ని నమ్మినట్లే, బిచ్చ గాడు మనుషులందర్నీ నమ్మాలి. గుడిలో రాతి బొమ్మనే దేవుడని నమ్మాలి; నదిలో పడవనీ నమ్మాలి. చీకట్లో ఒంటరిగా నడుస్తూ దొంగల మంచితనాన్నీ నమ్మాలి, పరదేశానికి వెళ్లినప్పుడు ఆ దేశస్థుల ఔదార్యాన్ని నమ్మాలి. సమయాన్ని బట్టి పడుపుకత్తెల 'నిజమైన' ప్రేమనీ, రాజకీయవాదుల నిస్వార్థతనీ, స్వాములార్ల దివ్యశక్తినీ, సర్జన్ల తిరుగులేని నైపుణ్యాన్నీ నమ్మాలి, నమ్మాలి, నమ్మాలి!

తాను తొమ్మిది నెలలూ మోసి ప్రాణాలకు తెగించి కన్న తన బిడ్డ గురించి ఏమీ తెలియకపోయినా, దానిలో ఏదో మంచి ఉందని నమ్ముతుంది తల్లి. తన గురించి తనకే తెలియని మనిషి ఎదుటివాళ్లని నమ్ముతాడు; మనసిస్తాడు; త్యాగం చేస్తాడు; ప్రాణాలు కూడా ఇస్తాడు. అంతా నమ్మకం.

మనుషుల్లాగే నమ్మకాలూను. మనిషి మనిషి ద్వారానే పుట్టినట్లు, నమ్మకం నమ్మకం నుంచే పుడుతుంది. ఇద్దరు మనుషులు కలిస్తేగాని మరో మనిషి పుట్టనట్లు రెండు నమ్మకాలు కలిస్తే కాని ఫలితం ఉండదు.

అందుకే ప్రతి మనిషి మిగతా అందర్నీ "నాక్కొంచెం నమ్మకమివ్వు" అని అర్థిస్తున్నాడు.

ఈ మానవజాతి సమిష్టి ప్రార్థననే బంగారు కలాన్ని అమృతంలో ముంచి రచించాడు కవి:

"...నమ్మకం లేని హృదయం పుల్లలు లేని అగ్గిపెట్టె
నమ్మకం లేని బ్రతుకు కాలిన సిగరెట్టు బూది
అన్నీ ఉన్నప్పటికీ నమ్మకమొకటి లేని యెడల బ్రతుకు వమ్ము
నాక్కొంచెం నమ్మకమివ్వు! నమ్మకమివ్వు! నమ్మకమివ్వు...!

పాట పూర్తయింది. వింటున్నంతసేపూ కవి మాటలు లక్ష నక్షత్రాల పాటల్లా. కోటి జలపాతాల మ్రోతల్లా, శతకోటి సముద్ర తరంగాల ఘోషల్లా నన్ను మహాత్ముల కరుణలాంటి శీతలామృతధారల్లో ముంచేశాయి. పాట పూర్తయిన కొన్ని క్షణాలకి నేను తేరుకుని "అరే వర్షం ఏమీ కురవలేదే!" అనుకున్నాను. పొడిగా ఉన్న పరిసరాల్ని చూసి.

కాని తొలకరి వర్షంలో తడిసి వేసంకాలపు తాపాన్నంతనీ ఒక్కసారి కడిగేసుకున్న మల్లెపొదల్లా కనిపించారు నా చుట్టూ వున్న మనుషులు. చెట్లు మరింత పచ్చగా ఉన్నాయి; ఆకాశం మరింత నీలంగా ఉంది; పచ్చిక మరింత మెత్తగా ఉంది. ఏదో పవిత్రమైన మార్పు, జీవితం ఎంత గొప్పది, ఎంత మంచిది, సుందరమైనది అని పరవశించిన వేద ఋషుల యజ్ఞం లాంటిదేదో జరిగినట్లు.

లేచి నిలబడి బద్ధకంగా ఒళ్లు విరుచుకున్నాను. సిమెంటు బెంచీకి జార్లబడి కళ్లుమూసుకుని కూర్చుని శ్రీహరిని బుజంమీద మెల్లగా తట్టాను. అతను కళ్లు తెరవకుండానే నన్నూరుకోమని సైగ చేశాడు. మళ్లీ కూర్చుని అతని ఉత్తరాలనీ సిగరెట్ పెట్టెల్నీ సంచిలో భద్రపరిచాను. అవి తప్ప అతని సంచిలో ఇంకేమీ లేవని గ్రహించేసరికి నా హృదయంలో ములుకు దిగినట్లయింది. అతను మరో ఊరికి వెళ్లే పద్ధతి ఇది!

ఇందాకటి పాట రాసిన కవి ఎంత మాజిక్ చేశాడు! నా ఆలోచనా పద్ధతే మారిపోయినట్లుంది. శ్రీహరిని నా హీరో అంటూ అనుసరించడానికీ ఆరాధించడానికీ ప్రయత్నం చేశానే కాని ఇన్నాళ్లూ అతనికి నేనేం చేశాను అనే ప్రశ్న మొదటిసారి కలిగింది. ఎంత గొప్పవాళ్లైనా ఇతరుల సహాయానికి అతీతులు కారు; వాళ్లూ "నాక్కొంచెం నమ్మకమివ్వు" అని మూగగా అడుగుతూనే ఉంటారు. కాని మిగతా వాళ్లకి అలాగని తెలియదు.

కవి యిచ్చిన కొత్త కళ్లతో చూశాను శ్రీహరి జీవితాన్ని. చొరవ తీసుకుని అతనికి తోడుపడాలి. అతని నమ్మకాలకి నా నమ్మకం ఇవ్వాలి.

ఆలోచించాను. ఇన్నాళ్ళూ నేను ససవలా, కొయ్యలా, బానిసలా, నంగిరిగా, నజ్జుగా, నీరసంగా మాట్లాడానే కాని శ్రీహరితో ఎప్పుడూ సమాన స్థాయిలో మాట్లాడలేదు. ఆత్మగౌరవం లేని మనుషులు అది ఉన్నవాళ్లనుంచి దాన్ని పీల్చేస్తారు. అందుకే అలాంటివాళ్లు సలహా ఇచ్చినా శ్రీహరిలాంటి వాళ్లు వినరు. శ్రీహరికి పుట్టుకతో వచ్చిన అసాధారణ ప్రతిభ అందరి కళ్లనీ బైర్లు కమ్మేలా చేసింది. అంచేత ఎవరి సాయమూ పొందకుండా ఉండిపోయాడు శ్రీహరి.

అందుకే నడుం బిగించాను (మనస్సులోనే). 'జై రామయోగీ' అనుకున్నాను, మంత్రాన్ని తలుచుకున్నాను. 'నాక్కొంచెం నమ్మకమివ్వు' అని వాళ్లను అర్థించా; నాక్కొంచెం మీరిస్తే కదా నేను శ్రీహరికి కొంచెం ఇవ్వడం అని నచ్చచెప్పాను.

మరో పది నిమిషాల్లో కళ్లు తెరిచాడు శ్రీహరి, మెత్తగా నవ్వుకుంటూ. ఆ నవ్వు యెలా ఉంది? పుట్టిన పదో రోజునే మురిక్కాలవలో స్నానానికి దిగి ఉక్కిరిబిక్కిరై ఒళ్లంతా బురద ఉన్నా బ్రతుకుజీవుడా అని ఆనందిస్తూనే ఆయాసపడుతున్న కుక్కపిల్లలా ఉంది. జాలిపడుతూనే ముచ్చటపడతాం దాన్ని చూసి.

శ్రీహరి కళ్లు తెరుస్తూనే సిగరెట్ తీసి నోట్లో పెట్టుకుని అగ్గిపెట్టె కనపడక కంగారుగా వెదకి నా చేతిలో ఉందని గ్రహించి చేయి చాపాడు; "నాక్కొంచెం నమ్మకమివ్వు" అంటూ నవ్వాడు. ఖాళీ అగ్గిపెట్టె విసిరాను. పుల్లలు లేవని దాన్ని విసిరికొట్టి "ఓ అగ్గిపెట్టె కొని పట్రా వోయ్ వడివేలూ. అదుగో కిళ్లీ బడ్డీ" అన్నాడు.

"నువ్వు నడవలేవా?" అన్నాను.

"నడవబుద్ధి కావటం లేదు. పట్టుకరా, గుడ్‌బోయ్"

"ఒకళ్లని నడిపించడమే కాని నువ్వు నడవవన్నమాట. ఈ సిద్ధాంతాలు చెప్పేవాళ్లంతా అంతే" అని ఓ చురకవేసి గబగబా వెళ్లి అగ్గిపెట్టె కొని తెచ్చి ఇచ్చాను.

నా చివరి వాక్యం గట్టిగా తగిలినట్లుంది శ్రీహరికి. సిగరెట్ వెలిగించి ఆత్రంగా మూడు దమ్ములు తీసి "ఏమిటి నీ ఉద్దేశం? ఒక సేనాని తానే రైఫిల్ పట్టుకుని యుద్ధం చేయాలనా? అలా చేయడు. స్ట్రాటెజీ టాక్టిక్సు అన్నీ ప్లాన్ చేసి సిపాయిలకి ఆజ్ఞలు ఇస్తాడు" అన్నాడు సగం సీరియస్‌గా సగం జోక్‌గా.

"నీ ఆర్మీ ఏదీ జనరల్ ఛియాంగ్ కైషేక్? నాకెక్కడా కనపట్టంలేదు" అన్నాను. చుట్టూ చూసి "బహుశా ఈ చెట్లేమో నీ సైన్యం ...అదిసరేగాని నువ్వు వారానికి మూడుసార్లు సునంద కోసం ఈ ఊరు వస్తున్నావనీ, ఆమె ఇంటి చుట్టూ నూరేసిసార్లు ప్రదక్షిణం చేస్తున్నావనీ తెలిసింది. ఇదేం వ్యూహమో" అన్నాను ధైర్యంగా బొంకుతూ. అతను సునంద ఇంటివైపు వెళ్లాడో లేదో నాకు ఐడియా లేదసలు.

శ్రీహరి మాత్రం గతుక్కుమన్నాడు. "నీకెలా.. తెలిసింది... అంతా అబద్ధం... నేనేం సునంద కోసం రాలేదు"

"కాదు. నువ్వు సునంద కోసమే వస్తున్నావు. ఈ మాట నాకు సునందే చెప్పింది. నన్ను నమ్ము మిత్రమా. నాక్కొంచెం నమ్మకమివ్వు" అన్నాను.

"ఏడిశావ్‌లే గోపాలచందర్...పద సునంద ఎదటే తేల్చేద్దాం" అని సంచీతో సహా లేచాడు శ్రీహరి.

నా పథకం పనిచేస్తోందని ఉత్సాహంగా ఉరకలు వేసే మనస్సుని అదుపులో పెడుతూ శ్రీహరిని వెంటబెట్టుకుని సునంద ఇంటికి వెళ్లాను.

సునంద మమ్మల్ని చూసి వెంటనే తల తిప్పేసుకుంది. ఏమీ ఎరగనట్లు "శ్రీహరి వచ్చాడు సునందా" అన్నాను బిగ్గరగా. మమ్మల్ని ఇంట్లోకి రమ్మన్నట్లు సూచనగా వెనక్కి వెళ్లింది సునంద.

నాకు ఇదంతా ఎలా నడుస్తుందనే కుతూహలంతో టెన్షన్ పెరిగిపోతోంది.

శ్రీహరి, నేను కుర్చీల్లో కూర్చున్నాం. సునంద లోపలికి వెళ్లి మంచినీళ్లు తెచ్చింది. తరువాత మళ్లీ లోపలికి వెళ్లి కాఫీతెచ్చి ఇచ్చింది.

"సునందా కాలేజీలో లెక్చరర్ అయ్యాక నీ పలుకే బంగారమైనట్లుందే? ఊరికే ఒక్కమాట కూడా ఇవ్వటంలేదు"అన్నాను. శ్రీహరి తల వంచుకుని సిగరెట్ కాలుస్తు న్నాడు...అలా పది నిమిషాలు గడిచాయి. ఎవరూ మాట్లాడలేదు. శ్రీహరి నన్ను చేతిమీద తట్టి నెమ్మదిగా వీధిలోకి వెళ్లిపోయాడు. నేను నిరాశతో అతని వెంట వెళ్లిపోయాను.

## 16

"దేవా! క్షమించు మమ్మ, చేసినవి చేసినందుకు
చేయనివి చేయనందుకు
పిందెలు కోసినందుకు, పండినవి కోయనందుకు"

సునంద ఇంట్లోంచి వీధిలోకిపడ్డాక మేమిద్దరం కొంతసేపు ఏమీమాట్లాడకుండా నడిచాం. ఏంమాట్లాడతాం? ఏం చేయాలో తోచలేదు నాకు. శ్రీహరి ఏమంటే ఏమనుకుంటాడో. ఏమీ అనకపోతే ఊరుకున్నానని బాధపడతాడో.

పోనీ సునంద చొరవ తీసుకోకూడదా? అంత బింక మేం తనకి? రాజీ అనేది కావాలనుకుంటే ఎవరో ఒకరు ఆ ధోరణి కనపర్చరాదా? లేక ఇలా విడి విడిగా బాధసపడ్డమే బాగుందా?

శ్రీహరి అంతసేపూ ఎవరితోనో హోరాహోరీ పోట్లాడి చివరి హెచ్చరిక చేస్తున్నట్లుగా "లాభం లేదోయ్ సుబ్రతో ముఖర్జీ. అంతా అయిపోయింది. మిగిలింది హంసగీతి అలాపించడమే" అన్నాడు. తనలో తానే మాట్లాడుకుంటున్నట్లు.

నాకు దాంతో ఒక మార్గం దొరికింది. ఖండించడానికి వీలుగా మాట్లాడాడు అతను, అదే పదివేలు. ఈ భయంకరమైన శూన్యరూపమైన నిశ్శబ్దంకంటే ఏ కూతలు కూసినా నయమే. అంచేత లెక్చర్ మొదలెట్టాను "అదే నేనొప్పుకోను దేవదా! జీవితం రెండు మూడు పరా జయాల్లోనే ఖతం అయిపోయే ఏకాంకికకాదు. అది అనంతమైన నాటకం- శ్రీ శ్రీ చెప్పినట్లు" అన్నాను.

"శ్రీ శ్రీకేం ఎన్ని కబుర్లేనా చెబుతాడు. అతను ప్రపంచ అగ్రకవులలో అగ్రస్థానం సంపాదించుకున్నవాడు. నేనెవర్ని? ప్రేమించి పెళ్లాడిన సునందతో ఒక్కపాట అలా వుంచి మాట కూడా మాట్లాడలేక తోక ముడుచుకుని వచ్చిన వాణ్ణి"

నేను ఒక్క క్షణం కృంగిపోయాను. శ్రీహరి మాటలు ఎలా వున్నాయి? ఒక ప్రపంచ ప్రఖ్యాత నర్తకి కర్మకొద్దీ పక్షవాతానికి గురై, కోలుకున్నాక ఇద్దరు మనుషుల సాయంతో తప్పటడుగులు వేస్తున్నట్లు! అంతకంటే విషాదం ఎక్కడుంటుంది?

ఈ నిరాశతో ఇంకా కృంగిపోదునేమో కాని అంతలో జీసస్ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి "ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు, పరలోక రాజ్యమువారిది. దుఃఖపడు వారు ధన్యులు, వారు ఓదార్చబడుదురు..." మురళీధర్ ఏడుపు గుర్తొచ్చి నవ్వొచ్చింది. అతను సెలవులకి ఇంటికెళ్ళి, అయిపోయాక హాస్టల్‌కి తిరిగొచ్చిన మొదటి వారమంతా ఏడుస్తూనే ఉండేవాడు. ఆ ఏడుపులో అతని బెంగంతా పోయిందో ఏమో, డిగ్రీ వచ్చిన ఏడాది తర్వాత ఒక్కడూ (అమ్మా నాన్న వెంటరాకపోయినా) అమెరికా వెళ్లి కూర్చున్నాడు.

అమెరికన్ "సంస్కృతి"ని మనసంతా పట్టించుకున్న శ్రీహరి ఆ దేశం వెళ్లడం అలా ఉంచి, వెళ్లే ప్రయత్నమే చేయలేకపోయాడు; అప్లికేషన్ ఫారాలు నింపి, ఆర్నెల్లయినా వాటిని పోస్ట్ చేయలేదతను. ఇప్పుడు తనను ఒకప్పుడు దేవునిలా ఆరాధించిన సునంద అలకలో ఉంటే ఆ అలక తీర్చడం అలా ఉంచి ఒక్కమాట మాట్లాడలేక తిరిగి వచ్చేస్తున్నాడు. ఏమిటీ వింత? ఎక్కడుంది దీనికి పరిష్కారం?

"అలసట" వచ్చీరాని ముద్దుమాటల్తో నా చెవిలో చెప్పింది నా మంత్రం.

అవును, అలసటే. వివరం తెలిసినప్పట్నించీ అడ్డమైన పుస్తకాలూ చదివి చదివి మానవ జాతి మనుగడ గురించీ భవిష్యత్తు గురించీ తపించి తాను చేయదల్చినవాటికి అన్నీ విఘ్నాలే రావడంతో శ్రీహరి నరాల్లో పేరుకుపోయిన అలసటకు ఇప్పుడు బయటకు పోయే అవకాశం వచ్చింది. వేళకి తిండీ నిద్ర ఉండాలని మరిచిపోయి ఊరికే కష్టపడిపోతే జ్వరం వచ్చి బలవంతంగా విశ్రాంతి లభించినట్లు! పరాజయాలు మనిషికి ప్రకృతిమాత వరంగా యిచ్చే విశ్రాంతి గృహాలు. ఈ రహస్యం తెలీకనే మనం పరాజయం వస్తే కృంగిపోతాం.

ఈ రహస్యం నాకూ ఈ క్షణంలోనే నా మంత్రం ఇచ్చిన సూచనవల్ల తెలిసింది. ధన్యవాదాలు చెప్పుకున్నాను. "తల్లీ బాలవాక్కు బ్రహ్మవాక్కు అంటే యేమిటోననుకున్నాను. ఎంత గొప్ప సత్యాన్ని చెప్పావమ్మా నీ ముద్దు మాటల్తో" అని. నా అభినందనలను స్వీకరించి మాయమైంది నా మంత్రదేవత.

"హరీ, చీకటిపడుతోంది. మా యింటికి పోదాం. హాయిగా భోంచేద్దాం. వీరలక్ష్మి వంకాయకూర వండుతానని ప్రొద్దున్నే వాగ్దానం చేసింది. తినేసి కబుర్లు చెప్పుకుందాం" అని రిక్షా పిలిచాను. నిశ్శబ్దంగా రిక్షాలో కూర్చున్నాడు శ్రీహరి.

.... భోజనం చేస్తూనే కునికిపాట్లు పడుతున్న శ్రీహరిని చూస్తేనాకు జాలేసింది. రాత్రిళ్లు నిద్రపోతున్నాడో లేదో పాపం.

* * *

ఉదయం కాలకృత్యాలు పూర్తిచేసి కాఫీలు తాగుతున్నాం నేనూ, శ్రీహరీ.

"అర్ధరాత్రి మెళుకువ వచ్చేసిందోయ్. ఆలోచిస్తూ కూర్చున్నాను. నేను జీవితంలో పనికివచ్చేవన్నీ జాగ్రత్తగా ప్రక్కకు నెట్టేసి, అక్కర్లేనివన్నీ పులుముకున్నాము. ఆధునిక భావాలు, వైజ్ఞానిక దృక్పథం, శాస్త్రీయ సిద్ధాంతాలు అంటూ ఆకాశంలో విహరించి గాలిమేడలు కట్టాను. అంతా వేస్ట్. వేస్ట్. పంచదార డబ్బాలో రంపపు పొట్టు నింపాను పంచదార అనుకుని..." అన్నాడు శ్రీహరి. అతని మాటలు నాకు ములుకుల్లా తగిలాయి. మేఘాలమీద పరుగెడుతున్న జగన్నాథ రథచక్రాలను భూమార్గం పట్టించి భూకంపం పుట్టిస్తానని యవ్వనం మొదలైన నాటి నుంచీ నమ్మి నిర్విరామ కృషిచేశాడు శ్రీహరి.

అతను సామాన్యుడు కాదు. అతనికి డబ్బు ఉంది, రూపముంది, ఆరోగ్యం ఉంది, తెలివుంది. హాయిగా చదువు వచ్చింది. ఎక్కడ వుంటే అక్కడ పలుకుబడి వచ్చింది. వీటిని వాడుకుని తనని నమ్మిన క్లాస్‌మేట్స్‌నీ, ఇతర విద్యార్థుల్నీ విద్యార్థినుల్నీ ఎన్నిరకాలుగానో దోచుకునే ఛాన్సు ఉండేదతనికి. ఇక్కడో అమెరికాలోనో చాలా ఖుషీ జాబ్ తెచ్చుకునే ప్రజ్ఞా పాటవాలున్నాయతనికి. అన్నీ నెట్టేశాడు. తన కోసం కాదు మానవజాతికోసం అన్నట్లు బ్రతికాడు.

అలాంటివాడు శ్రీహరి.

ఇపుడు యిలా దీనంగా జీవితం ముగిసిపోయినట్లు మాట్లాడుతున్నాడు.

నా గుండెలో పొంగివస్తున్న కన్నీళ్లను అణుచుకుంటూ "అదేం మాట శ్రీహరీ..." అనబోతుంటే, నా సుపుత్రుడు, మా తాత పేరే ధరించినవాడు అయిన చిన వీరబసవయ్య తప్పటడుగులు వేస్తూ మమ్మల్ని సమీపించి తొందరగా నడవడంలో పడబోయి నా మోకాళ్లమీద చేతులు ఆని ఎలాగో నిలదొక్కుకున్నాడు. వాడి చేతులనున్న బురద, బూడిద, మసి వగైరాలు నా ప్యాంట్‌కి పులిమి, చేతులు శుభ్రంగానే ఉన్నాయని నాకు చూపించాడు. శుభ్రంగా వుండకేం చేస్తాయి వాటినున్న మసీ మట్టీ నా బట్టలకి పట్టేశాక!

నా ప్రశంస కోసం ఆత్రంగా చూస్తున్న మా అబ్బాయిని తీసి ఒళ్లో కూర్చోబెట్టుకున్నాను.

"ఒకరి బురద ఒకరికి అంటించుకోడమేనా మానవ జీవితం? ఏరా తాతా?" అన్నాను చిన వీరబసవయ్యని బుజ్జగిస్తూ. వాడు వచ్చీరాని పళ్లు కనపడేలా కిలకిలా నవ్వాడు.

శ్రీహరి కూడా నవ్వాడు. "నిజమే బ్రదర్. ఒకడుంటాడు. పనికిరాని ఆలోచన పోగుచేస్తాడు. మీ అబ్బాయి దుమ్ములో దొర్లి దాన్ని ఒంటికి పట్టించు కున్నట్లే. అలాగే నేను ప్రతీ ఆధునిక మేధావీ రాసిన పుస్తకాలన్నీ చదివాను. ఫలితం చూస్తున్నావుగా..."

"సార్త్రే చూడు. మార్క్సిజం తప్పని ఓ బుక్కు రాస్తాడు. కాని అదే అవసరం అని మరో బుక్కులో రాస్తాడు. రెండు పుస్తకాలూ అమ్ముడవుతాయి. ఇలా బాగా "అమ్ముడుపోయిన" రచయితలే నేటి యుగకర్తలు.

వాళ్లు చెప్పినవి చాలా గొప్పగా కనిపిస్తాయి. కాని ఆచరణలో ఎందుకూ కొరగావు.

వాళ్లల్లో గడుసువాళ్లు చచ్చేముందు తాము రాసిందంతా చెత్త అని పశ్చాత్తాపం ప్రకటిస్తూ పుస్తకం రాసి దానినుంచి కూడా డబ్బులు సంపాదిస్తారు.

"నాలాంటి వెర్రి వెంగళప్పలు వాళ్లు చెప్పిందే వేదం అని నమ్ముతూ వుంటారు. గొర్రె కసాయివాణ్ణి నమ్మినట్లు"

అటునించి ఇటు విసిరేసింది శ్రీహరిని అతని క్రొత్త అనుభవం. నిజానికి ఎవర్నీ తిట్ట కూడదు. ఆధునిక సిద్ధాంతులనైనాసరే. వాళ్ల కర్మకొద్దీ వాళ్లు రాస్తారు. కాని అందర్నీ మోస గించలేకపోతున్నారుగా. అంచేత మన కర్మవల్లనే మనం మోసపోయాం అని గుర్తించాలి. ఎవరి కర్మకెవరు కర్తలు?

నేను ఇదే అతనికి చెప్తే "నోర్ముయ్‌రా. నీ ముసిలి కబుర్లూ నువ్వూను. కర్మట కర్మ..." అని కసిరాడు శ్రీహరి. అతని తీవ్రత అర్థంకాక మా అబ్బాయి కంగారుగా నా కళ్లలోకి చూశాడు. వాణ్ణి ముద్దు పెట్టుకున్నాడు. శ్రీహరిలో వస్తున్న మార్పు నాకెంతో సంతోషంగా వుంది.

కాని శ్రీహరి అలా భావించలేదు. మళ్లీ రానిది యవ్వనం. అదంతా తను వ్యర్థమైన సిద్ధాంతాల కోసం వెచ్చించాడు. బ్రతుకు 'కరువై' పోయింది అని విచారించసాగాడు.

## 17

"దేని వలన జనులందరు తరతరాల సుఖిస్తారు.
మన మహోచ్చ నిర్ణయాన్ని సంప్రీతిని స్మరిస్తారు?"

శ్రీహరి వీలున్నప్పుడల్లా రాజమండ్రి వచ్చేసి మా యింట్లో ఒకటి రెండు రోజు లుండి వెళ్లడం మొదలుపెట్టాడు. ఓసారి నవ్వుతూ "నీ యింటికి వెళ్లకుండా యిక్కడేడు స్తావేం పరంధామయ్యా" అన్నాను. సునందతో రాజీ ప్రయత్నం చేయమని సూచిస్తూ.

అతను గంభీరంగా కొన్ని క్షణాలు ఆలోచించి "నాకాయోగ్యత లేదోయ్ బాబీ రోజర్స్. నేను మహాపాపిని. నాకు సునంద పొరపాటున భార్య అయింది కాని..." అన్నాడు. అని మఠం వేసుకుని కూర్చుని 'ధ్యానం'లో మునిగిపోయాడు.

శ్రీహరి కొన్ని వారాలుగా తన సొంత ధ్యానం ఒకటి చేస్తున్నాడు. దాని లక్ష్యం తానింత వరకూ చదివినవన్నీ మరిచి పోవడం. పద్ధతి ఏమిటంటే కళ్లు మూసుకుని మనసులోకి ఏ ఆలోచన వచ్చినా దాన్ని నిరాకరించడం. ఎంత గొప్ప సిద్ధాంతం మనస్సులో మెదిలినా 'చెత్త' అని దాన్ని తరిమేయడం! "రామయోగి దగ్గర మంత్రమే తీసుకోవచ్చుకదా ఈ బాధకి బదులు" అని నేనంటే "మళ్లీ ఆ కొత్త బరువు దేనికి నా బుర్ర మీదకి? నా ఆలోచన నాది. నాది కానిదంతా తోసేస్తే సరి, చివరకి నాదే మిగులుతుంది" అన్నాడు.

పార్కులో సిమెంట్ బెంచీమీద కూర్చుని శ్రీహరి ధ్యానం చేస్తుంటే నేను, వీరలక్ష్మి, మా అబ్బాయి అటూ ఇటూ నడుస్తున్నాం. మా అబ్బాయికి ఓ ఫ్రెండు దొరికాడు. వాడొక బిచ్చకత్తె కొడుకు. కొంచెం కొంచెం నడక వస్తున్నవాడు. వాణ్ణి చూసి వాడి వచ్చీరాని నడక చూసి ముచ్చట పడుతూ వాడివేపు వెళ్లాడు చిన వీరబసవయ్య. ఇద్దరికీ మాటలు రావేమో చేతలతోనే పరిచయం చేసుకున్నారు. మా వాడు వాడికి చేయి అందించబోయి పొట్టలో

పొడిచాడు. వాడూ ప్రతిగా వీణ్ణి రక్కాడు. తరవాత ఇద్దరూ గడ్డిలో కూర్చుని చీమల్ని చంపసాగారు.

నేనూ వీరలక్ష్మి కబుర్లలో పడ్డాం. సునంద మా యింటికి వస్తూనే వుంది. మేమూ వెళ్తుంటాం. ఆమె కాపురం గురించి మాత్రం చర్చించే వీలు కలుగలేదు. అసలు వాళ్లెందుకిలా విడిపోయారో ఎనలైజ్ చేయబోయింది నా భార్య. నేను వారించాను. "సైకో ఎనాలిసిస్‌ని మించిన పాపం లేదు. మన మనస్సులే మనకి తెలీవు.. నా మనస్సు నీకు తెలుసా" అన్నాను ఆమె కళ్లలోకి చూస్తూ.

"ఎందుకలా చూస్తావు?" అని కళ్లు వాల్చేసింది.

"నా మనస్సు గురించి నీకు తెలిసింది చెప్పు"

"ఉహుఁ"

"ప్లీజ్" బ్రతిమాలాను.

"అంతా కలిపి తెలుసు. విడివిడిగా తెలీదు"

"అంతా కలిపి ఏమిటి?"

ఒక నిమిషం తీవ్రంగా ఆలోచించింది వీరలక్ష్మి. చిట్లించిన ఆమె కనుబొమలు రెండు ప్రశ్నార్థకాలలా వున్నాయి.

"ఏం చెప్పనేమిటి యిక్కడ యిందరిమధ్య?" అని మూతి బిగించింది.

"ఏమీ లేదా?"

"చెప్పానుగా. అంతా కలిపి తెలుసు నీ మనస్సు"

"పోనీ అదే చెప్పచ్చుగా"

"ఇంటికెళ్లాక, భోజనాలయ్యాక, అందరూ పడుకున్నాక... అప్పుడు చెప్తాను"

నాకు వీరలక్ష్మి చెప్పకుండా చెప్పిన మాటలతో ఒక్కసారి ఒళ్లు పులకించింది. నిజమే ప్రేమ మంచి కవిత్వంలాంటిది. దాన్ని గురించి చెప్పలేం ఏమీ. తప్పులు పట్టడానికే మాటలు కావాలి. మంచిని మెచ్చుకోడానికి మాటలు అక్కర్లేదు.

మామిడి పళ్లలో అనేక జాతులున్నాయి. అవి తిన్నాం. ఒకరికి బంగినపల్లి, మరొకరికి చెరుకు రసాలు చాలా యిష్టం అని తేలింది. కాని ఎందుకు యిష్టమో చెప్పమనండి! ఏం చెప్తారో.

మనకి నిజంగా విలువైనవీ పరవశింపజేసేవీ మాటలకి అందనివే. వాటిని మాటల్లో పెట్టగలిగినవాళ్లు ఋషులూ, మహాకవులూను. అందుకే మహా వాక్యాల మహా కావ్యాల ప్రభావం చాపక్రింద నీరులా మన హృదయాల్లోకి నిశ్శబ్దంగా ప్రవహించి జీవితాల్నే మార్చేస్తుంది. వాళ్లిచ్చిన నమ్మకాన్నే మా పెళ్లి కాగానే కొంచెం నా భార్యకిచ్చాను. ఆ కొంచెం నమ్మకాన్నీ కడుపులో దాచుకుని నవమాసాలూ మోసి పెంచి పెద్దచేసింది ఆమె. ఇద్దరు పంచుకున్న నమ్మకమే ప్రేమ.

నేనిలా ఆలోచిస్తూ మురుస్తుండగా ఓ ఇద్దరు అమెరికన్ దంపతులు అక్కడికి వచ్చారు.

వాళ్లిద్దరూ గోదావరిలో స్నానం చేసి తడి బట్టలతో ఉన్నారు. ధ్యానం చేస్తున్న శ్రీహరిని ముందుగా గమనించిన భార్య భర్తని మోచేత్తో పొడిచి అతన్ని చూపించింది. ఇద్దరూ కొద్దిక్షణాలు ఏవో గుసగుసలాడారు. తరువాత దృఢ నిశ్చయానికి వచ్చి యిద్దరూ శ్రీహరి కూర్చున్న బెంచి ముందు నిలబడ్డారు. భుజాలనున్న సంచుల్ని ఓ చెట్టు మొదట్లో పెట్టి భక్తితో చేతులు జోడించి శ్రీహరి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేశారు. అతని చుట్టూ తిరుగుతూ-

"షివ్ గూరు చార్ణాం
భవ్ భయ్ హార్ణాం"

అని కలిసి పాడారు. (శివ గురు చరణం, భవ భయ హరణం అని వాళ్ల భావం)

తరువాత శ్రీహరి పాదాల దగ్గర సాష్టాంగ నమస్కారం చేశారు వాళ్లిద్దరూ. అతను ఒక క్షణం సందేహించి ఆ స్త్రీ ముఖంలోకి చూశాడు. ఆమె 'ఊఁ' అన్నట్లు తల ఆడించింది. అతను శ్రీహరి పాదాలను పట్టుకుని నేలమీంచి పైకెత్తాడు. ఆమె శ్రీహరి పాదాల క్రిందనున్న మట్టిని గబగబా పోగుచేసి గుప్పిట్లోకి తీసుకుంది. ఇద్దరూ ఆ మట్టిని విభూతి పూసుకున్నట్లు తమ మొగాలకి రాసుకున్నారు.

ఈ గొడవకి స్పృహ వచ్చి కళ్లు తెరిచాడు. శ్రీహరి. వాళ్లిద్దర్నీ చూసి మళ్లీ కళ్లు మూసుకున్నాడు. వాళ్లు సంతోషంగా (శ్రీహరి తమను చూశాడని?) తృప్తిగా ఒకరినొకరు చూసుకున్నారు, వెళ్లిపోబోతుంటే నేను వాళ్లని పలకరించాను.

పరిచయాలయ్యాయి. అతను కార్ల్, ఆమె సోనీ. ఇద్దరూ డబ్బున్నవాళ్లు. హార్వర్డ్ గ్రాడ్యుయేట్స్, వాళ్లు "జీవిత సమస్యని పరిష్కరించి శాశ్వతానందన్నిచ్చే" స్వామీ శిలానంద సరస్వతికి శిష్యులు.

స్వామి శిలానంద మహాజ్ఞాని. అందుకే అందరికీ సాధ్యమయ్యే మోక్ష మార్గం కనుగొన్నాడు. అదేమిటంటే ఎవరికి నచ్చిన రాయి వాళ్లు తీసుకెళ్లాలి; ఆయన ఆ రాయిని దీవించి వాళ్లకిస్తాడు. అపుడది పవిత్ర రాయి. ఆ రాయిని చేత్తో పట్టుకుని తన తలచుట్టూ ఇరవై ఏడుసార్లు త్రిప్పాలి ఉదయమూ, సాయంత్రమూ అలా చేయగా చేయగా సాధకుని జ్ఞానం పరిపక్వమవుతుంది. ఆత్మ జ్ఞానం, ఆత్మశక్తి, ఆత్మానందం వస్తాయి. అదే జీవన్ముక్తి.

"మరి యిప్పుడీ శ్రీహరి పూజ ఎందుకు?" అన్నాను. నా ప్రశ్న వినగానే సోనీ ముఖం, మెడ ఎర్రగా కందిపోయాయి సిగ్గుతో కార్ల్ కూడా కొంచెం సిగ్గు పడ్డాడు. అతనే చెప్పాడు. "స్వామీజీ ఎవరి రాయి వాళ్లదేనని పదే పదే చెప్పారు. ఒక రాయిని నమ్మాక దాన్ని తప్ప మరో రాయిని వాడకూడదన్నారు. సోనీకి చపలత్వం కలిగింది. నా రాయిపెద్దది. తనది చిన్నది. అంచేత కొన్నాళ్లు నా రాయిని ఎరువు తీసుకుని సాధన చేసింది.

స్వామీజీకి యిది తెలిసి చాలా కోప్పడ్డారు. నిజమే మేం చేసింది చిన్న తప్పుకాదు. ఎంత ప్రేమించుకున్నా, పెళ్లాడినా ఎవరి రాయి వాళ్లదే. గురుఆజ్ఞని ఉల్లంఘించాం కనుక మీ దేశం రావాల్సి వచ్చింది. ఇక్కడ వెయ్యిమంది మహాత్ములకి ప్రదక్షిణం చేసి వాళ్ల పాదరజం

[illegible] మమ్మల్ని ఇండియా పంపారు స్వామీజీ. మీ ఫ్రెండు ఏడువందల ఎనభై ఆరో వాడు ఇంకా."

"కాదు. ఏడువందల ఎనభై ఏడోవాడు" అంది సోనీ.

వాళ్ల వాదన ఎప్పటికి తేలేలా లేదు. చిన్నపిల్లల్లా ఒకళ్ల నొకళ్లు తోసుకుంటూ రక్కుకుంటూ వాళ్లు వాదించుకుంటుంటే శ్రీహరీ, నాకుటుంబం అక్కణ్ణించి వచ్చేశాం.

పార్కునించి బయటపడ్డాక శ్రీహరి పగలబడి నవ్వసాగాడు. "స్వామి శిలా నందట. హోహోహో. పేరుకి తగ్గట్టు రాళ్ళతోనే ఆరాధన. శిష్యుడూ, శిష్యురాలూ కూడా తగ్గవాళ్లే. వీళ్ల ఓపిక బంగారం కానూ. అమెరికా నించి పదివేల మైళ్లొచ్చి నాలాంటి వెయ్యిమంది వెధవలకి పాదపూజ చేస్తున్నారు"

ఇలా కొంతసేపు మ్లాట్లాడక హఠాత్తుగా శ్రీహరికి జ్ఞానోదయమైంది. రాళ్లను పూజించడం చాలా అనాగరిక ఆరాధన అని కొందరి భావన. కాని అత్యంతాధునికమైన అమెరికాలో రాళ్లపూజ "అందుకుంటోంది." చరిత్ర చక్ర భ్రమణం కాబోలు.

రాయి మనతో మాట్లాడదు, ఏమీ సాయం చేయదు. కాని దేవాలయాల్లో రాతి విగ్రహాల దర్శనం కోసమే జనం వెళ్తారు. నమ్ముతారు. దర్శనం కోసం బోలెడంత డబ్బు తగలేస్తారు. ఎందుకంటే దేవుడు అంతటా వున్నాడు కనుక రాయిలోనూ వున్నాడు.

"రాయినే పూజించగాలేంది మనిషిని పూజిస్తే తప్పా" అన్నాను.

"నిజమేనోయ్ గురునాథం. నేనిప్పుడే వెళ్లి సునంద కాళ్లమీద పడతాను. మాట్లాడ్డానికైతే మాటలు రావుగాని..."

"మాటలకంటే పనులు చేయడమే సులువు. మాటలన్నీ అబద్ధాలు, పనులన్నీ నిజాలు. వెళ్లు" అన్నాను.

## 18

"... ఒకటేమిటి ఏదైనా చేసేస్తాను నాక్కొంచెం నమ్మకమివ్వు!"

జీవితంలో వుండే దైవశాసనం తిరుగులేనిది. ఆ శాసనాన్ని మనం ఎంత శ్రద్ధాభక్తులతో అనుసరిస్తే అంత జీవితానందం మనకి లభిస్తుంది. ఎవరి పాప పుణ్యాల ఫలితాలను వారనుభవించక తప్పదు.

అంతదాకా మా తాత బోధలనుంచీ, ఋషుల, మహాకవుల రచనల్నించీ నేను పొందిన యీ నమ్మకం మంత్రధ్యానం చేసేకొద్దీ మరింత శక్తివంతమూ, విస్తృతమూ కాసాగింది నాలో, నిద్ర లేవగానే నాకు రోజూ నా గురువే గుర్తు కొస్తాడు. ఆయన్ని అమ్మా అనో, నాన్నా అనో, దేవా అనో పిలుస్తూ నా కృతజ్ఞతలు తెలియజేయడంలో నా దినచర్య మొదలవుతుంది. ఇంటా బయటా నాకు అన్ని శుభాలు, విజయాలు ఎదురవుతున్నాయి.

ఒకనాడు నేను ధ్యానం చేస్తూ చేస్తూ ఏవో వింతలోకాల్లో మునిగి పోయాను. అక్కడ

నా గురువు పరిపూర్ణ తేజస్సుతో దర్శనమిచ్చి "ఇంక నువ్వు కాలకూట విషాన్ని మింగ వచ్చురా" అన్నాడు. ఆయన పాదాలను పట్టుకుని "తమ ఆజ్ఞ" అన్నాను. అలా మొదలైంది ఆయన బోధ.

జీవితం ఒక్కటే. సృష్టి అంతా కలిపి ఒక్కటే ఆత్మ. మనిషి తనకున్న దంతా అందరికీ పంచాలి. అన్నాన్ని నమిలేది నోరు అయినా ఒళ్లంతా అన్న సారం ప్రసరించినట్లు ఏ మనిషి ఏం చేసినా సృష్టి అంతటికీ చెందాలి. మనిషి తన వద్దనున్నదే ఇతరులకి పంచగలడు. శక్తి వుంటే శక్తినీ, నీరసం వుంటే నీరసాన్నీ, నమ్మకం వుంటే నమ్మకాన్నీ, సంశయం వుంటే సంశయాన్నీ... ఏదైనా తనకున్నదే తప్ప లేనిది ఈయలేడు.

"నీకు నేను సృష్టిలో దివ్యత్వాన్నీ, మంచినీ నమ్మడం నేర్పాను. ఆ నమ్మకాన్నే అందరికీ పంచు" అన్నాడు రామయోగి.

నేను మత ప్రచారకుణ్ణి కాను, మామూలు ఫ్యాక్టరీ ఉద్యోగిని. అంచేత నా మిత్రులకీ, నా సలహా కోరినవాళ్లకీ మాత్రమే నేను సాయం చేయడం మొదలు పెట్టాను అన్ని విధాలా.

కొన్నాళ్ళు బాగానే సాగింది నా ప్రయత్నం. కాని ఆటంకాలు రాసాగాయి. నన్ను ప్రతి ఘటించేవాళ్లూ, అవహేళన చేసేవాళ్లూ, మొహం మీదే తిట్లేవాళ్లూ ఎదురయ్యారు. వాళ్ల మాటల్లో నాకు శ్రీహరి వాదాల ప్రతిధ్వనులు కనిపించసాగాయి.

మంచికి పోతే చెడు ఎదురవటం అంటే ఇదేనేమో. "పోవయ్యా, ఇవి న్యాయానికి రోజులు కావు" అని కొందరూ, "ఇన్ని కోట్లమందికి కష్టాలు తీర్చే అవతారం దిగాడోయ్" అని కొందరూ, సింపుల్‌గా "పెటీ బూర్జువా రియాక్షనరీ" అని కొందరూ నన్ను నిందించసాగారు. నేనొకనాడు డ్యూటీ అయ్యాక ఇంటి కొచ్చి నా దుఃఖాన్ని గురువు ముందుంచాను. "తండ్రీ ఇదేనా నువ్వు చెప్పిన కాలకూట విషం? దాన్ని మింగే శక్తిని నువ్వే నాకిచ్చావు. అది నీ కరుణ. కాని మిగతా జనం మాటేమిటి. వాళ్ల ద్వేషాన్నీ, అసూయనీ జీవిత వేదాంతం అనుకొంటు న్నారు. మంచిని నమ్మడం మరిచిపోయారు. అన్యాయమే రాజ్యం చేస్తోంది కనుక మనమూ అన్యాయమే చేయాలంటున్నారు. నేనేం చేయను? న్యాయమే గెలుస్తుందని వాళ్లని ఎలా నమ్మించను?"

నా గురువు కళ్లలోని కరుణ నాకు ఉపశాంతినిచ్చింది. "అదెంత గోపాలం? నమ్మకాలు రెండు రకాలు. మంచిని నమ్మడం, చెడుని నమ్మడం, నువ్వు ముందుగా అపనమ్మకాల్ని అర్థం చేసుకో. ఆభాషలోనే చెప్పాలి కొందరికి. అప్పుడే నిన్ను నమ్ముతారు. నువ్వెళ్లి శ్రీహరి సిద్ధాంతాల్ని నేర్చుకో. అవన్నీ బాధతో, దుఃఖంతో మతిపోయిన వాళ్ల నమ్మకాలు. వాటి భాష పీడితప్రజలు భాష, తిరగేసిన వేదాలు అవి! వెళ్లు. శ్రీహరి తన పుస్తకాలన్నీ తగల పెట్టాలను కుంటున్నాడు. త్వరపడు" అన్నాడు రామయోగి.

నేను వీరలక్ష్మితో చెప్పి శ్రీహరి యింటికి పరుగెత్తాను.

శ్రీహరి చుట్టూ గుట్టలుగా పడివున్నాయి అతని పుస్తకాలు. నేనువెళ్తూనే "వాటినిక్కడ

తగలేస్తే మీ యింటివాళ్లు కరిచేస్తారోయ్ పరశురామ్" అన్నాను.

"నీకెలా తెలిసింది?" అన్నాడు శ్రీహరి.

"ఎలా తెలిసిందో తెలిసింది. ఆ పుస్తకాలన్నీ నాక్కావాలి" అన్నాను.

"ఇవన్నీ విషం. నీకెందుకు. నేననుభవించిన నరకం నీకు కావాలా?"

"కావాలి. విషం గురించీ, బాక్టీరియా గురించి తెలీకుండా డాక్టర్ వైద్యం చేయలేనట్లే కేవలం మంచి గురించే తెలిసి చెడు గురించి తెలీనివాడు ఏమీ సాధించలేడు"

"అయితే ఈ పుస్తకాలు పూర్తిగా నిరుపయోగం కాదా?"

"ఓర్నీ! అలా అనుకుంటున్నావా. అవి అపురూపమైన విజ్ఞాననిధానాలు. నీకు తెలుసనుకున్నానే!"

శ్రీహరి కళ్లు కొత్త వెలుగుల్ని నింపుకున్నాయి. అప్పుడే లోపల్నించి వచ్చిన సునంద కూడా మమ్మల్ని ఆశ్చర్యంగా చూడసాగింది.

నా గురువు ధ్యానంలో నాకు ఏం చెప్పాడో వాళ్ల మాటల్లో చెప్పాను. అంతా విని ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకుని నవ్వుకున్నారు. శ్రీహరి లేచి వచ్చి నన్ను కావిలించుకుని డాన్స్ చేయసాగాడు. సునంద కిలకిలా నవ్వుతూ చప్పట్లు కొట్టింది.

ముగ్గురం ఆరుబయట వెన్నెట్లో కూర్చున్నాం. కబుర్లలో ఆటంబాంబు నుంచి అల్లప్పచ్చడి వరకూ ఎన్నో విషయాలు వచ్చాయి. అలా ఎంతసేపున్నామో తెలీదు. కాని మా సమావేశంలోకి వీరలక్ష్మి. చిన వీరబసవయ్య కూడా చేరారు చివరకి. లోకానికి సేవ చేసే మార్గాలను చర్చించి చర్చించి కొన్ని పథకాలను వేశాం. "మనం చేయగలిగిన పనుల్నే చేయగలం" అన్నాడు శ్రీహరి. "నాకు పిల్లి మొగ్గలు కూడా చాతవును" అన్నాడు చిన వీరబసవయ్య.

అంకితం

★ స్వర్గీయ 'బైరాగి' మహాకవికి ★

(స్వాతి, మాసపత్రిక, అక్టోబర్ 1990)

★